మీరు కలలుకనే ఉద్యోగాల కోసం
ఈనాడు APPOINTMENTS
ప్రతీ మంగళవారం & శుక్రవారం

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

SPEEDY GOLD LOAN
మీ బంగారు ఆభరణాలపై తక్షణమే రుణం
నెలకు వడ్డీ కేవలం 95 పైసలు మాత్రమే
ప్రతీ గ్రాముపై అత్యధిక బుణం
SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
040-30915112 SCUF GOLD to 54999 MISSED CALL 044-30123479

కరీంనగర్ 12-8-2019 సోమవారం సిటీ సంపుటి 46 సంచిక 3
రూ. 6-50. పేజీలు 14+12 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

వణికిస్తున్న వరదలు

నాలుగు రాష్ట్రాల్లో 183 మంది మృతి

- కేరళలో 65 మంది సజీవ సమాధి?
- మహారాష్ట్రలో 40కి చేరిన మృతుల సంఖ్య
- కర్ణాటకలో నష్టం రూ. 40 వేల కోట్లు
- గుజరాత్‌ను ముంచెత్తుతున్న వర్షాలు
- శ్రీశైలం, తుంగభద్రకు భారీగా ప్రవాహం
- సాగర్‌కు 7.50 లక్షల క్యూసెక్కుల విడుదల

ఎడతెరిపి లేని వర్షాలకు దేశమంతా తడిసి ముద్దవుతోంది. వాన వరదై పలు రాష్ట్రాలను వణికిస్తోంది. దక్షిణ, పశ్చిమ భారతంలో నీటి ఉధృతితో జనజీవనం అతలాకుతలమవుతోంది. కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకల్లో వరదలకు ఇప్పటివరకు 183 మంది మృత్యువాతపడ్డారు. కేరళలోని మళప్పురం జిల్లాలో కొండచరియ విరిగిపడిన ఘటనలో 65 మంది సజీవసమాధి అయ్యారని అనుమానిస్తున్నారు. గుజరాత్‌లో వరద మృతుల సంఖ్య 31 దాటింది. కర్ణాటకనూ వరద ముంపు వీడలేదు. ఇక్కడ సగటు కంటే 10 - 20 రెట్లు ఎక్కువ వర్షపాతం నమోదవుతుండడంతో ప్రజల కష్టాలు రెట్టింపవుతున్నాయి. ఎగువన వర్షాలకు తెలుగు రాష్ట్రాల్లో.. శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. 10 గేట్లు ఎత్తి 7.50 లక్షల క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. తుంగభద్ర గేటెత్తి జలధారను దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి కాస్త శాంతించడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. లంక గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ముంపు వీడక ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు.

తుంగభద్ర వరద ముంపులో బాగల్‌కోట జిల్లాలోని త్రివేణి సంగమం.. సంగమేశ్వర ఆలయం

...వివరాలు 2లో

ఉప్పొంగిన మానవత

నడుము లోతు నీటిలో 1.5 కిమీ..

చుట్టూ మొలలోతున వరద నీరు. ఇద్దరు బాలికలు. వరద నీటిలో నడిపించేంత పెద్దవారు కాదు. అలాగని ఎక్కువసేపు ఎత్తుకోగలిగేంత చిన్నవాళ్లు కాదు. అయితేనేం గుజరాత్ పోలీసు కానిస్టేబుల్ పృథ్వీరాజ్‌సింగ్ జడేజా వారిని భుజాలపైకి ఎత్తుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో గుజరాత్‌లోని పలు నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో అహ్మదాబాద్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోర్బీ జిల్లాలోని ఓ గ్రామం జలమయమైంది. సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీస్ కానిస్టేబుల్ పృథ్వీరాజ్‌సింగ్ జడేజా వరద నీటిలో చిక్కుకున్న ఇద్దరు బాలికలను తన భుజాలపై ఎత్తుకుని సుమారు 1.5 కిలోమీటర్ల దూరం నడిచి సురక్షిత ప్రాంతానికి చేరవేశారు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన ఈ వీడియో చూసి గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తదితరులు పృథ్వీరాజ్‌ను అభినందిస్తూ తమ ట్విటర్ హ్యాండిల్‌లో వీడియోను ఉంచారు.

సినీ దర్శకుడు కె.విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న సీఎం కేసీఆర్

దేశ చలనచిత్ర కేంద్రంగా తెలంగాణ

- హైదరాబాద్ ముంబయిని మించిపోతుంది
- అందుకు అనుగుణంగా త్వరలో కొత్త విధానం
- దర్శకుడు విశ్వనాథ్ వద్ద ప్రస్తావన
- ప్రగతి భవన్‌లో సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: భారతదేశ చలనచిత్ర రంగానికి తెలంగాణను ప్రధాన కేంద్రం (హబ్)గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కొత్త చలనచిత్ర విధానాన్ని రూపొందిస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. చలన చిత్రాల నిర్మాణంలో ముంబయిని మించిపోయేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఆదివారం ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ వద్ద ఇదే అంశాన్ని కేసీఆర్ ప్రస్తావించారు. అనంతరం ఆయన తమ నివాసంలో అధికారులు, నేతలతో సమావేశమై దీనిపై చర్చించారు. "తెలంగాణ చలనచిత్ర రంగంలో మరింత అభివృద్ధిని సాధించాలి. హైదరాబాద్‌కు ఎన్నో ఆకర్షణలున్నాయి. అన్ని విధాలా అనుకూలమైన చక్కటి వాతావరణం ఉంది. చిత్రీకరణకు అనువైన ప్రాంతాలు, వనరులున్నాయి. బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ సహా పలువురు బాలీవుడ్ ప్రముఖులు, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడి అనుకూలతలను ప్రశంసించారు. దేశంలో అత్యధిక చిత్రాల నిర్మాణం ఇక్కడే జరగాలి. చలనచిత్ర రంగం తెలంగాణ అభివృద్ధిలో ప్రధాన పోషించాలి. దీనికి ఏమేం చేయాలో అది చేస్తాం. చలనచిత్ర రంగం అవసరాలు, ఆకాంక్షలను పరిగణనలోనికి తీసుకొని కొత్త విధానం తేవాలన్నదే మా ఆకాంక్ష. దీనికోసం ఏమేం చేయాలో అది చేస్తాం. కొత్త విధానంపై త్వరలోనే ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి, నిర్ణయాలు తీసుకుంటాం' అని సీఎం చెప్పారు.

కొత్త ఐటీ సెజ్

రాష్ట్రంలో ఏర్పాటుకు ముందుకొచ్చిన మహతా ఇన్ఫర్మేషన్ ఇండియా

- నానక్‌రామ్‌గూడలో 7.172 ఎకరాల్లో ఏర్పాటుకు దరఖాస్తు
- 12,870 మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడి
- సూత్రప్రాయ ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: దాదాపు దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కొత్త ఐటీ సెజ్ ఏర్పాటు కాబోతోంది. రాష్ట్రంలో 68 సెజ్(స్పెషల్ ఎకనమిక్ జోన్)లు ఉన్నాయి. ఇందులో 42 ఐటీవి. మిగిలినవి ఇతర రంగాలవి. చివరిసారిగా 2009లో ఐటీ సెజ్ ఏర్పాటయింది. ఐటీ రంగంలో ఒడిదుడుకుల కారణంగా ఆ తర్వాత ఈ రంగంలో కొత్త సెజ్‌లు ప్రారంభంకాలేదు. తాజాగా మహతా ఇన్ఫర్మేషన్ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని నానక్‌రామ్‌గూడలో రూ.1,147 కోట్ల పెట్టుబడితో 7.172 ఎకరాల్లో దీనిని నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దరఖాస్తు చేసుకుంది. మొత్తం రూ.2,088 కోట్ల విలువైన ఎగుమతులు సాధిస్తామని, 12,870 మందికి ఉపాధి కల్పిస్తామని నివేదించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని అనుమతుల మండలి ఆమోదం కోసం దీనిని పంపించింది. ఈ నెల ఆరున మండలి సమావేశం జరిగింది. అందులో దీనిపై చర్చించారు. మండలి నుంచి అధికారికంగా అనుమతి రావాలి. అది లభించిన వెంటనే సెజ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. భారీ ఉపాధి అంచనాలతో కొత్త ఐటీ సెజ్ వస్తుండడం ఈ రంగంలో ఆశావహ పరిణామం.

అనాథ శవాన్ని చూస్తే
పక్కకు తప్పించుకుపోతారంతా...
కానీ ఆయన మాత్రం బాధ్యత
తీసుకుంటారు...
అంతిమ సంస్కారం మొత్తం తానే చేస్తారు.
అలా ఒకటీ, రెండూ కాదు 12 వేల శవాలకు
అంత్యక్రియలు చేశారాయన...

వంటింట్లో మిగిలిన అన్నం, పప్పు,
కూరలను పడేయకండలా...
మనసు పెడితే అవి వంటింటికి
ఇంధనమవుతాయి... పెరటింటికి
పోషకమవుతాయి...

అనగనగా ఓ ఊరు...
ఆ గ్రామ దేవత గాంధీ...
అదేనండీ మన మహాత్ముడు...

- ఆసక్తికరమైన కథనాల సమాహారం...

నేటి వారవ్వా! లో

కారణాలేవైనా చిన్న వయసులోనే ముఖంపై ముడతలు, గీతలు... అమ్మాయిల్ని కలవరపెడుతున్నాయి. ముప్పై రాకముందే నలభై ఏళ్లవారిలా కనిపించేలా చేస్తున్నాయి. సమస్యకు కారణాలు.. దీన్ని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

నేటి వసుంధర లో

మభ్యపెడితే దండనే..

వినియోగదారుల హక్కులు ఇకపై మరింత పదిలం

- కేంద్ర స్థాయిలో తాజాగా రక్షణ అథారిటీ
- అనుబంధంగా ఓ దర్యాప్తు సంస్థ కూడా
- అనైతిక ప్రకటనలకూ చెక్
- మోసపూరిత ప్రకటనల్లో ఉన్న సెలబ్రిటీలపైనా చర్యలు
- వినియోగదారుల ఫోరంల స్థానే కమిషన్లు
- కొత్త చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర

ఈనాడు, హైదరాబాద్: అనైతిక వ్యాపారాలు... ఉత్పత్తులు...ప్రకటనలకు చెక్ పెట్టి వినియోగదారుడికి అండగా ఉండటానికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త వినియోగదారుల చట్టాన్ని తెచ్చింది. 1986నాటి వినియోగదారుల చట్టానికి మరింత పదును పెడుతూ ఆధునిక వ్యాపారాలకు అనుగుణంగా మార్చింది. ఉభయ సభలు ఆమోదించిన ఈ చట్టాన్ని ఈ నెల 9న నోటిపై చేశారు. శనివారం రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుతం ఉన్న వినియోగదారుల ఫోరాలు ఇకపై కమిషన్లుగా పని చేయనున్నాయి. వినియోగదారుల హక్కులను కాపాడడానికి... అనైతిక వ్యాపారాలను... తప్పుదారి పట్టించే ఆకర్షణీయమైన ప్రకటనలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం కింద ఓ రక్షణ అథారిటీని ఏర్పాటు చేయనుంది. చీఫ్ కమిషనర్ నేతృత్వం వహిస్తారు. మరికొందరు కమిషనర్లు ఉంటారు. దీని ఆధ్వర్యంలో ఓ దర్యాప్తు సంస్థ ఏర్పాటవుతుంది. ...మిగతా 2లో

సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల 2లో
కాళేశ్వరం బాహుబలి మోటారు వెట్‌రన్ విజయవంతం 6లో

ఇదీ సంగతి!

రాష్ట్రానికి జ్వరమొచ్చింది!

- వాతావరణ మార్పులతో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
- వేధిస్తోన్న జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి
- గత 45 రోజుల్లోనే 50 వేల మంది బాధితులు
- వీరిలో 50 శాతం మంది చిన్నారులే
- హైదరాబాద్‌లో అత్యధిక కేసుల నమోదు
- దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

వాతావరణంలో చోటుచేసుకున్న అనూహ్య మార్పుల కారణంగా రాష్ట్రంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి తదితర లక్షణాలతో కూడిన జ్వరంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జులై 14 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసర శ్వాస కోశ సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు సుమారు 2.50 లక్షల మంది కాగా, గత 45 రోజుల్లోనే సుమారు 50 వేల మంది బాధితులు ఈ లక్షణాలతో సర్కారు దవాఖానాల్లో ...మిగతా 2లో

అత్యవసర శ్వాసకోశ సమస్యలు అత్యధికంగా నమోదైన జిల్లాలివి..

	జనవరి 1 నుంచి జులై 14 వరకూ	జూన్ 1 నుంచి జులై 14 వరకూ
హైదరాబాద్	62880	13345
భద్రాద్రి కొత్తగూడెం	20655	3596
రంగారెడ్డి	13105	2982
వరంగల్ పట్టణ	10952	2132
నిజామాబాద్	9882	2075
జయశంకర్ భూపాలపల్లి	9533	1972
మహబూబ్‌నగర్	9133	2059
ఖమ్మం	9099	1531
నల్గొండ	7804	1437
మహబూబాబాద్	7759	1306
నాగర్‌కర్నూల్	7219	1587
సిరిసిల్ల	7077	1423
సంగారెడ్డి	7033	893

బాలికపై ముగ్గురి అత్యాచారం

- అవమానం భరించలేక బాధితురాలి ఆత్మహత్య
- వరంగల్‌లో మరో ఘోరం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

భీమారం - న్యూస్‌టుడే

వరంగల్‌లో చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటన మరవక ముందే మరో దారుణం జరిగింది. హన్మకొండలో ఓ బాలికపై శనివారం సాయంత్రం ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ అవమానం భరించలేక ఆదివారం తెల్లవారుజామున బాలిక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బంధువులు చెప్పిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రులు లేని 15 ఏళ్ల బాలిక నానమ్మ వద్ద ఉంటూ ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన తిరుపతి, ప్రసన్నకుమార్ అనే యువకులకు ఆ బాలికతో పాత పరిచయం ఉంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆ బాలిక ఇంటికి వచ్చిన ఆ యువకులు.. మాయమాటలు చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై పెంబర్తి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. వీరితోపాటు ఓ మైనర్ బాలుడు కూడా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ముగ్గురూ పారిపోయారు. ఇంటికి వచ్చిన బాలిక జరిగిన విషయాన్ని తన నానమ్మకు తెలిపింది. ఆ తరువాత ఆదివారం ...మిగతా 2లో

విశ్వనాథుని వీరాభిమానిని

- ఆయన నుంచి మరో సందేశాత్మక చిత్రం రావాలి
- నిర్మాణ బాధ్యతలు నేనే తీసుకుంటా
- ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి
- దర్శకుడు కె.విశ్వనాథ్‌తో ఆయన నివాసంలో భేటీ
- గంటసేపు సినిమాలు, సాహిత్యంపై చర్చ

ఈనాడు - హైదరాబాద్

సినిమాను ఓ తపస్సులా నిర్మించే సినీ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్‌ను తాను చిన్నతనం నుంచే అభిమానించే వాడినని సీఎం కేసీఆర్ అన్నారు. ఆయన్ను కలవాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నానని, ఇప్పటికి ఆ కల నెరవేరిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని విశ్వనాథ్ నివాసానికి సీఎం కేసీఆర్ వెళ్లారు. శనివారం రాత్రి ఆయన విశ్వనాథ్‌కు స్వయంగా ఫోన్ చేసి, ఇంటికి వస్తున్న సమాచారం అందించారు. సీఎం వెంట మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, తెరాస ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్ రెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్, ఆయన భార్య జయలక్ష్మి, కొడుకు రవీంద్రనాథ్, కోడలు గౌరి, దర్శకుడు ఎన్.శంకర్ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. విశ్వనాథ్ దంపతులను కేసీఆర్ పట్టువస్త్రాలతో సన్మానించారు. తర్వాత విశ్వనాథ్ కుటుంబ సభ్యులు సీఎంను సత్కరించారు.

అనంతరం సీఎం ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. తదుపరి ఇద్దరూ సినిమాలు, భాష, సాహిత్యం తదితర అంశాలపై గంటకుపైగా చర్చించుకున్నారు. "చిన్నప్పట్నుంచి మీ సినిమాలంటే చాలా ఇష్టం. మీరు తీసిన ప్రతి సినిమా చూశా. శంకరాభరణం 25 సార్లకు పైగా చూసుంటా. దాదాపు అన్ని సినిమాలు అలాగే చూశా. మీరు తీసే ప్రతి సినిమా ఓ కావ్యంలా ఉంటుంది. అందులో వాడే భాష, పాటలు, కళాకారుల ఎంపిక, సన్నివేశాల చిత్రీకరణ, సంభాషణలు ఇలా ప్రతీదీ గొప్పగా ఉంటాయి. కుటుంబమంతా కూర్చుని చూసేలా ఉంటాయి. ఇప్పటికీ వీలు దొరికినప్పుడల్లా మీ సినిమాలు చూస్తుంటా. సినిమాలను ఓ తపస్సులా నిర్మించడం వల్లనే అది సాధ్యమయిందనుకునేవాణ్ని. సినిమా చూసిన ప్రతిసారీ మిమ్మల్ని ఓ సారి కలవాలనిపించేది. ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరింది. మీపై ఉన్న అభిమానమే నన్ను మీ దగ్గరకి తీసుకొచ్చింది. మిమ్మల్ని కలవడం, మీతో మాట్లాడడం నా అదృష్టంగా భావిస్తున్నా. మీ సినిమాలు రాక పదేళ్లయింది. సందేశాత్మక, గొప్ప సినిమాలు ఈ మధ్య రావడం లేదు. మీరు మళ్లీ సినిమా తీయాలి. సహాయకుల ద్వారా మీ మార్గదర్శకత్వంలో సినిమా తీసేందుకు సిద్ధమైతే, నిర్మాణ బాధ్యతలు స్వీకరించడానికి నేను సిద్ధం. దీనికోసం ప్రణాళిక సిద్ధం చేయండి" అని ముఖ్యమంత్రి విశ్వనాథ్‌ను కోరారు.

మీ రాకతో మా ఇల్లు పావనం: విశ్వనాథ్

మీరు అడుగు పెట్టడంతో మా ఇల్లు పావనమైందని ఈ సందర్భంగా విశ్వనాథ్ ఆనందం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి స్వయంగా మా ఇంటికి రావడం మా అదృష్టం. 'ఇంటికి వస్తున్నానంటూ' మీరు ఫోన్‌లో చెబుతుంటే ఎవరో గొంతు మార్చి మాట్లాడుతున్నారని అనుకున్నా. మీరే మాట్లాడారని తేల్చుకున్నాక రాత్రి 12 గంటల వరకు నిద్ర పట్టలేదు. మీరు చేసే సంక్షేమ కార్యక్రమాలు, ప్రజల కోసం తపించే తత్వం టీవీల్లో, పత్రికల్లో చూస్తుంటా. నేరుగా చూడడం ఇదే మొదటి సారి. చాలా సంతోషంగా ఉంది. గతంలో మీలాగే ఒకసారి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. మీకు తెలుగు భాషపైనా, సాహిత్యంపైనా మంచి పట్టుంది. ప్రపంచ తెలుగు మహాసభలను గొప్పగా నిర్వహించారు. మీరు చక్కగా మాట్లాడతారు. మంచి కళాభిమానివి కూడా కావడం ప్రజల అదృష్టం" అని సీఎంను విశ్వనాథ్ కొనియాడారు.

విమర్శలు అలవాటైపోయాయి

"మీరు చాలా కష్టపడి ప్రాజెక్టులు కడుతున్నారు. అయినా విమర్శలు తప్పడం లేదు. వీటిని ఎలా భరిస్తున్నారు?" అని ఈ సందర్భంగా సీఎంను విశ్వనాథ్ అడగగా.. "రాజకీయాల్లో ఇవన్నీ అలవాటైపోయాయి. తప్పదు కూడా. ప్రజల కోసం పనిచేస్తున్నామనే ఉద్దేశంతో వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. పని చేసుకుంటూ పోతున్నా" అని ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానమిచ్చారు. 'ప్రజల కోసం చేసే పనికి దైవ కృప ఉంటుంది" విశ్వనాథ్ దీవించారు. అనంతరం కేసీఆర్‌కు విశ్వనాథ్ దంపతులు, కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.

విశ్వనాథ్ కుటుంబ సభ్యులతో కేసీఆర్

శంకరాభరణం 25 కంటే ఎక్కువసార్లు చూశా

"ఉన్నత విలువలతో కూడిన ఎన్నో గొప్ప చిత్రాలను ప్రేక్షకులకు అందించిన దర్శకుడు విశ్వనాథ్‌కు నేను వీరాభిమానిని. ఆయన తీసిన ప్రతి చిత్రాన్నీ చూశా. శంకరాభరణం చిత్రాన్ని 25 కంటే ఎక్కువ సార్లు చూశా. ఆయన ఆధ్వర్యంలో సమాజానికి సందేశం అందించే మరో చిత్రం రావాలని ఆకాంక్షిస్తున్నా. ఆయన దర్శకత్వ బాధ్యతలు చేపడితే, నిర్మాణ పరమైన విషయాలు నేనే చూసుకుంటా."

– ముఖ్యమంత్రి కేసీఆర్

ఆసుపత్రి అంటే భయం.. అందుకే నా సినిమాలో ఆ సీన్లుండవు

"ఆరోగ్యం బాగానే ఉంది. మోకాళ్ల నొప్పులున్నాయి. ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు అంటున్నారు. నాకు ఆపరేషన్ అంటే భయం. అసలు హాస్పిటల్ అంటేనే భయం. అందుకే నా సినిమాల్లో ఎక్కడా ఆసుపత్రి సీన్లు పెట్టను. రక్తం అంటే భయం. ఇక నేనేం ఆపరేషన్ చేయించుకుంటా. ఇలాగే గడిపేస్తా"

– తన ఆరోగ్యంపై ఆరా తీసినప్పుడు సీఎంతో విశ్వనాథ్

కుచేలుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్లుగా ఉంది

సీఎం వెళ్లిపోయిన తర్వాత విశ్వనాథ్ విలేకరులతో మాట్లాడారు. సీఎం ఇంటికి రావడాన్ని ఎలా భావిస్తున్నారంటూ దర్శకుడు శంకర్ సహా విలేకర్లు ప్రశ్నించగా "కుచేలుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్లుగా" ఉందని సమాధానమిచ్చారు. ఆయన మర్యాదపూర్వకంగానే వచ్చారని, దానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదన్నారు. ఓ మూమూలు వ్యక్తిగా, అభిమానిగా సీఎం తనను కలిశారని చెప్పారు. "అజ్ఞాత అభిమానిని అంటూ కేసీఆర్ పేర్కొన్నందుకు గర్వపడుతున్నా. మా మధ్య సాహిత్యానికి సంబంధించిన అంశాలపైనా చర్చ జరిగింది. చిన్నతనంలో తన గురువు నేర్పిన ఓ పద్యం గురించి కేసీఆర్ చర్చించడం నాకు ఆనందం కలిగించింది. కేసీఆర్‌లో ఇన్ని కోణాలు ఉన్నాయని నేను అనుకోలేదు. ఆయన మాటలు వింటే చాలా ఆశ్చర్యం కలిగింది. సినిమా తీయాలని అభిమానులు కోరుతున్నారు. నాకు మాత్రం ఓపిక లేదు. ఇకపై నేను సినిమాలు తీయను' అని విశ్వనాథ్ అన్నారు.

కాళేశ్వరం నీళ్లు వస్తున్నప్పుడు మీ కళ్లతో ఆనందం చూశా: విశ్వనాథ్ సతీమణి

"కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. దానివల్ల రైతుల కష్టాలు తీరుతాయి. కాళేశ్వరం నీళ్లు వస్తున్నప్పుడు మీ కళ్లలో ఆనందం చూశా. రైతులకు సాగునీరు ఇవ్వాలనే మీ తపన విజయవంతం అవుతుంది" అని విశ్వనాథ్ భార్య జయలక్ష్మి సీఎంతో అన్నారు. గోదావరి, కృష్ణా నదుల్లో పుష్కలంగా నీళ్లున్నాయని, వాటిని రెండు రాష్ట్రాలు సద్వినియోగం చేసుకుంటే రెండు రాష్ట్రాల రైతులకు మేలు కలుగుతుందని, ప్రస్తుతం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అదే పనిలో ఉన్నాయని కేసీఆర్ బదులిచ్చారు.

నేడు కంచి, తిరుమలకు సీఎం

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం కాంచీపురం, తిరుమల పర్యటనకు వెళ్తున్నారు. ఉదయం 8.55కి ప్రత్యేక విమానంలో ఆయన బేగంపేట నుంచి కుటుంబ సమేతంగా బయల్దేరుతారు. 9.55కి తిరుపతి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కంచికి వెళతారు. అక్కడ అత్తి వరదర్ స్వామి వారిని దర్శించుకుని అనంతరం తిరుపతికి వస్తారు. ఒంటిగంటకు తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటారు. సాయంత్రం 3 గంటలకు తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనాడు, హైదరాబాద్ : బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ప్రస్తుతం ఈశాన్య ప్రాంతంలో 3.1 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఉంది. తెలంగాణలో సోమ, మంగళ వారాల్లో తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఆదివారం పగలు 37 ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. గత రెండు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాలు లేవు. ప్రస్తుతం వాతావరణం సాధారణంగా ఉంది.

బాలికపై ముగ్గురి అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లి తిరిగి వచ్చిన నానమ్మ ఈ విషయాన్ని గుర్తించి ఇరుగు పొరుగు సాయంతో కేయూ పోలీసులకు సమాచారం అందించారు. డీసీపీ నాగరాజు, హన్మకొండ ఏసీపీ శ్రీధర్, కేయూ సీఐ డేవిడ్‌రాజ్, ఎస్సై హరికృష్ణ రంగంలోకి దిగి.. బాధితురాలి నానమ్మను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన తిరుపతి, మైనర్ బాలుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు ప్రసన్నకుమార్ పరారీలో ఉన్నట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలి బంధువులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కేయూ పోలీసు స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు.

బాలిక మృతదేహానికి శవపరీక్ష

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: అత్యాచార అవమానం భరించలేక ఆత్మహత్యచేసుకున్న బాలిక మృతదేహానికి ఆదివారం రాత్రి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు. హడావుడిగా పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మార్చురీ వద్ద బాలిక మృతదేహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఎడమకాల్వకు విడుదలవుతున్న కృష్ణా జలాలు ● కృష్ణమ్మకు హారతి ఇస్తున్న తెలంగాణ, ఏపీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

- ప్రారంభించిన తెలుగు రాష్ట్రాల మంత్రులు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే : నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఆదివారం నీటిని విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కలిసి ఉదయం 11.40 గంటలకు ఎడమకాల్వ హెడ్‌రెగ్యులేటర్ వద్ద స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. అంతకు ముందు కృష్ణానదికి ప్రత్యేక పూజలు చేసి చీర సారె సమర్పించారు. నీటి విడుదల అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ పక్కరాష్ట్రాలతో కలివిడిగా ఉన్నప్పుడే అందరూ సుఖశాంతులతో ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీతో సఖ్యతగా ఉండి తెలంగాణను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. వనరులను అందరూ కలిసి సద్వినియోగం చేసుకున్నప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏపీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే సామెతను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారని తెలిపారు. జలాలు సముద్రంలో కలిసి వృథా కాకుండా సద్వినియోగం చేయడానికి కేసీఆర్ పలు ప్రాజెక్టులను నిర్మించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ మురళీధర్‌రావు, ఎన్నెస్పీ సీఈ నర్సింహ, నల్గొండ జిల్లా శాసన సభ్యులు, తెరాసకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోజుకు పదివేల క్యూసెక్కులు

ఆదివారం ఉదయం ఎడమకాల్వకు 1000 క్యూసెక్కులతో నీటి విడుదలను ప్రారంభించారు. దీనిని గంట గంటకు పెంచుతూ రోజుకు పదివేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎస్‌ఈ మధుసూదన్ తెలిపారు.

మభ్యపెడితే దండనే..

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు రంగంలో అనుభవం ఉన్న డైరెక్టర్ జనరల్, అదనపు డైరెక్టర్ జనరల్, డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్‌లు ఇందులో నియమితులవుతారు. దర్యాప్తులో భాగంగా సీఆర్‌పీసీ నిబంధనల ప్రకారం దీనికి సోదాలు, జప్తు చేసే అధికారం ఉంది. అథారిటీ వాణిజ్య ప్రకటనలను ఎప్పటికప్పుడు సునిశితంగా పరిశీలిస్తుంది. అందులో మోసం, దగా వంటివి ఉన్నట్టు భావిస్తే సుమోటోగా కేసులు తీసుకొని దర్యాప్తు చేయిస్తుంది. వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లినట్లు తేలితే అలాంటి సర్వీసులు, ఉత్పత్తులను నిలిపివేసే అధికారం ఈ అథారిటీకి ఉంది. ఏవైనా తప్పుడు ప్రకటనలు, అనైతిక వ్యాపారాలపై ఫిర్యాదులందితే వాటిని జిల్లా కలెక్టర్లకు పంపి నివేదిక కోరవచ్చు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఆయా మంత్రిత్వ శాఖలకు సిఫార్సులు చేయవచ్చు. వాణిజ్య ప్రకటనలు మోసపూరితమని భావిస్తే సాధారణ పౌరులు కూడా రక్షణ అథారిటీని ఆశ్రయించవచ్చు.

- వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు జారీ చేసిన తయారీదారు, ప్రకటనలో ఉన్న వ్యక్తులకు రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అధికారం అథారిటీకి ఉంది.
- మోసపూరిత ప్రకటనల్లో ఉన్న సెలబ్రిటీలు మరే వాణిజ్య ప్రకటనల్లో పాల్గొనకుండా ఏడాది నుంచి మూడేళ్ల వరకు నిషేధం విధించవచ్చు.
- అథారిటీ ఆదేశాలను అమలు చేయని పక్షంలో 6 నెలల వరకు జైలు శిక్ష, రూ.20 లక్షల వరకు జరిమానా, లేదంటే రెండూ విధించవచ్చు.
- వినియోగదారుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే ఉత్పత్తిదారు, సర్వీసు ప్రొవైడర్, తప్పుడు ప్రకటనలు జారీ చేసినవారికి రెండేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించవచ్చు. అదే తప్పు పునరావృతం చేస్తే 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా ఉంటుంది.
- కల్తీలకు పాల్పడటం ద్వారా ఏడైనా హాని సంభవిస్తే ఆరు నెలల జైలు, లక్ష జరిమానా.
- తీవ్ర హాని కలిగిస్తే ఏడాది జైలు; రూ.3 లక్షల జరిమానా. మరీ తీవ్రమైతే ఏడేళ్ల జైలు, రూ. 5 లక్షల జరిమానా; ప్రాణహాని సంభవిస్తే ఏడేళ్లకు తగ్గకుండా జీవిత ఖైదు, రూ.10 లక్షల జరిమానా విధించవచ్చు.

మధ్యవర్తిత్వ కేంద్రాలు

రాష్ట్ర కమిషన్‌తోపాటు ప్రతి జిల్లా కమిషన్‌లో మధ్యవర్తిత్వ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయాల్సి ఉంది. గుర్తింపు పొందిన మధ్యవర్తులు ఇక్కడ ప్యానెల్ సభ్యులుగా ఉంటారు. మూడు నెలలకోసారి ఈ కేంద్రం.. జిల్లా కమిషన్, రాష్ట్ర, జాతీయ కమిషన్‌లకు నివేదిక పంపాలి. కమిషన్ ముందుకు వచ్చే ఫిర్యాదులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమవుతాయని భావిస్తే వాటిని మీడియేషన్ సెంటర్‌కు సిఫార్సు చేయాలి. మధ్యవర్తి రెండు పార్టీల మధ్య ఒప్పంద పత్రం రూపొందించి సంతకం చేయాలి. గడువులోగా మధ్యవర్తిత్వం సఫలం కానిపక్షంలో కమిషన్‌కు నివేదించాలి.

పరిధి పెరిగిందిలా...

జిల్లా కమిషన్ పరిధి
రూ.20 లక్షల నుంచి రూ.కోటికి

రాష్ట్ర కమిషన్‌ది
రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు

అప్పీలు చేయాలంటే...

- జిల్లా కమిషన్‌ల తీర్పులపై రాష్ట్ర కమిషన్‌లో అప్పీలు చేయాలంటే చెల్లించాల్సిన సొమ్ములో 50 శాతం డిపాజిట్ లేదంటే రూ.25 వేలు ఏది తక్కువైతే దాన్ని చెల్లించాలి.
- రాష్ట్ర కమిషన్ తీర్పుపై జాతీయ కమిషన్‌లో అప్పీలు చేయాలంటే 50 శాతం లేదంటే రూ. 35 వేలు చెల్లించాలి.
- తన తీర్పులను పునఃసమీక్షించే అధికారం రాష్ట్ర కమిషన్‌లకు చట్టం కట్టబెట్టింది.
- అప్పీలుకు గతంలో ఉన్న 30 రోజుల గడువును 45 రోజులకు పెంచింది.

ప్రత్యేక రక్షణ: న్యాయవాది వేముల గౌరిశంకర్

తప్పుడు ప్రకటనలతో కల్తీ వస్తువులు, సేవలను అంటగట్టేవారికి ఈ చట్టం గుణపాఠం చెప్పేలా ఉంది. కేంద్ర అథారిటీ ద్వారా వినియోగదారులకు ప్రత్యేక రక్షణ లభిస్తుంది. కమిషన్‌ల పరిధి పెంచడం ద్వారా కేసుల సంఖ్య ఎక్కువ కావచ్చు. అప్పీళ్ల సమయంలో 50 శాతం డిపాజిట్ చేయాలన్న నిబంధన కొంత ఇబ్బందికరం.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

ప్రేమే మిగిలింది!

ఆయుధాలను త్యజించి, కత్తులూ కటార్లన్నీ పక్కన పడేసిన తర్వాత.. నన్ను వ్యతిరేకించే వారందరికీ పంచటానికి నా దగ్గర మిగిలింది ఒక్కటే.. ప్రేమామృతం!

– మహాత్మా గాంధీ

రాష్ట్రానికి జ్వరమొచ్చింది!

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కంటే హైదరాబాద్‌లో అత్యధికంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 63 వేల కేసులు నమోదవగా, గత 45 రోజుల్లో 13 వేల మందికి పైగా బాధితులు చికిత్స పొందడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. "వైద్య సేవలు పొందిన వారిలో సుమారు 50 శాతం మంది చిన్నారులేనని, ఇవి కేవలం ప్రభుత్వం వద్ద నమోదైన గణాంకాలు మాత్రమేనని, ప్రైవేటు క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో పొందిన వారు దీనికి మూడింతలు ఉంటారని" వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. "పిల్లలకు సరైన సమయంలో వైద్యం అందించకపోతే నిమోనియా వంటి జ్వరాల బారిన పడి ప్రాణాపాయ పరిస్థితులు ఎదురుకావచ్చు. ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు తిరిగినట్లుగా అనిపించడం, జ్వరం 102 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదవడం, నీరసించిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తే అత్యవసర చికిత్స అందించాలి" అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విజేతకాంపిటీషన్స్ vijetacompetitions.net పత్రికతో రూ. 30 నెలకు చదువు రూ.700
ఎ.పి. గ్రామ/వార్డు సచివాలయం
Subjects Part-B Top 11 Model Papers Rs. 119
Village Surveyor Rs. 299 ANM/MPHA Rs. 389
Digital Assistant Rs.499, Sanitation Rs.399
Engineering Assistant & Ward Amenities Rs. 319
Ward Welfare & Development Rs. 319
Education, Data Rs. 329 Part-A GS & MA Rs. 249, Rs. 399
Part-A Top 31 MP Rs.99 కరంట్ అఫైర్స్ రూ. 119, 159
9963293388 | 9963511134

కుదిపేస్తున్న కుండపోత వర్షాలు

దిల్లీ: దక్షిణ, పశ్చిమ భారతంలో ప్రమాదకర స్థాయిలో వరదలు ముంచెత్తుతున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు ఇంకా తగ్గుముఖం పట్టకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకల్లో వరద ఉధృతి తగ్గలేదు. ఈ నాలుగు రాష్ట్రాల్లోనే ఇంతవరకు మొత్తం 183 మంది ప్రాణాలు కోల్పోయారు. కర్ణాటక-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో వరద పరిస్థితిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన సొంత నియోజకవర్గమైన వయనాడ్‌లో పర్యటించి బాధితులను పరామర్శించారు. కేరళలో వరుసగా నాలుగో రోజు భారీ వర్షాలు కురిశాయి. మృతుల సంఖ్య 72కు పెరిగింది. 2.51 లక్షల మందిని ఖాళీ చేయించి 1,639 పునరావాస కేంద్రాలకు తరలించినట్లు ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తెలిపారు. కోచి అంతర్జాతీయ విమానాశ్రయంలో 2 రోజులపాటు నిలిచిపోయిన విమానాల రాకపోకలు ఆదివారం తిరిగి ప్రారంభమయ్యాయి. నీలంబూర్ జిల్లా కవలపర వద్ద కొండచరియ కూలిన దుర్ఘటనలో 35 ఇళ్లు మట్టిలో కూరుకుపోయాయని, అక్కడ 65 మంది సజీవ సమాధి అయ్యి ఉండొచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కవలపర వద్ద దుర్ఘటన స్థలాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సందర్శించారు. వయనాడ్ నియోజకవర్గంలోని సహాయ శిబిరాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. మహారాష్ట్రలో తాజా వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 40కి పెరిగింది. కొల్హాపూర్ జిల్లాలో పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు. నాలుగో నెంబరు జాతీయ రహదారి పూర్తిగా పాడవడంతో వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గుజరాత్ నుంచి కర్ణాటకలోని బెల్గాంకు వండల టన్నుల బంగాళాదుంపలు తీసుకొని వెళ్తున్న లారీలు కూడా కొల్హాపూర్‌కు 50 కి.మీ. దూరంలో ఆగిపోయాయి. ఫలితంగా వాటిలోని సరకంతా కుళ్లిపోయింది. గుజరాత్‌లో ఆదివారం మొత్తం 11 మంది మృతి చెందారు. వరదల ధాటికి రాష్ట్రంలో మృతిచెందినవారి సంఖ్య 31కి పెరిగింది.

వరద ప్రాంతాలను విహంగవీక్షణం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

కర్ణాటకలో నష్టం రూ.40వేల కోట్ల పైమాటే

వరద ఉధృతిని గమనిస్తే కనీసం రూ.40 వేల కోట్లకుపైగా ఆస్తి నష్టపోయినట్లు అంచనా వేస్తున్నామని కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నారు. ప్రాథమిక సమీక్ష ద్వారా రూ.10వేల కోట్లుగా అంచనా వేసినట్లు వివరించారు. ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి యడియూరప్ప, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, సురేష్ అంగడి తదితరులు బెళగావి, మహారాష్ట్ర వరద ప్రాంతాలను దాదాపు 2గంటల పాటు విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. రాష్ట్రంలో వరద మృతుల సంఖ్య 40కి చేరింది.

రూ.8 వేలు ఇస్తేనే.. అంత్యక్రియలు!

బెంగళూరు: వరదల బీభత్సానికి ఓవైపు పలువురు మృత్యువాత పడుతుండగా.. వారికి అంత్యక్రియల కోసం నిర్వాహకులు డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో ఆయా కుటుంబీకుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. కర్ణాటకలోని కొడగు జిల్లాల్లో కొండ చరియలు విరిగిపడి చనిపోయిన తమ ఇద్దరు కుమార్తెల అంత్యక్రియలకు ఓ కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులకు సంబంధించిన వీడియో ఆదివారం అందరినీ కలచివేసింది. మమత, నికిత అనే ఇద్దరు మృతి చెందగా వారిని కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు తీసుకెళ్లగా నిర్వాహకులు రూ. 8,000 డిమాండ్ చేశారు. బిడ్డలతో పాటు సర్వస్వం కోల్పోయి, సహాయ శిబిరంలో తలదాచుకుంటున్నామని.. ఇప్పుడు అంత మొత్తం ఎక్కడి నుంచి తేవాలంటూ ఆ కుటుంబానికి చెందిన ఓ మహిళ ఏకధాటిగా ఏడుస్తూ తెలిపారు. డబ్బులేకపోతే అంత్యక్రియలకు రానివ్వడం లేదంటూ మరో వ్యక్తి చెప్పారు. దీంతో గేటు తాళం పగులగొట్టి మృతదేహాలను లోపలికి తీసుకెళ్లామని ఆమె అధికారులకు తెలిపారు. ఎట్టకేలకు అంత్యక్రియలు జరిపించారు. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో అంత్యక్రియల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు మైసూర్-కొడగు ఎంపీ ప్రతాప్ సింహ తెలిపారు. సంబంధిత వీడియోను ఆయన ట్విటర్‌లో పెట్టారు. మృతుల కుటుంబానికి 10 లక్షల చెక్కును అందజేశారు.

ఎదురీదిన అమ్మమనసు

పుఖుమల/కొజికోడ్: భారీ వర్షంతో వాగులు, వంకలూ పొంగి జనావాసాలను వరదై ముంచెత్తుతుండటంతో ప్రజిత(25)కు దిక్కుతోచలేదు. ఒళ్లో రెండునెలల పసికందు. ఈ లోగా ఉన్నట్టుండి భారీ శబ్దంతో కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్పాతాన్ని గుర్తించిన ప్రజిత ఒక్కసారిగా బిడ్డను గుండెలకు హత్తుకుని ఇంట్లో నుంచి వెలుపలికి పరుగుతీసింది. వరదై ముంచెత్తుతున్న వాననీటి ప్రవాహంలో పడిపోయింది. అయినా బిడ్డను వదలకుండా భద్రంగా పట్టుకుని ఎదురీదడం మొదలుపెట్టింది. ఆ ప్రవాహం కాసేపటికి ఆమెను ఓ నదీపాయలోకి తోసేసింది. అయినా సరే ప్రజిత వెరవలేదు. అలసిపోలేదు. మొండిగా ఈదుకుంటూ తన తల్లిదండ్రులు, తొలిసంతానమైన మూడేళ్ల కుమారుడు తలదాచుకుంటున్న సహాయ శిబిరానికి చేరింది. రెండునెలల క్రితం పెద్దాపరేషనై.... శరీరం దుర్బలస్థితిలో ఉన్నా సరే ఆమెలోని తల్లి మనసు ప్రజితకు రెట్టింపు బలాన్నిచ్చింది. బిడ్డతో సహా ఒడ్డున పడ్డా... ఆమె మాత్రం దిగ్భ్రాంతి నుంచి ఇంకా తేరుకోలేదు. పుఖుమలలో ఆదివారం ఈ సంఘటన జరిగింది.

- మారుమూల గిరిజన గ్రామమైన అట్టపడిలో నిండు చూలాలైన ఓ మహిళ పొంగిపొర్లుతున్న భవానీ నదిని సహాయబృందా

గుర్రంగోడుమంటోంది

- గుర్రంబోడులో 432 ఎకరాల భూమిపై వివాదం
- తమను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారంటున్న గిరిజనులు
- పక్కా ఆధారాలతో తాము భూమిని కొన్నామన్న ప్రైవేటు సంస్థ
- పరస్పర దాడులతో ఐదు గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు

ఈనాడు - నల్గొండ

మా భూముల్లోకి మమ్మల్ని రానివ్వడం లేదంటున్న గుర్రంబోడు తండావాసులు
★ 540 సర్వే నంబరులో ఉన్న భూమి

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంబోడు భూముల వివాదం ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. నాగార్జునసాగర్ ముంపు ప్రాంతంలోని నిర్వాసిత గిరిజనులకు 1960లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందులోని కొంత భూమిని పునరావాసం కింద పట్టాలిచ్చింది. కృష్ణపట్టి ప్రాంతంలో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, పట్టా భూములున్నాయి. గుర్రంబోడు తండా, భోజ్య తండా, రామంచంద్రాపురం తండా, మంచ్యా తండా, మిగడంపాడు తండాల గిరిజనులు ఈ భూమిని 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. సర్వే నంబరు 540లోని 432 ఎకరాలను తాము కొన్నామంటూ హైదరాబాద్‌కు చెందిన గ్లేడ్ మినరల్స్ స్టీల్ ప్లాంట్ సంస్థ ఈ భూమిలో 2017లో కర్మాగారం నిర్మాణానికి ప్రయత్నించింది. ఈ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. అనంతరం సదరు సంస్థ కోర్టు ఆదేశంతో భూములను రెవెన్యూ, పోలీసుల సహకారంతో సర్వే చేయించి హద్దురాళ్లను పాతింది. తాజాగా వారం క్రితం ఈ భూమిలో షెడ్లు నిర్మించేందుకు కంపెనీకి చెందిన కొందరు రాగా వారికీ, గిరిజనులకు మధ్య దాడులు జరిగాయి. తాము సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలివ్వాలని ఎన్నోసార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని, ఇప్పుడు ఈ భూములను ఎవరికో పట్టాలెలా ఇస్తారని, రిజిస్ట్రేషన్‌లు ఎలా చేస్తారని తండావాసులు ప్రశ్నిస్తున్నారు.

రెవెన్యూ ఏం చేస్తోంది?

సర్వే నంబరు 540లో మొత్తం 6,526 ఎకరాలు ఉంది. ఇందులో అటవీశాఖది 2000 ఎకరాలు, 1500 ఎకరాలు అసైన్డ్ భూమి కాగా.. 1826 ఎకరాలు ప్రభుత్వ భూమి. మిగిలిన 1200 ఎకరాలు పట్టా భూమి. ఏభూమి ఎక్కడుందో రెవెన్యూ అధికారులు గుర్తించలేదు. గిరిజనులు ఏళ్ల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్నారు అది ప్రభుత్వానిదా, అసైన్డా లేదా పట్టా భూమా తెలియదు. ఈ సర్వే నంబరులోనే 432 ఎకరాలు కొనుగోలు చేసిన ప్రైవేటు కంపెనీకి తమ భూమి ఎక్కడ ఉందో తెలియదని, వారికి అమ్మిన కంపెనీ హద్దులు సరిగ్గా చూపించలేదన్న ఆరోపణలున్నాయి. ఈనంబరులోని కంపెనీ కొన్న భూమి ఎక్కడ ఉంది, గిరిజనులకు నిర్వాసితుల కింద ప్రభుత్వం ఇచ్చిన భూమి ఏదనేది తేల్చితే తప్ప వివాదం సద్దుమణిగేలా కనిపించడం లేదు.

ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం

సాగర్‌లో మాఊరు మునిగిపోవడంతో అప్పటి సర్కారు మాకు ఇక్కడ భూమి ఇచ్చింది. ఇప్పుడు హైదరాబాద్ స్టీల్ కంపెనీ వారొచ్చి ఇది మాభూమి అంటున్నారు. అధికారులకు చెబితే మీకు పట్టాలు లేవు, ప్రైవేటు కంపెనీదే భూమి అని చెబుతున్నారు. మేమేం చేయాలి?

– రమావత్ దీప్లా, గుర్రంబోడు తండా

నా భూమిని దున్ననివ్వడం లేదు

నాకున్న మూడెకరాలకు పట్టా భూమి ఉంది. రైతుబంధు డబ్బులు సైతం వస్తున్నాయి. నేను ఎవరికీ భూమిని అమ్మలేదు. కానీ ప్రైవేటు కంపెనీ ఆ భూమి తమదని మమ్మల్ని దున్ననివ్వడం లేదు. అధికారులకు చెబితే వారు స్పందించడం లేదు.

– రమావత్ భద్యా, భోజ్య తండా

పక్కా ఆధారాలతోనే కొన్నాం

సర్వే నంబరు 540లో మేం కొన్న 432 ఎకరాల భూమికి ఆధారాలున్నాయి. మేం ఎవరి భూమినీ కబ్జా చేయలేదు. మాకున్న సమాచారం ప్రకారం ఈ భూములను 1993-94లో స్థానికులు కొనుగోలు చేశారు. వారి నుంచి 2008లో ఎల్‌వీఆర్ బయోటెక్ కంపెనీ కొన్నది. వారి నుంచి మేం 2014లో కొన్నాం. మేం కోర్టు ఆదేశాలతో మా భూములు ఎక్కడున్నాయో హద్దులు వేసుకున్నాం. ఆ స్థలంలోనే మేం స్టీల్ కంపెనీ నిర్మించాలనుకుంటున్నాం. పట్టా ఉన్న రైతులు భూములు కోల్పోతే వారికి న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– రవీంద్రనాథ్‌రెడ్డి, డైరెక్టర్, గ్లేడ్ మినరల్స్ స్టీల్ ప్లాంట్ సంస్థ

టీఎస్‌ఐసెట్ ఐచ్ఛికాల ఎంపికకు నేడు చివరి తేదీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు టీఎస్‌ఐసెట్ ఐచ్ఛికాల (ఆప్షన్ల) ఎంపిక గడువు ఈ నెల 12తో ముగియనుంది. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులు సోమవారం ఫీజు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలంగాణ ఉన్నత విద్యామండలి తెలిపింది. ఈ నెల 11నాటికి 21,346 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకున్నారు. వీరిలో 3,248 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాగా, 11,624 మంది ఐచ్ఛికాలు (ఆప్షన్స్) ఎంపిక చేసుకున్నారు. 14న సీట్లు కేటాయిస్తామని ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్‌మిత్తల్ తెలిపారు.

ఇంజినీరింగ్ పీజీ ధ్రువపత్రాల పరిశీలనకు గడువు పెంపు

పీజీ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు టీఎస్‌పీజీఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 14 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది.

కూలి పనుల కోసం 40 కిలోమీటర్లు..

రోడ్డు పక్కన భోజనం చేస్తూ...

రాత్రిపూట పనులు ముగించుకొని వస్తూ..

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా.. కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లో పనులు దొరక్క రోజూ 40 కి.మీ.లు (రానుపోను 80 కి.మీ) ప్రయాణం చేసి ఉపాధి పొందుతున్నారు. వీరంతా గాంధారి, తాడ్వాయి, కామారెడ్డి మండలాలకు ఆటోలు కట్టుకొని ఉదయం 6 గంటలకే వెళ్తున్నారు. దీనికి గానూ ఒక్కొక్కరు ఆటోకు రూ. 70 కిరాయి చెల్లిస్తున్నారు. ఇంత కష్టపడుతున్నా వారికి దక్కేది రూ. 300 నుంచి 400 మాత్రమే. కిరాయి పోను మిగిలేది రూ. 230 నుంచి 330 వరకే దక్కుతోందని వాపోతున్నారు. ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచి సద్దికట్టుకొని వెళ్తే. తిరిగొచ్చే సరికి రాత్రి 8 అవుతోందని కూలీలు తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

భారీగా తెరాస సభ్యత్వాలు!

- ముగిసిన సభ్యత్వ నమోదు గడువు
- చివరి దశలో పోటీ పడిన నేతలు
- నియోజకవర్గాల వారీగా నివేదికలివ్వాలని కేటీఆర్ ఆదేశాలు
- ఇక కమిటీల నియామకాలపై దృష్టి

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదు శనివారంతో ముగిసింది. సభ్యత్వ నమోదు గడువును 10వ తేదీ వరకు అధిష్ఠానం పొడిగించిన నేపథ్యంలో చివరి దశలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు పోటీ పడి పనిచేశారు. ఫలితంగా పది నుంచి 20 శాతం మేరకు సభ్యత్వం పెరిగిందని పార్టీ అధిష్ఠానం అంచనా వేస్తోంది. అధికారికంగా త్వరలో పూర్తి సమాచారం రానుంది. దీని కోసం నియోజకవర్గాల వారీగా నివేదికలు తెప్పించాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ బాధ్యులకు ఆదివారం ఆదేశాలు ఇచ్చారు. జూన్ 27 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలైంది. జులై 22 వరకు మొదట్లో గడువు నిర్దేశించారు. తర్వాత దాన్ని నెలాఖరు వరకు పొడిగించారు. ఆ తర్వాత హైదరాబాద్ నగరం సహా ఇతర పట్టణ ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని అధిష్ఠానం ఆగస్టు పదో తేదీ వరకు గడువు పెంచింది. హైదరాబాద్ నగరంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇవన్నీ ఫలితాలు ఇచ్చాయని, చివరి పది రోజులు రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కేటీఆర్ ఆయా నియోజకవర్గాల బాధ్యులతో బేటీ అయి దిశానిర్దేశం చేయడం కూడా సభ్యత్వాల సంఖ్య పెరగడానికి దోహదం చేసిందని వెల్లడించాయి. ముఖ్యంగా సనత్‌నగర్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, ఉప్పల్, జూబ్లీహిల్స్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్ తదితర నియోజకవర్గాల్లో భారీగా సభ్యత్వాలు నమోదైనట్టు పేర్కొన్నాయి. "శేరిలింగంపల్లి, ఖైరతాబాద్‌ల పరిధిలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని" ఆయా నియోజకవర్గాల బాధ్యులు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండి రమేశ్ వెల్లడించారు. గోషామహల్ నియోజకవర్గంలో చివరి వారంలో పది వేల వరకు సభ్యత్వాలు పెరిగినట్టు పార్టీ నేత నందకిశోర్ వ్యాస్ బిలాల్ తెలిపారు.

ఒకటైండు రోజుల్లో సమీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు క్రతువు ముగిసినందున ఒకటి, రెండు రోజుల్లో దీనిపై కేటీఆర్ సమీక్ష నిర్వహించనున్నారు. సభ్యత్వ నమోదు పుస్తకాలను హైదరాబాద్ చేర్చాలని కేటీఆర్ ఆయా నియోజకవర్గాల బాధ్యులను ఇప్పటికే ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో సభ్యత్వాల డిజిటలీకరణను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి సభ్యుని వివరాలు నమోదు చేసి, బీమా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే తెరాస అధిష్ఠానం పార్టీ సభ్యులు, ఇతర రత్రా వివరాలతో తెరాస కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపించనుంది.

త్వరలో కమిటీల నియామకం

సభ్యత్వం జరిగిన అన్ని నియోజకవర్గాల్లో తెరాస బూత్ కమిటీలు, గ్రామ, బస్తీ, మండల, డివిజన్ పార్టీ కమిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ, కార్మిక, విద్యార్థి విభాగాలు, ఇతర అనుబంధ సంఘాలను పార్టీ త్వరలో నియమించనుంది. ఈ నెల మూడో వారం వరకు దీనికి గడువు ఇచ్చారు. పురపాలక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నగరాలు, పట్టణాల్లో వెంటనే కమిటీలను వేయించాలని అధిష్ఠానం నిర్ణయించింది.



సహ చట్ట సవరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

ఆచార్య మాడభూషి శ్రీధర్

సదస్సులో ప్రసంగిస్తున్న మాడభూషి శ్రీధర్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే చట్టసవరణ చేశారని.. ఇది ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదకరమని కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఆచార్య మాడభూషి శ్రీధర్ అన్నారు. సెక్షన్ 34ను సవరించడం అంటే సమాచార కమిషనర్ల స్వతంత్రతను దెబ్బతీయడమేనని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు ఈ బిల్లుకు మద్దతు పలకడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్ట సవరణపై సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ. రాష్ట్ర సమాచార కమిషనర్ల జీతాలు, హోదాలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో స్వతంత్ర సంస్థలను విధ్వంసం చేసే ఫాసిస్ట్ పాలన సాగుతోందన్నారు. అవినీతిపరులకు కొమ్ముకాసేందుకే చట్టం నిర్వీర్యానికి పూనుకున్నారని ఆరోపించారు. స.హ చట్టంతో దేశవ్యాప్తంగా గతంలో అనేక అక్రమాలు బయటపడ్డాయని గుర్తుచేశారు. తెరాస ప్రభుత్వ అవినీతిపై చర్యలు తీసుకుంటామని కేంద్రం బ్లాక్‌మెయిల్ చేయడంతో.. ఆ పార్టీ మద్దతు ప్రకటించిందని ఆరోపించారు. బాజపా ప్రభుత్వ విధానాలపై పోరాడాలని కోరారు. సహ చట్ట సవరణలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పోరాడనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మాజీ ఎంపీ అజీజ్‌పాషా, బొమ్మగాని ప్రభాకర్, విజయలక్ష్మి, డా.డి.సుధాకర్, బాలమల్లేశ్, ఈటీ నర్సింహ పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

పిల్లల సంరక్షణ కేంద్రంలో అగ్నిప్రమాదం

అమెరికాలో ఐదుగురు చిన్నారుల మృత్యువాత

వాషింగ్టన్: అమెరికాలో పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఎరీ నగరంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. పిల్లల సంరక్షణ(డే కేర్) కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో ఐదుగురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. మృతులంతా 8 నెలల నుంచి 7 ఏళ్ల మధ్య వయసువారేనని అధికారవర్గాలు వెల్లడించాయి.



ఈనాడు

విపత్తు వ్యూహాలు మారాలి!

జలాశయాలు నిండుకున్నందున ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలకు కేంద్ర జలసంఘం 'కరవు సలహా' దయ చేసి పట్టుమని మూన్నెల్లు కాలేదు. ఒకవంక దుర్భర నీటి కటకటతో చెన్నై మహానగరం అలమటించిపోగా, మరోవంక భారీ వర్షాల తాకిడికి ముంబయి, నాసిక్ అతలాకుతలమైపోయాయప్పుడు! కేంద్ర జలసంఘం కరవు సలహా ఇచ్చినవాటిలో తెలంగాణ మినహా తక్కినవన్నీ నేడు భీకర వరద బీభత్సాన్ని ఎదుర్కొంటూ 'కావవే వరదా' అని అలమటిస్తున్నాయి. నిరుడు ఇవే రోజుల్లో కేరళ సౌభాగ్యాన్ని కసిగా కాలరాసిన భయానక వరదలు వేల గృహాలను నేలకూల్చి వందలమంది అభాగ్యుల్ని పొట్టన పెట్టుకొన్నాయి. ఇప్పుడు కూడా కేరళలో ఎనిమిది జిల్లాల్ని వణికిస్తున్న వరదలు, 80 చోట్ల కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలు విపరీత ఆస్తి ప్రాణ నష్టాల్ని కళ్లకు కడుతున్నాయి. నావికాదళాన్ని రంగంలోకి దింపి వరద ముట్టడి నుంచి అభాగ్య జనాన్ని ఆదుకోవడానికి కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ కిందుమీదులవుతున్నాయి. తమిళనాట నీలగిరి జిల్లాలో ఒక్కరోజులోనే ఏకంగా 91.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదై దక్షిణ భారతావనిలోనే 'రికార్డు' సృష్టించింది. కొన్నాళ్ల క్రితం దాకా వాన చుక్క జాడలేక అనావృష్టి ముష్టిఘాతాలకు సొమ్మసిల్లిన జనావళిపై అతివృష్టి రుళిపించిన జలఖడ్గ ప్రహారాలివి! నాలుగున్నర దశాబ్దాల్లోనే అతి పెద్ద జలవిలయమంటూ ప్రాథమిక నష్టాలే రూ.6,000 కోట్లని కర్ణాటక అంచనా కడుతుంటే, ముమ్మర సహాయక చర్యల్లో మునిగితేలుతున్న రాష్ట్రాలన్నీ గుడ్ల నీరు కుక్కుకొంటున్నాయి. వాతావరణ మార్పుల తాకిడి ఎంత భయవిహ్వలంగా ఉంటుందో ఏటికేడు పోటెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాల్లో ప్రస్ఫుటమవుతున్న నేపథ్యంలో- కష్టనష్టాల నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త కార్యాచరణతో కదలాలి!

నేల నీటి వనరుల్ని మున్నెన్నడూ లేని స్థాయిలో మానవాళి దుర్వినియోగం చేస్తుంటే, దానికి వాతావరణ మార్పు దుష్ప్రభావాలు జతపడి ఆహార స్వావలంబన కష్టసాధ్యమయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి మూన్నాళ్ల క్రితం హెచ్చరించింది. 52 దేశాలకు చెందిన వందమంది నిపుణులు రూపొందించిన నివేదిక- వరదలు, కరవులు, తుపానుల వంటి వైపరీత్యాలను ఎగదోస్తున్న వాతావరణ మార్పులతో ప్రపంచ ఆహార సరఫరా వ్యవస్థే దెబ్బతినిపోతోందని, పలు ఖండాల్లో ఒకేసారి ఆహార సంక్షోభం ఉత్పన్నమయ్యే ముప్పు పొంచి ఉందని ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. వాతావరణ మార్పులకు అత్యధికంగా గురయ్యే దేశాల జాబితాలో ఇండియా ఇప్పటికే ఆరో స్థానంలో ఉంది. 1998-2017 మధ్య వాతావరణ మార్పుల పర్యవసానంగా తలెత్తిన 11,500 ప్రకృతి వైపరీత్యాల్లో ప్రపంచవ్యాప్తంగా అయిదు లక్షల 26 వేలమంది బలైపోయారని, మూడు లక్షల 47 వేలకోట్ల డాలర్ల ఆస్తినష్టం సంభవించిందని, 2030 నాటికి ఆస్తి ప్రాణనష్టాలు రెండు మూడు రెట్లు పెరగనున్నాయని అధ్యయనాలు చాటుతున్నాయి. ఆ అంచనాల్ని కొట్టిపారేసే వీల్లేదని భారతీయ వాతావరణ శాఖ గణాంకాలు సాక్ష్యం పలుకుతున్నాయి. 1901 లగాయతూ ఇండియాలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఆరేళ్లలో నమోదైతే, ఆ ఆరూ గత పదేళ్లలోపే ఉన్నాయన్న వాతావరణ శాఖ- భూతాపం సత్యం, వాతావరణ మార్పు నిత్యం అని నిర్ధారిస్తోంది. ఈ పరిస్థితుల్లో వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని కాచుకోవడానికి తక్షణ, మధ్య, దీర్ఘకాలిక సన్నద్ధతలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం కావాలి. చేతులు కాలాక ఆకుల కోసం వెంపర్లాట చందంగా కాకుండా, ప్రకృతి విపత్తుల నిభాయక యంత్రాంగాల్ని అన్ని స్థాయుల్లోనూ పరిపుష్టం చేసుకోవడం మొదలు ఆహార భద్రతకు లోటు రాకుండా కాచుకోవడానికీ యుద్ధప్రాతిపదికన కదలాలి!

నూట పాతికకు పైగా భిన్న వాతావరణ జోన్లు ఉన్న ఇండియాలోని సేద్యయోగ్య భూమిలో 68 శాతానికి కరవు ముప్పు, అయిదు కోట్ల హెక్టార్లకు వరద ముంపు ప్రమాదం పొంచి ఉందన్న సంగతి నేతాగణాలకు తెలుసు. అంతర్జాతీయ విపత్తుల సమాచార నిధి గణాంకాల ప్రకారం, 1950-2015 మధ్య కాలంలో ఇండియాలో 268 భారీ వరదలు సంభవించగా 82.5 కోట్ల మంది దురవస్థల పాలయ్యారని, కోటీ 70 లక్షల మంది నిర్వాసితులు కాగా, 69 వేలమంది మృత్యువాత పడ్డారని నిపుణులు మొత్తుకొన్నారు! రుతువులు గతి తప్పి వ్యవసాయాన్ని, దేశ ఆహార భద్రతను పెనం మీద నుంచి పొయ్యిలోకి నెట్టేస్తున్న వేళ, జోన్లవారీగా సేద్యవ్యూహాల్ని పునస్సమీక్షించుకొని ముందడుగేయాలి. ప్రణాళికల రచన, అమలులో స్థానిక సంస్థలకు చోటు పెట్టి, ఆయా పరగణాల భౌగోళిక స్థితిగతుల్ని బట్టి ముంచుకు వచ్చే ముప్పును సమర్థంగా కాచుకొనే సరికొత్త జీవన సంస్కృతికి పాదుచెయ్యాలని 2015నాటి 'విశాఖ ప్రకటన' ఉద్బోధించింది. అంటే, భూకంపాల విలయాన్ని ఎదుర్కోవడంలో జపాన్ ఎంత అప్రమత్తంగా ఉంటోందో... అలాగన్న మాట! వాతావరణ మార్పుల్ని తట్టుకోగల వరి వంగడాల్ని సత్వరం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసి, రైతుకు అవి ఆర్థికంగా లాయకీ అయ్యేలా చూడటం- భారతావనికి మేలుబాట! దేశీయంగా వాతావరణ విపత్తులకు లోనుకాగల 151 జిల్లాల్ని గుర్తించామన్న కేంద్రప్రభుత్వం, వాటిని కాచుకొనే కార్యాచరణ ప్రణాళికను 33 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు సిద్ధం చేశాయని గత నెలలో రాజ్యసభాముఖంగా ప్రకటించింది. ఆయా ప్రణాళికలు కాగితాల్లోనే కొడిగట్టకుండా, సామాజిక చేతన పెంచి, పకడ్బందీగా అమలు చేసినప్పుడే ప్రకృతి వైపరీత్యాల దుష్ప్రభావాల నుంచి దేశం బయటపడగలిగేది!

అగ్రదేశ హోదా అంతిమ లక్ష్యంగా...

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్

అమెరికా-చైనాల మధ్య వాణిజ్య, సైనిక వైరం నానాటికీ ముదురుతోంది. దీనికి నిదర్శనలుగా మూడు తాజా పరిణామాలను ఉదహరించాలి. అవి- చైనా కరెన్సీ విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గనిచ్చిందని అమెరికా మండిపడటం, రష్యాతో మధ్యశ్రేణి అణు క్షిపణుల (ఐఎన్ఎఫ్) ఒప్పందాన్ని అమెరికా రద్దు చేసుకోవడం, అమెరికా కవ్వింపులను సహించబోమని తన రక్షణ శ్వేత పత్రంలో చైనా హెచ్చరించడం! 1987లో రష్యాతో కుదుర్చుకున్న ఐఎన్ఎఫ్ ఒప్పందాన్ని అమెరికా ఇటీవల రద్దు చేయడం ఘర్షణ వాతావరణాన్ని ఎగదోసింది. ఐఎన్ఎఫ్ ఒప్పందం కింద అమెరికా, రష్యాలు 500 నుంచి 5000 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై దాడి చేయగల మధ్యశ్రేణి క్షిపణులను పరిమితం చేసుకోవలసి ఉంది. కానీ, తాము ఇలా గిరి గీసుకొని కూర్చుంటే చైనా దూరశ్రేణి క్షిపణులను సమకూర్చుకుందని, రష్యా కూడా యథేచ్ఛగా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ అమెరికా ఐఎన్ఎఫ్ ఒడంబడిక నుంచి వైదొలగింది. ఆపై చైనా పొలిమేరల్లో అణు క్షిపణులను మోహరించడానికి సై అంటోంది. బహుశా పశ్చిమ పసిఫిక్ మహా సముద్రంలోని అమెరికా సైనిక స్థావరం గ్వామ్‌లో వీటిని మోహరించవచ్చు. ఇప్పటికే దక్షిణ కొరియాలో అమెరికా థాడ్ క్షిపణి వ్యవస్థను నియోగించడంతో ఉద్రిక్తతలు పెచ్చరిల్లాయని చైనా తప్పు పట్టింది.

ఏకధ్రువ ప్రపంచంవైపు పయనం

అమెరికా దూకుడును ఎదుర్కోవడానికి చైనా-రష్యాలు భుజం కలపడం ఖాయం. అమెరికా నేతృత్వంలోని ఏకధ్రువ ప్రపంచానికి కాలంచెల్లి బహుళధ్రువ ప్రపంచం ఏర్పడనుందని చైనా రక్షణ శ్వేతపత్రం చాటింది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల దూకుడును దీటుగా ఎదుర్కొంటామని స్పష్టీకరిస్తూనే, భారత్ పట్ల సామరస్య ధోరణి ప్రదర్శించింది. 2017, 2018లలో అమెరికా విడుదల చేసిన వ్యూహ పత్రాలు చైనాను ప్రధాన ప్రత్యర్థిగా పరిగణించాయి. అంతకుముందు వరకు ఉగ్రవాదంపై పోరుకే ప్రాధాన్యమిచ్చిన అమెరికా- ఇక చైనా, రష్యాలతో పోటీకి, అవసరమైతే సంఘర్షణకు దిగాలని నిశ్చయించుకుంది. దీనికి ప్రతిగా చైనా ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధమని రక్షణ పత్రంలో హెచ్చరించింది. షాంఘై సహకార మండలి (ఎస్‌సీసీ) వంటి సంస్థల ద్వారా ఆసియా ఖండంలో శాంతిసౌభాగ్యాల స్థాపనకు చైనా కృషి చేస్తుంటే, అమెరికా దుందుడుకు పోకడలతో ఉద్రిక్తతలు సృష్టిస్తోందని నిరసించింది. తైవాన్, హాంకాంగ్‌లలో సమస్యలు సృష్టించడం, దక్షిణ కొరియాలో థాడ్ క్షిపణి వ్యవస్థల నియోగం, జపాన్, ఆస్ట్రేలియాలతో కలిసి సైనిక విన్యాసాలు నిర్వహించడం వంటివి అమెరికా దుడుకుతనానికి దృష్టాంతాలని పేర్కొంది. బయటి దేశాలు తరచూ చైనా గగన, సముద్ర తలాల్లోకి చొరబడి నిఘా వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. తైవాన్, తుర్కిస్థాన్, టిబెట్‌లలోని వేర్పాటువాదులను జాతీయ భద్రతకు ప్రమాదకారులుగా వర్ణించింది.

గల్ఫ్ యుద్ధంలో అమెరికా సాంకేతిక పోరాట పటిమతో ఇరాక్ సైన్యాన్ని శీఘ్రంగా మట్టి కరిపించడంతో భావి యుద్ధాల్లో సైన్య సంఖ్యా బలంకన్నా సాంకేతిక సత్తాది పైచేయి కానుందని చైనా గ్రహించింది. అందుకే ప్రజా విమోచన సైన్యం (పీఎల్ఏ) సంఖ్యా బలంలో అయిదు లక్షల మందిని తగ్గించి సాంకేతిక పోరాట సత్తాను పెంచుకొంటోంది. ఇదంతా ఆత్మ రక్షణ కోసం, ప్రపంచశాంతి సహకారాల పటిష్ఠత కోసమేనని అంటోంది. దీనికి భిన్నంగా అమెరికా అణు, అంతరిక్ష, సైబర్, క్షిపణి రంగాల్లో సమర సామర్థ్యాన్ని, రక్షణ వ్యయాన్ని పెంచుకొంటూ అంతర్జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తోందని చైనా ఆరోపించింది. వర్ధమాన దేశాల బలం క్రమంగా పెరుగుతూ అంతర్జాతీయంగా వ్యూహపరమైన సమతుల్యత ఏర్పడుతుండగా, అమెరికా పెత్తందారీ పోకడలు, బలప్రదర్శన రాజకీయాలకు పాల్పడుతూ అంతర్జాతీయ సుస్థిరతకు భంగం కలిగిస్తోందని విమర్శించింది. కానీ, తాము దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ దీవులను నిర్మించి సైనికపరంగా ఆధిక్య సాధనకు పడుతున్న ఆరాటాన్ని రక్షణ పత్రం కప్పిపెట్టింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి అమెరికాను దూరంచేసి, ఇక్కడి దేశాలను తన ఆర్థిక, భద్రతా చత్రం కిందకు తెచ్చుకోవడం చైనా వ్యూహంలా కనిపిస్తోంది. చైనా ఆశిస్తున్న 'సుస్థిరత' ఇదే. మరోవైపు దక్షిణాసియాను చాలావరకు 'సుస్థిర ప్రాంతమని చైనా వర్ణించడం విశేషం. ఇక్కడ పదేపదే భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంఘర్షణలు ప్రజ్వరిల్లుతున్నా, ఇద్దరికీ సర్ది చెప్పవచ్చుననే ధీమాను చైనా రక్షణ పత్రం ప్రదర్శించింది.

దోక్లామ్‌పై కప్పదాటు

చైనా రక్షణ శ్వేతపత్రంలో 16సార్లు భారత్ గురించి ప్రస్తావించినా, ఎక్కడా శత్రుభావం ప్రకటితం కాకపోవడం విశేషం. ముఖ్యంగా దోక్లాం గురించిన ప్రస్తావన ఆసక్తికరం. డాంగ్లాంగ్ (దోక్లాం) సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి అనువైన పరిస్థితులు కల్పించాల్సి ఉందని ఆ పత్రం పేర్కొంది. అంటే, 2017లో రెండు దేశాల సేనలు వెనక్కుతగ్గినా దోక్లాం ఇప్పటికీ అపరిష్కృతమేనన్న మాట. అవసరమైతే ఒక అడుగు వెనక్కువేసి, అవకాశం దొరికినప్పుడు రెండు అడుగులు ముందుకు వేయడం చైనా నైజం. 2015లో చైనా అధినేత జిన్ పింగ్ దక్షిణ చైనా సముద్రంలోని కృత్రిమ దీవుల్లో సేనలు, నౌకలు, క్షిపణులను మోహరించబోమని హామీ ఇచ్చినా, తాజా రక్షణ పత్రం ఆ దీవుల రక్షణకు సైనికపరమైన ఏర్పాట్లు చేసుకునే హక్కు చైనాకు ఉందని ఉద్ఘాటించింది. ఇటీవలి సంవత్సరాల్లో భారత్-వియత్నామ్‌ల మధ్య రక్షణ బంధం బలపడినట్లు అనిపించినా, దక్షిణ చైనా సముద్ర వ్యవహారంలో తలదూర్చడానికి భారత్ సుముఖంగా లేదు. 2018 ఏప్రిల్‌లో వుహాన్‌లో జిన్ పింగ్- భారత ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమైనప్పటి నుంచి భారత్ వైఖరిలో మార్పు వచ్చింది. పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందిస్తున్నందుకు ప్రతిగా వియత్నామ్‌కు భారత్ బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించనుందని చాలాకాలంగా వార్తలు వినవస్తున్న సంగతి తెలిసిందే. కానీ, భారత్ ఇటీవల ఈ వార్తలను ఖండించింది. చైనా సంస్థలు పెద్ద యెత్తున వియత్నామ్‌లో పెట్టుబడులు పెడుతున్న దృష్ట్యా ఆ దేశం బీజింగ్‌ను దూరం చేసుకోవాలనుకోవడం లేదు. భారత్‌కు ఈ ఏడాది అమెరికా తరవాత చైనాయే అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. అందువల్ల భారత్, వియత్నామ్‌లు చైనా-అమెరికాలతో సంబంధాలను సమతుల్యపరచుకోవాలని అనుకొంటున్నాయి. భారతదేశ సముద్ర వ్యాపారంలో సగభాగం దక్షిణ చైనా సముద్రం గుండానే నడుస్తోంది కాబట్టి అక్కడ చైనాతో నేరుగా ఢీకొనే తలంపు దిల్లీకి లేదని అర్థమవుతోంది. ఆ పనిని అమెరికాకే వదలివేయాలని అనుకొంటోంది. అమెరికా-చైనాల మధ్య వైరం ముదురుతున్న తరుణంలో భారత్ దక్షిణచైనా సముద్రం జోలికి పోవడం లేదు. బహుశా దీన్ని దృష్టిలో ఉంచుకునే చైనా కశ్మీర్ విషయంలో సుతిమెత్తగా స్పందిస్తున్నట్లుంది. మొత్తం మీద అగ్రరాజ్యంగా ఎదగాలని తపిస్తూనే శాంతియుత వాతావరణంలో తన కల నెరవేర్చుకోవడమే చైనా వ్యూహం!

– కైజర్ అడపా

చైనా శాంతి మంత్రం కదన తంత్రం

భారత్‌కు ఆందోళనకర అంశాలు

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ 2013లో బెల్ట్-రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) పేరిట భూతల, సముద్రతల సిల్క్ మార్గాల పునరుద్ధరణ చేపట్టి ఆసియా, ఆఫ్రికా దేశాల్లో వందల కోట్ల డాలర్ల పెట్టుబడులను గుమ్మరిస్తున్నారు. ఆ పెట్టుబడులకు భద్రత కల్పించడం చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ బాధ్యతల్లో ఒకటని రక్షణ పత్రం ఉద్ఘాటించింది. అందుకోసం చైనా దూరతీరాలకు పయనించగల నౌకా బలగాన్ని, విదేశాల్లో స్థావరాలను, రకరకాల సైనిక కార్యక్రమాలను నిర్వహించే సత్తాను సంతరించుకొంటోంది. ఆ మేరకు 2017లో జిబూటీలో నౌకా స్థావరం నెలకొల్పింది. సప్తసముద్రాల్లో, అంతరిక్షంలో, సైబర్ సీమలో ఎక్కడైనా సరే కార్యకలాపాలు నిర్వహించే సత్తాను సముపార్జించుకొని అమెరికాకు దీటైన అగ్రరాజ్యంగా ఎదగడం చైనా దీర్ఘకాలిక వ్యూహం. ఇది భారతదేశానికీ ఆందోళనకరమే. రక్షణపై చైనా ఇప్పటికే భారత్ కన్నా మూడు రెట్లు ఎక్కువ ఖర్చుచేస్తోంది. ఈ నిధుల్లో పెద్ద భాగాన్ని సైన్యం, వాయుసేనలపైకన్నా నౌకాదళం మీదే వ్యయీకరించడం పట్ల భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కరం వీర్ సింగ్ కలవరం వ్యక్తంచేశారు. హిందూ మహాసముద్రంలో చైనా నౌకాదళ హడావుడి మరింత పెరగనుందని ఇది సూచిస్తోంది. సైనికులు, నావికులు, వాయుసేన సిబ్బందిపై రెండు దేశాలూ భారీగా ఖర్చు చేస్తున్నా, చైనా క్రమంగా సిబ్బంది బలగాన్ని తగ్గించుకొంటూ, సేనల ఆధునికీకరణపై ఖర్చు పెంచుతోంది. సరికొత్త ఆయుధాలను సమకూర్చుకోవడానికి భారత్ కన్నా నాలుగున్నర రెట్లు ఎక్కువ ఖర్చుచేస్తోంది. సిబ్బంది జీతభత్యాలు, పింఛన్లపై చైనాకన్నా భారత్ ఎక్కువ నిష్పత్తిలో ఖర్చు చేస్తున్నందువల్ల ఆధునికీకరణకు నిధులు చాలడం లేదు. 2010లో చైనా ఆధునిక ఆయుధాల సేకరణకు ఒక రూపాయి ఖర్చు చేస్తే, సిబ్బందిపై ఒక రూపాయి నాలుగు పైసలు పెట్టింది. ఏడేళ్లు తిరిగేసరికి సిబ్బందిపై వ్యయం 75 పైసలకు దిగింది. అదే భారతదేశం 2017లో సరికొత్త ఆయుధాలకన్నా సిబ్బందిపై 2.3 రెట్లు ఎక్కువ ఖర్చు చేసింది. 2010లో ఆధునిక ఆయుధాల సమీకరణ కోసం భారత్ కన్నా రెండు రెట్లు ఎక్కువ నిధులు వెచ్చించిన చైనా, 2017 వచ్చేసరికి నాలుగున్నర రెట్లు ఎక్కువ వ్యయీకరించింది. భావి యుద్ధాలకు అధునాతన ఆయుధాలే కీలకమని భారత్ కూడా గ్రహించకతప్పదు.

వేర్పాటువాద రాజకీయాలకు చెల్లు

కేంద్ర ప్రభుత్వం 'జమ్మూ కశ్మీర్‌పై తీసుకున్న నిర్ణయం సర్వత్రా ప్రకంపనలు సృష్టించింది. ఉభయ సభల వేదికగా అధికరణ-370ని బుట్టదాఖలు చేస్తూ వెలువరించిన తీర్మానం కశ్మీరీ రాజకీయ పక్షాలతోపాటు దేశంలోని ప్రధాన పార్టీలు తమ విధానాలు మార్చుకోక తప్పని పరిస్థితిని సృష్టించింది. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి- స్వీయపాలన అంటూ ఇన్నేళ్లూ వినిపించిన వాదనలన్నీ 370-అధికరణ రద్దు కారణంగా న్యాయ ప్రాతిపదికను కోల్పోయి గాలిలో కలిసిపోయాయి. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ కశ్మీర్‌కు అంతర్గత స్వతంత్ర ప్రతిపత్తికోసం దశాబ్దాలుగా వాదనలు వినిపించింది. ఆ పార్టీకి సంబంధించిన పెద్ద తలకాయలన్నింటినీ ఇప్పుడు అరెస్టు చేయడమో లేక గృహ నిర్బంధంలో ఉంచడమో చేశారు. పీడీపీ నాయకులు స్వీయ పాలన కోసం ఉద్యమించారు. ఆ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీని ప్రస్తుతం హరి నివాస్‌లోని గెస్ట్ హౌస్‌లో గృహ నిర్బంధంలో ఉంచారు. జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీల ప్రభుత్వాలు కొనసాగిన కాలంలో వేర్పాటువాదులను ఈ గెస్ట్ హౌస్‌లో నిర్బంధించేవారు.

కశ్మీరీ నాయకుల నిర్బంధాలు ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చు. కానీ ప్రజలను ప్రభావితం చేసి ఓట్లు సంపాదించేందుకు ఇన్నాళ్లూ వారు ప్రయోగించిన నినాదాలు ఇకపై అక్కరకు రానివిగానే మిగిలిపోతాయి. జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాల గురించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రేఖామాత్ర సంకేతాలిచ్చింది. జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదం ప్రస్తావనకు కూడా రాని వాతావరణాన్ని కేంద్రం సృష్టించింది. ఈ పరిస్థితుల్లో వేర్పాటువాద భావజాలాన్ని తిరిగి నెత్తికెత్తుకోవడమంటే అది ఒకరకంగా ప్రధాన స్రవంతి ఆలోచన ధోరణిని ధిక్కరించడమే అవుతుంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం ఇప్పుడు లేదు. అసెంబ్లీ వేదికగా ప్రత్యేక వాదాన్ని వినిపించేందుకు అక్కడి రాజకీయ పక్షాలకు దారులు మూసుకుపోయాయి. వేర్పాటువాదం ప్రాతిపదికగా కొనసాగుతున్న కొన్ని స్థానిక రాజకీయ పక్షాలు అదే పంథా కొనసాగించవచ్చు. అధికరణ-370 రద్దుతో ఇప్పుడవి ఏ అజెండా ప్రాతిపదికన ఓట్లు అడుగుతాయో చూడాలి. జాతీయ పార్టీలతో పోలిస్తే గతంలో కశ్మీరీ పార్టీలు బాగా దూకుడుగా వ్యవహరించేవి. అధికరణ-370 పాదుకొనడానికి గతంలో నేషనల్ కాన్ఫరెన్స్ తీసుకున్న చొరవే కారణం. తాజా పరిణామం నేషనల్ కాన్ఫరెన్స్‌కు రాజకీయంగా కోలుకోలేని దెబ్బ! 'పీడీపీ' ఇటీవల పుట్టిన పార్టీ కాబట్టి దానికి పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. ఏదో ఒక నినాదం, విధానంతో ఆ పార్టీ ఆస్తిత్వ ప్రకటన చేసుకొనే అవకాశాలున్నాయి. సివిల్ సర్వీసులకు రాజీనామా చేసి మరీ రాజకీయ రంగ ప్రవేశం చేసిన షా ఫైజల్ వంటి వాళ్లకూ పెద్ద ఇబ్బందులు ఉండకపోవచ్చు. 'జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి' పునాదిగా రాజకీయం నెరపిన నేషనల్ కాన్ఫరెన్స్ ఇకమీదట కొత్త పంథా ఎంచుకోవాల్సి ఉంటుంది. వేర్పాటువాదాన్ని బలంగా ముందుకు తెచ్చి తనను తాను పునరుజ్జీవింపజేసుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నించవచ్చు. దాని అడుగులు ఆ దిశగా పడుతున్న సూచనలు ఇప్పటికే స్పష్టమవుతున్నాయి.

ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్) మెహబూబా ముఫ్తీ (పీడీపీ)

ఇరకాటంలో కశ్మీరీ పార్టీలు

జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ శ్రీనగర్‌లో ఆగస్టు నాలుగున అఖిల పక్ష సమావేశం జరిగింది. ఆ మేరకు 'గుప్కర్ తీర్మానం' వెలువడింది. అధికరణ-370 రద్దును ఊహించి అందుకు వ్యతిరేకంగా నేషనల్ కాన్ఫరెన్స్ వేసిన తొలి అడుగుగా దాన్ని భావించవచ్చు. ఏడో దశకంలో నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా భారత ప్రభుత్వానికి హెచ్చరిక సందేశాలు పంపేందుకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు వెళ్ళారు. మక్బూల్ భట్‌తో, అతడి మద్దతుదారులతో కలిసి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సైనిక దళాల నియామక ర్యాలీలో ఫరూఖ్ అబ్దుల్లా పాల్పంచుకున్నారు. అందుకు శిక్షగా మక్బూల్ భట్‌ను ఆ తరవాత తిహార్ జైలుకు తరలించారు. మరోవంక పీడీపీ మాత్రం లోగొంతుకతో వినిపించీ వినిపించనట్లు 'వేర్పాటువాదాన్ని' ప్రవచించింది. ఆ పార్టీ ఒక రకంగా కేంద్ర ప్రభుత్వానికి విశ్వసనీయ విపక్షంగా వ్యవహరించిందనే చెప్పాలి. కానీ, తాజా చర్యలతో మోదీ సర్కారు వేర్పాటువాదులకు, ప్రధాన స్రవంతి ఆలోచన ధోరణికి మధ్య విస్పష్టమైన లక్ష్మణ రేఖలు గీసింది. 'నయా కశ్మీర్' నినాదంతో ప్రధాని మోదీ కొత్త తరహా రాజకీయానికి తెరలేపారు.

కర్ఫ్యూ సడలించిన నేపథ్యంలో కశ్మీర్‌లో నిరసన కారుల ర్యాలీలు జరిగాయి. అధికరణ-370 రద్దును వ్యతిరేకంగా నినదించిన నిరసనకారులు 'ఆజాదీ' (కశ్మీర్‌కు స్వేచ్ఛ) కావాలంటూ రోడ్డెక్కారు. వేర్పాటువాదుల పంథా ఎలా ఉండబోతోందన్న దానికి ఆ నిరసన ప్రదర్శనలు సంకేతంగా నిలిచాయి. మారిన పరిస్థితుల్లో వేర్పాటువాదం వినిపించడం ఇక ఎంత మాత్రం చట్టసమ్మతం కాదు. జన్మస్థలం ఆధారంగా ప్రత్యేక హక్కులన్న వాదనలకు కాలంచెల్లింది. వేర్పాటువాదులు సమకాలీన తను కోల్పోయారు. 'దిల్లీ'తో బేరసారాలు ఆడటానికి వారి వద్ద ఇప్పుడే రకమైన సాధన సంపత్తీ లేదు. నిజానికి కొన్ని రకాల చట్టబద్ధ రక్షణలు తప్ప వారు కోల్పోయింది కూడా పెద్దగా ఏమీ లేదు. వేర్పాటువాదం గతి తప్పితే గతంలో రాష్ట్ర ప్రభుత్వం వారిని జైళ్లలో పెట్టేది. ఇకమీదట 'కేంద్రపాలిత ప్రాంతం' ప్రాతిపదికన ఆ పని జరుగుతుంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తొలగిస్తే పాకిస్థాన్ విరుచుకుపడుతుందని, ఎంతకైనా తెగిస్తుందని వేర్పాటువాదులు ఆశలు పెట్టుకున్నారు. ఆచితూచి, మెత్తమెత్తగా మాట్లాడుతూ పాకిస్థాన్ స్పందించిన విధానంతో కశ్మీరీ వేర్పాటువాదులు నీరుగారిపోయారు. కశ్మీర్‌ను దిగ్బంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు కొందరి మనసులను గాయపరచాయనడంలో సందేహం లేదు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కశ్మీర్' నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఒక గంభీర వాతావరణం, నిశ్శబ్దం నెలకొంది. అధికరణ-370 రద్దు ద్వారా తలపెట్టిన లక్ష్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 75శాతం సాధించేసింది. ఇంకో పాతిక శాతం పని మిగిలిఉంది. కశ్మీర్ భవిష్యత్తు గమనాన్ని, దానిపై కేంద్ర ప్రభుత్వ విధానాన్ని నిర్దేశించే కీలక ఘట్టం ఇదే!

– బిలాల్ భట్

(రచయిత– కశ్మీరీ వ్యవహారాల నిపుణులు)

ఈనాడు లేఖలు

శిథిలమవుతున్న చరిత్ర

అపురూపమైన పురాతన కట్టడాలకు వేదికైన హైదరాబాద్ నగరం పర్యాటక కోణంలో ఇతర రాష్ట్రాలనూ ఆకట్టుకుంటోంది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ కట్టడాల్లో చాలా భాగం రూపు కోల్పోతున్నాయి. కొన్ని ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. మరికొన్ని శిథిలమవుతూ, అవసాన దశకు చేరాయి. ఎన్నో కట్టడాలు ఒకప్పటి వైభవానికి సాక్ష్యాలుగా నిలిచాయి. ప్రస్తుతం వాటిని పట్టించుకునేవారు లేరు. గతంలో వీటి పరిరక్షణకు కొన్ని ప్రయత్నాలు జరిగినా, అవి అర్ధాంతరంగా ఆగిపోయాయి. రాష్ట్ర పురావస్తు శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల పరిధిలో ఉన్న ఈ కట్టడాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. పురాతన కట్టడాలకు ఆలవాలమైన హైదరాబాద్ విశిష్టతను కాపాడే చర్యలు చేపట్టాలి.

- ఎ.హరీష్‌కుమార్, భాగ్యలత కాలనీ, హైదరాబాద్

తీర్పు అభినందనీయం

తొమ్మిది నెలల పసికందును చిదిమేసిన ఉన్మాదికి వరంగల్ ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించడం అభినందనీయం. తెలుగురాష్ట్రాల్లో అతి తక్కువ కాలంలో (48 రోజుల్లో) తీర్పు వెలువడిన తొలి కేసు ఇది. ఈ తీర్పు కామాంధులకు ఓ హెచ్చరిక కావాలి. ఇకపై చిన్నారులపై ఎవరు అఘాయిత్యాలకు పాల్పడినా ఈ తరహా తీర్పులే వెలువడాలి. తల్లిపాత్తిళ్ళలో నిద్రిస్తున్న చిన్నారిని ఉన్మాది ప్రవీణ్ అర్ధరాత్రివేళ

లక్ష కోట్ల స్థిరాస్తి వ్యాపారం

దూసుకుపోతున్న రియల్ రంగం

- అమ్మకాలు, కొనుగోళ్లు లక్ష కోట్లకు పైనే
- రిజిస్ట్రేషన్ల విలువే రూ.85 వేల కోట్లు
- ప్రభుత్వ ధరకంటే 40 శాతం ఎక్కువకు రిజిస్ట్రేషన్
- మూడు లక్షల ఎకరాల వ్యవసాయ భూముల అమ్మకం
- రియల్ రారాజు రంగారెడ్డి జిల్లా
- హైదరాబాద్ చుట్టుపక్కల కొనసాగుతున్న జోరు
- విస్తరిస్తున్న అపార్ట్‌మెంట్ల సంస్కృతి

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 1.82 లక్షల కోట్ల రూపాయలు. రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరంలో భూములు, ఫ్లాట్లు, ఫ్లాట్ల క్రయ విక్రయాల్లో చేతులు మారింది అక్షరాలా లక్ష కోట్ల రూపాయలపైనే. పెట్టుబడి... అవసరం... అంతకు మించి ఆస్తులకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఒక్క 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రంలో లక్ష కోట్లు చేతులు మారడం విశేషం. స్థిరాస్తుల క్రయ విక్రయాలలో గత రికార్డులు తుడిచిపెట్టుకుపోతున్నాయి. శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం... చుట్టుపక్కల జిల్లాల్లో దూసుకుపోతున్న రియల్ రంగం నేపథ్యంతోపాటు రాష్ట్రంలో మిగిలిన ప్రధాన నగరాలు...పట్టణాల్లో కూడా శరవేగంగా పెరుగుతోంది. ఇళ్లు, ఇళ్ల స్థలాలు. ..వ్యవసాయ భూములు విక్రయాల జోరు కొనసాగుతోంది. రాష్ట్రంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్టర్ చేసిన భూములు, ఫ్లాట్లు, ఫ్లాట్ల విలువ రూ.85 వేల కోట్లకు పైనే. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువకంటే 40 శాతానికి పైగా చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకోవడం గమనార్హం. వాస్తవానికి అంతకు మించిన ధరకే క్రయవిక్రయాలు జరుగుతాయనేది అందరికీ తెలిసిందే. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో రియల్ దూకుడు కొనసాగుతోంది. హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాల్లో వ్యవసాయ భూముల విక్రయాలు జోరు మీదున్నాయి. ఒక్క ఏడాదే రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూముల విక్రయాలు జరిగాయి. విక్రయించిన భూముల సగటు విస్తీర్ణం ఎకరంలోపే ఉండటం ప్రత్యేకం. 2018-19లో రిజిస్ట్రేషన్ల శాఖకు అంచనాలకు మించి ఆదాయం వచ్చింది. ఐదేళ్లలో రిజిస్ట్రేషన్ల సంఖ్య రెట్టింపు కాగా రాబడి 140 శాతం పెరిగింది. వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్‌లోనూ రంగారెడ్డి జిల్లా ముందు వరుసలో ఉండగా తర్వాతి స్థానాల్లో నల్గొండ, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, కరీంనగర్‌లు ఉన్నాయి.

	వ్యవసాయ భూములు	వ్యవసాయేతర భూములు
రిజిస్ట్రేషన్లు	3,62,760	6,12,919
రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆస్తుల విలువ	రూ.15374 కోట్లు	రూ.66184 కోట్లు
ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ	రూ.11048 కోట్లు	రూ.47068 కోట్లు

3.2 లక్షల ఎకరాల భూములు అమ్మకం

వ్యవసాయ భూములు బంగారమయ్యాయి. ఒక వైపు నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభా నేపథ్యంలో విస్తరిస్తున్న నగరాలు, పట్టణాల చుట్టు పక్కల వ్యవసాయ భూముల విక్రయాల జోరు కొనసాగుతోంది. అధికారికంగానే ఒక్క ఏడాదిలో క్రయ విక్రయాలు జరిగిన వ్యవసాయ భూముల విలువ రూ.15 వేల కోట్లు పైనే. రాష్ట్రంలో 3.2 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు అమ్మకం జరగ్గా 3.6 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో కూడా పూర్వపు మెదక్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్‌లు ముందు వరుసలో ఉన్నాయి. విక్రయించిన వ్యవసాయ భూముల సగటు విస్తీర్ణం ఎకరంలోపే ఉండటం ప్రత్యేకం.

ఐదేళ్లలో పెరుగుదల ఇలా

సంవత్సరం	రిజిస్ట్రేషన్ల సంఖ్య	రిజిస్ట్రేషన్ల రాబడి (రూ.కోట్లలో)
2014-15	7,35,922	2746
2015-16	9,66,946	3876
2016-17	10,55,898	4249
2017-18	11,36,372	5176
2018-19	15,32,468	6612

ఇళ్ల కొనుగోలులో మేడ్చల్ ముందు

హైదరాబాద్ చుట్టు పక్కల ఇండిపెండెంట్ ఇళ్లకు, విల్లాలకు డిమాండ్ బాగా ఉంది. ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణంలో కూడా హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలే ముందున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 93,750 ఇళ్లు విక్రయించగా, ఈ జిల్లాలోనే అత్యధికంగా 18,915 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. రంగారెడ్డి, హైదరాబాద్ తరువాత స్థానాల్లో నిలిచాయి. సంగారెడ్డి జిల్లాలోనూ ఎక్కువ సంఖ్యలో ఇళ్ల విక్రయాలు జరిగాయి. హైదరాబాద్, రంగారెడ్డి సహా చుట్టపక్కల ఉన్న జిల్లాల్లోనే ఇళ్ల విక్రయాలు అధికంగా ఉండటం గమనార్హం. గేటెడ్ కమ్యూనిటీలు బాగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఇండిపెండెంట్ ఇళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఏదో ఒక గూడు కోసం తాపత్రయం

తడిసిమోపెడవుతున్న అద్దెలు....రోజు రోజుకు పెరుగుతున్న ధరల నేపథ్యంలో నివాసానికి గూడు ఏర్పాటు చేసుకునే ఆలోచన పెరుగుతోంది. ఫలితంగానే అవకాశం ఉన్న చోట ఇండిపెండెంట్ ఇల్లు... నగరాల్లో అయితే ఫ్లాట్లను కొనుక్కునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఫ్లాట్లకు (అపార్ట్‌మెంట్లకు) మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. రాష్ట్రంలో మొత్తం 69,204 అపార్ట్‌మెంట్ల అమ్మకాలు జరగ్గా మేడ్చల్ మల్కాజిగిరి తొలిస్థానంలో నిలిచింది. హైదరాబాద్, సంగారెడ్డి తరువాతి స్థానాల్లో ఉన్నాయి. అపార్ట్‌మెంట్ల సంస్కృతి ఇతర జిల్లాల్లోనూ విస్తరిస్తోంది.

ఇళ్ల స్థలాలకే అత్యంత ప్రాధాన్యం

ఇళ్లు, ఫ్లాట్లకంటే ఇళ్ల స్థలాల కొనుగోలుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇళ్లు, ఫ్లాట్ల కంటే ఇళ్ల స్థలాల కొనుగోలుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. రాష్ట్రంలో గత ఏడాది 6.06 లక్షల మంది ఏదో ఒక స్థిరాస్తిని కొనుక్కోగా ఇందులో 4.4 లక్షల మంది ఇళ్ల స్థలాలను కొనుక్కోవడం విశేషం. ఇళ్ల స్థలాల (ప్లాట్లు) క్రయవిక్రయాల్లోనూ రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలే అగ్రస్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 4,43,864 పాట్ల క్రయవిక్రయాలు జరగ్గా అందులో 2,41,960 సగానికి పైగా ఈ జిల్లాల్లోనే ఉన్నాయి. యాదాద్రి, నల్గొండ జిల్లాలు తరువాతి స్థానంలో ఉన్నాయి.

విస్తరిస్తున్న అపార్ట్‌మెంట్ల సంస్కృతి

నగరాలకే పరిమితమైన అపార్ట్‌మెంట్ సంస్కృతి క్రమంగా రాష్ట్రంలో అన్ని జిల్లాలకు విస్తరిస్తోంది. ప్రధాన నగరాలతో పాటు కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో కూడా అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరుగుతోంది. మంచిర్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, భద్రాది కొత్తగూడెం జిల్లాల్లోనూ అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి.

అంచనాలు మించిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ విలువ మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన రేటు కంటే 40 శాతం ఎక్కువ మొత్తానికి రిజిస్ట్రేషన్లు చేసుకోవడం గమనార్హం. రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.6,612 కోట్ల రాబడి వచ్చింది. రూ.5400 కోట్ల రాబడి వస్తుందని అంచనా వేయగా రూ.1212 కోట్లు అదనంగా వచ్చింది.

వ్యవసాయ భూముల విక్రయాలు



వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు 3,62,760

వ్యవసాయ భూముల అమ్మకం 3,20,620 ఎకరాలు

కనిపించని 'సంతోషం'

అమ్మా అని కొడుకు పిలిచే పిలుపు కోసం ఈ తల్లి వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. తన వరాల మూటను గుండెలకు హత్తుకుని ముద్దాడాలని తపిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన తన కుమారుడిని తలుచుకుంటూ ఆ తల్లి పడుతున్న వేదన వర్ణనాతీతం. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన వనజ, నరేష్ దంపతులు ఉపాధి కోసం ఏడేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు వలస వచ్చారు. 2013 ఏప్రిల్ 17న ఇంటి సమీపంలో ఆడుకుంటున్న వీరి కుమారుడు సంతోష్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు.. అప్పటి నుంచి కుమారుడి ఆచూకీ దొరక్క తల్లడిల్లిపోతున్నారు. నిత్యం పోలీసులను కలుస్తూ కుమారుడి గురించి వాకబు చేస్తూనే ఉన్నారు. ఏదో ఒక రోజు బిడ్డ వచ్చి అమ్మా అని పిలవకపోతాడా.. అని ఆ తల్లి వేయి కళ్లతో ఎదురుచూస్తోంది.

-ఈనాడు, హైదరాబాద్

ఆర్టికల్-370 రద్దుకు ప్రపంచం మొత్తం మద్దతిచ్చింది

- బిల్లు రూపకల్పనలో భాగస్వామి కావడం పూర్వజన్మ సుకృతం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: డెబ్బై ఏళ్లుగా అన్నివిధాలుగా నష్టపోయిన జమ్మూకశ్మీర్ ప్రజలకు భారత ప్రభుత్వ ఫలాలు అందించాలనే సంకల్పంతో ఆర్టికల్-370ని రద్దు చేశామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ చర్యకు పాకిస్థాన్ తప్ప ప్రపంచం మొత్తం మద్దతిచ్చిందన్నారు. 370 ఆర్టికల్‌ను అడ్డుగా పెట్టుకుని అక్కడున్న రెండు, మూడు కుటుంబాలు ఇన్నాళ్లపాటు చెలగాటమాడాయని ఆరోపించారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో వివిధ కార్యక్రమాల్లో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో, భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన మేధావుల సభలో ఆయన మాట్లాడుతూ.. 370 ఆర్టికల్ రద్దు చేసే బిల్లు రూపకల్పనలో తాను భాగస్వామిని కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. ముస్లిం మహిళలకు స్వేచ్ఛనిస్తూ, వారిలో ఆత్మగౌరవాన్ని పెంచేలా ముమ్మారు తలాక్ చట్టాన్ని తమ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ బిల్లును గతంలో సుప్రీంకోర్టు సైతం సమ్మతించిందని, అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో తెరాసను ఎన్నుకోవటమే ఓ పాపంగా మారిందని ఎద్దేవా చేశారు. ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం సరిగ్గా అమలు చేయటం లేదన్నారు. ఎంతో సదుద్దేశంతో ప్రధాని మోదీ తీసుకొచ్చిన ఆయుష్మాన్‌భవ పథకం రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకున్నారని సీఎం కేసీఆర్ తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదన్నారు.

భాజపాలో చేరడం లేదు: రమావత్ నాయక్

ఈనాడు, హైదరాబాద్: తాను భాజపాలో చేరుతానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రమావత్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిట్టని వారే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని, తెదేపాలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

సోనియా నేతృత్వంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం: టీపీసీసీ

ఈనాడు, హైదరాబాద్: ఏఐసీసీ తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియా గాంధీ ఉండాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు టీపీసీసీ సీనియర్ నేతలు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్‌లో ప్రతిష్టంభన తొలగిపోయిందని సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ శ్రేణులు సన్నద్ధమవుతాయని పేర్కొన్నారు. ఆదివారం మాజీ మంత్రి ఎం.శశిధర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిరంజన్, శ్యాంమోహన్‌లు గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సోనియాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పూర్వ వైభవం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు సోనియా నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు.



మల్లాపూర్ చెంచుపెంటలో విల్లు ఎక్కుపెట్టిన హన్మంతరావు

యురేనియం వ్యతిరేక ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు: వీహెచ్

మన్ననూర్, న్యూస్‌టుడే: నల్లమల అడవిలో యురేనియం తవ్వకాల వ్యతిరేక ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందని మాజీ ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు చెప్పారు. అమ్రాబాద్ పులుల అభయారణ్యం దేశంలోనే రెండో అతి పెద్దదని, 22 పులులు ఆవాసం ఉన్నాయని ఓవైపు చెబుతూనే.. యురేనియం తవ్వకాలకు అనుమతులివ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నల్లమలలో యురేనియం సర్వేకు అనుమతుల నేపథ్యంలో ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో పర్యటించారు. డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణతో కలిసి లోతట్టు అటవీ ప్రాంతంలో ఉన్న మల్లాపూర్ చెంచుపెంటను సందర్శించి, చెంచులతో సమావేశమయ్యారు. అడవులు పెంచాలి, వర్షాలు కురవాలని చెబుతున్న సీఎం కేసీఆర్ యురేనియం సర్వేకు కేంద్రం ఇచ్చిన అనుమతులను ఎందుకు అడ్డుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

ఉగ్ర దాడులపై కేంద్రం హెచ్చరికలు

రాష్ట్రంలో భద్రత కట్టుదిట్టం

ఈనాడు, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అసాంఘిక శక్తులు అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశం ఉందని కేంద్ర నిఘా సంస్థ రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇలాంటి హెచ్చరికలు చేయడం సాధారణమే అయినా.. జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. పాకిస్థాన్, దాని మద్దతుతో చెలరేగుతున్న ఉగ్రవాద సంస్థలు విధ్వంసానికి ప్రయత్నిస్తున్నాయని, దేశంలోని నిద్రాణ బృందాల (స్లీపర్ సెల్స్)ను చైతన్యవంతం చేశాయని నిఘా సంస్థలు ఇదివరకే హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో పాత నేరస్థులు, అనుమానితులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.

విశ్వసనీయ విద్యా సంస్థగా బాసర ఆర్జీయూకేటీ

పురస్కారం అందుకున్న ఉపకులపతి అశోక్

బాసర, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీకి అరుదైన గుర్తింపు లభించింది. భారత అత్యుత్తమ విశ్వసనీయ విద్యాసంస్థగా ఈ విద్యాలయం నిలిచింది. ముంబయికి చెందిన ఐబీసీ ఇన్ఫో మీడియా సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. ఈ పురస్కారం మీడియా పారిశ్రామిక, విద్యా రంగాల్లో విశ్వసనీయతకు మారుపేరైన సంస్థలకు అందజేస్తారు. విద్య అనే సామాజిక సాధనంతో నవభారత నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న విద్యా సంస్థగా బాసర ఆర్జీయూకేటీని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఐబీసీ సంస్థ ఛైర్మన్ కౌశిక్ చేతుల మీదుగా విద్యాలయ ఉపకులపతి అశోక్ అవార్డు అందుకున్నారు. విద్యాలయం సాధిస్తున్న విజయాలు గర్వకారణమని అశోక్ పేర్కొన్నారు.

ఐబీసీ సంస్థ ఛైర్మన్ కౌశిక్ నుంచి అవార్డు అందుకుంటున్న బాసర ఆర్జీయూకేటీ ఉపకులపతి అశోక్

'లిజనింగ్, లెర్నింగ్, లీడింగ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమిత్ షా. చిత్రంలో ఎడమ నుంచి వరుసగా పుల్లెల గోపీచంద్, గురుమూర్తి, కస్తూరి రంగన్, పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, బన్వరిలాల్ పురోహిత్, వెంకయ్య నాయుడు, ప్రకాశ్ జావడేకర్, ఎంఎస్ స్వామినాథన్, ప్రతాప్ సి.రెడ్డి, విశ్వనాథన్, రజనీకాంత్

ప్రజా జీవితంలోనే ఉన్నా

- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఈనాడు డిజిటల్, చెన్నై: తాను క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యానేగానీ.. ప్రజాజీవితం నుంచి విశ్రాంతి తీసుకోలేదని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దేశమంటే కేవలం భౌగోళిక చిత్రం కాదని, అది కోట్ల మంది సమ్మిళిత అభివృద్ధి ముఖచిత్రం కావాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో 'లిజనింగ్, లెర్నింగ్, లీడింగ్' అనే పుస్తకాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ అధ్యక్షత వహించారు. ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రజాజీవితంలోకి వచ్చిన నాటి నుంచి వారికి మరింత దగ్గరగా ఉన్నానని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న తన పర్యటనలను విజ్ఞాన సముపార్జన యాత్రలుగా ఆయన అభివర్ణించారు. 2020 తర్వాత నానాజీ దేశ్‌ముఖ్ బాటలో సామాజిక సేవలో గడుపుదామనుకుంటున్నానని, ఈ విషయాన్ని ప్రధాని మోదీకి చాలాసార్లు వివరించానని చెప్పారు. దేశంలో సుప్రీంకోర్టు 4 బెంచ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రయోగాత్మకంగా అదనపు బెంచ్‌ను చెన్నైలో ఏర్పాటు చేయాలని సూచించారు. జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ఆవశ్యకమని చెప్పారు. బలవంతంగా ఏభాషనూ ఇతరులపై రుద్దడం, ఏ భాషనూ వ్యతిరేకించడం తగదని చెప్పారు.

వారిద్దరూ శ్రీకృష్ణార్జున ద్వయం

సూపర్‌స్టార్ రజనీకాంత్ మాట్లాడుతూ.. కశ్మీరు వ్యవహారంలో అమిత్ షా అద్భుతంగా వ్యవహరించి ఆర్టికల్ 370ని రద్దు చేశారని కొనియాడారు. పార్లమెంటులో ఆయన అనుసరించిన విధానాన్ని ప్రశంసించారు. అమిత్ షా, ప్రధాని మోదీలను శ్రీకృష్ణార్జున ద్వయంగా అభివర్ణించారు. ఎవరు కృష్ణుడు? ఎవరు అర్జునుడు? అనే విషయం మాత్రం తనకు తెలియదని, ఆ విషయం వారికే తెలియాలని చమత్కరించారు. తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్, సీఎం పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్, ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, తుగ్లక్ పత్రిక సంపాదకుడు గురుమూర్తి, 'అపోలో' ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి, వీఐటీ విశ్వవిద్యాలయ కులపతి విశ్వనాథన్ పాల్గొన్నారు.

నడవడికను నేర్పే పుస్తకం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. ఈ పుస్తకం కేవలం వెంకయ్య నాయుడు రెండేళ్ల ప్రస్థానానికి సంబంధించిన అంశాల సమాహారం మాత్రమే కాదని, జీవితంలో ఒక మనిషి ఎలా నడుచుకోవాలో తెలిపేదని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుపై వెంకయ్య నాయుడు ఏబీవీపీలో ఉన్నప్పుడే పోరాడారని గుర్తు చేశారు. ఈ బిల్లు రాజ్యసభకు వెళ్లిన సమయంలో ఆమోదం పొందుతుందా? లేదా? అనే సందేహం తనకు ఉండేదని, అందుకే మొదట బిల్లును రాజ్యసభలో, తర్వాత లోక్‌సభలో ఆమోదించాలనుకున్నామని పేర్కొన్నారు. రాజ్యసభలో వెంకయ్య నాయుడు అద్భుతంగా వ్యవహరించి బిల్లు ఆమోదం పొందేలా సభను నడిపారని కితాబిచ్చారు. ఆర్టికల్ 370వల్ల భారత్‌కుగానీ, కశ్మీరుకుగానీ ఎలాంటి ప్రయోజనం లేదని అందుకే రద్దు చేశామని పేర్కొన్నారు.

త్వరలో భాజపా గూటికి మోత్కుపల్లి

- భేటీ అయిన లక్ష్మణ్, కిషన్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ సైతం
- ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు ముమ్మరం

ఈనాడు, హైదరాబాద్: సీనియర్ నాయకుడు, తెదేపా మాజీ నేత మోత్కుపల్లి నర్సింహులు త్వరలో కమలం గూటికి చేరనున్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం రాత్రి మోత్కుపల్లితో హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటలపాటు ఈ సమావేశం జరిగింది. భాజపాలో చేరాలని ఆయన్ను ఆహ్వానించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో అపాయింట్‌మెంట్ ఉంటుందని భాజపా నేతలు వివరించినట్లు సమాచారం. దీంతో భాజపాలో చేరేందుకు మోత్కుపల్లి అంగీకరించారు. తెలంగాణలో తెరాస ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం భాజపాయేనని మోత్కుపల్లి అన్నారు. "మా కార్యకర్తలతో మాట్లాడుతున్నా. భాజపాలో చేరాలని ఆహ్వానించారు. అమిత్‌షా అపాయింట్‌మెంట్ ఇచ్చాక పార్టీలో చేరుతా' అని నర్సింహులు చెప్పారు.

అసంతృప్తులపై 'ఆకర్ష్'

ఇతర పార్టీల్లో అసంతృప్త నేతలను ఆకర్షించే ప్రయత్నాలను కమలనాథులు ముమ్మరం చేశారు. పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్‌తో లక్ష్మణ్ ఆదివారం ఆయన నివాసంలో సమావేశమయ్యారు. త్వరలోనే తాను భాజపాలో చేరతానని నందీశ్వర్‌గౌడ్ తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితో.. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరుగుతున్నాయని.. త్వరలో స్పష్టత వస్తుందని భాజపా నేత ఒకరు తెలిపారు.

కేసీఆర్‌కు అసలు సినిమా ముందుంది: లక్ష్మణ్

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రస్తుతం చూపించేది ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఆదివారం ఆయన మాట్లాడారు. భాజపాకు వస్తున్న ప్రజాదరణను చూసి తెరాస, కాంగ్రెస్‌లు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాహుల్ ఆధ్వర్యంలో పార్టీ చతికిలపడటంతోనే మళ్లీ సోనియా అధ్యక్ష బాధ్యతలు చేపట్టారన్నారు. 370 ఆర్టికల్ రద్దును అందరూ హర్షిస్తుంటే కేటీఆర్ మజ్లిస్‌ను పక్కనపెట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. మజ్లిస్ నేతలు హిందువుల మనోభావాలు కించపరిచేలా మాట్లాడితే ఎందుకు ఖండించలేదన్నారు. భాజపాలో ఉన్నవారు మతతత్వవాదులని, కేంద్ర పథకాలకు కేటీఆర్ మతం రంగును అంటగడుతున్నారని విమర్శించారు. కుటుంబ, నియంతృత్వ, అవినీతి పాలనకు చరమగీతం పాడాలంటే ప్రజలకు భాజపాయే ప్రత్యామ్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఒంటరిగా పోటీచేసి గెలుస్తామన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను కాపాడే దిశగా 'విమోచన దినోత్సవం' నిర్వహించనున్నట్లు తెలిపారు.

మోత్కుపల్లి నర్సింహులును ఆయన నివాసంలో కలిసిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

బొగత జలపాతం.. జనసంద్రం

బొగత జలపాతం జన సంద్రాన్ని తలపించింది. ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో సందడి నెలకొంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి వాగుపై సహజ సిద్ధంగా ఏర్పడిన బొగత జలపాతానికి ఇటీవల కురిసిన భారీ వర్షాలతో భారీ స్థాయిలో వరద వచ్చింది. పర్యాటకులు లోతు నీటిలోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన రక్షణ కంచె నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. ప్రవాహం వేగంగా ఉండటంతో పర్యాటకులను లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. క్రమంగా వరద ఉధృతి తగ్గడం, రక్షణ కంచె తిరిగి ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం పర్యాటకులను లోనికి అనుమతిస్తున్నారు. వరుస సెలవులు రావడంతో ఆదివారం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు.

-న్యూస్‌టుడే, వాజేడు

పొలంలో మొసలి

సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం మన్‌సాన్‌పల్లిలోని ఓ పొలంలో మొసలిని గుర్తించారు. గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి పొలం గ్రామ శివారులోని మంజీర నది పరీవాహక ప్రాంతంలో ఉంది. అక్కడ ఆదివారం పొలం పనులు చేస్తున్న రైతులు బురదలో మొసలి ఉండటాన్ని గమనించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. రైతుల సహకారంతో మొసలిని తాళ్లతో బంధించి సింగూర్ జలాశయంలో వదిలినట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

-న్యూస్‌టుడే, జోగిపేట టౌన్

నేడు పులిచింతలకు కృష్ణమ్మ

- తెరుచుకోనున్న సాగర్ గేట్లు
- రోజుకు 55 టీఎంసీలకు పైగా చేరిక
- ఎగువ నుంచి ఏడు లక్షలు క్యూసెక్కుల ప్రవాహం

ఈనాడు - హైదరాబాద్

నాగార్జునసాగర్‌ను దాటి కృష్ణమ్మ పులిచింతలకు బయలుదేరనుంది. ఎగువ నుంచి భారీ ప్రవాహం వస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం సాగర్ నాలుగు గేట్లను ఎత్తేందుకు ఇంజినీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. జలాశయంలోకి శనివారం సాయంత్రం 3.94 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా ఆదివారం సాయంత్రానికి 7.47 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. ఈ ప్రవాహాన్ని గణిస్తే రోజుకు దాదాపు 55-60 టీఎంసీల వరకు వచ్చి చేరుతున్నట్లు అంచనా. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 543.80 అడుగుల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు. గతేడాది సెప్టెంబరు మొదటి వారంలో రెండు గేట్లను ఎత్తి స్వల్పంగా వరదను దిగువకు విడుదల చేశారు. మరోవైపు భారీ ప్రవాహంతో పులిచింతల ప్రాజెక్టు కూడా ఒక్క రోజులోనే నిండనుంది. ఈ ప్రాజెక్టు నిండాలంటే 44 టీఎంసీలు అవసరం. సోమవారం రాత్రికే ఆ ప్రాజెక్టు నిండనున్నట్లు అంచనా వేస్తున్నారు. అనంతరం కృష్ణానది ప్రకాశం బ్యారేజీ మీదుగా బంగాళాఖాతాన్ని చేరుకోనుంది.

ఎగువ నుంచి వరద జోరు

ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు కృష్ణానదిలో ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహం కొనసాగుతోంది. ఏ ప్రాజెక్టు వద్ద పరిశీలించినా కనీసం నలభై టీఎంసీల సామర్థ్యం ఉన్నంత నీటి ప్రవాహం కనిపిస్తోంది. తుంగభద్ర నుంచి రెండు లక్షల క్యూసెక్కులు కృష్ణానదిలోకి వచ్చి చేరుతున్నాయి. జూరాల నుంచి దిగువకు 8.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా... తుంగభద్ర నుంచి రెండు లక్షల క్యూసెక్కులు కలిపి సోమవారం నాటికి శ్రీశైలానికి మరింత వరద పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో శ్రీశైలం నుంచి సాగర్ వైపునకు కూడా భారీగా విడుదల కానుంది. గోదావరి కొంత మేరకు శాంతించినప్పటికీ పేరూరు వద్ద నదిలో 7.41 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ధవళేశ్వరం ఆనకట్టను దాటి 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహం సముద్రంలో కలుస్తోంది.

మేడిగడ్డ 65 గేట్ల నుంచి నీటి విడుదల

మహదేవ్‌పూర్, కాళేశ్వరం, మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం నుంచి బ్యారేజీ 65 గేట్లను తెరిచే ఉంచారు. ఆదివారం 3.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బ్యారేజీ అయిదు గేట్లను ఎత్తారు. ఇన్‌ఫ్లో 23,964 క్యూసెక్కులు ఉండగా 22,655 క్యూసెక్కులను దిగువకు పంపుతున్నారు. సంగమం వద్ద 9.39 మీటర్ల స్థాయిలో గోదావరి ప్రవాహం ఉంది. సుందిళ్ల బ్యారేజీ మూడుగేట్లు ఎత్తి 5,570 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాళేశ్వరం త్రివేణి

జూరాల జలాశయం గేట్ల నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

కృష్ణాగోదావరి బేసిన్లలోని ప్రాజెక్టుల్లో ఆదివారం నాటి నీటి నిల్వలు, ప్రవాహాల వివరాలు

ప్రాజెక్టు పేరు	పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో)	వస్తున్న ప్రవాహం (క్యూసెక్కుల్లో)	దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో)
కృష్ణా పరీవాహకం				
ఆలమట్టి	129.72	101.03	6,17,700	5,40,000
నారాయణపూర్	37.64	26.27	6,00,000	6,11,260
ఉజ్జయిని	117.24	117.24	59,918	85,800
జూరాల	9.66	5.50	8,65,000	8,52,165
తుంగభద్ర	100.86	88.66	2,14,436	2,29,873
శ్రీశైలం	215.81	193.41	6,53,344	7,78,427
నాగార్జునసాగర్	312.05	196.33	5,10,683	38,016
పులిచింతల	45.77	1.05	181	--
ప్రకాశం బ్యారేజీ	3.07	2.96	11,194	11,194
గోదావరి పరీవాహకం				
సింగూరు	29.91	0.47	20	20
నిజాంసాగర్	17.80	0.14	–	10
శ్రీరామసాగర్	90.31	15.93	5,926	389
మధ్యమానేరు	25.87	3.53	157	83
దిగువ మానేరు	24.07	3.53	--	204
కడెం	7.60	6.64	4,014	659
ఎల్లంపల్లి	20.18	19.54	5,570	5,570
ధవళేశ్వరంబ్యారేజీ	2.93	3.18	15,61,763	15,51,063

పారిశ్రామికవేత్త ఎర్నేని జానకిరామయ్య కన్నుమూత

ఎర్నేని జానకి రామయ్య

పెనమలూరు, న్యూస్‌టుడే: పారిశ్రామికవేత్త ఎర్నేని జానకిరామయ్య (79) శనివారం రాత్రి 11 గంటలకు కన్నుమూశారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరుకు చెందిన ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ, డాల్ఫిన్ హోటల్స్ ఎండీ అయిన విజయేశ్వరి ఆయన కుమార్తె. ఆదివారం ఉదయం జానకిరామయ్య మృతదేహాన్ని గంగూరులోని స్వగృహానికి తీసుకొచ్చారు. రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ అట్లూరి రామ్మోహనరావు, విశ్రాంత కేంద్ర విజిలెన్స్ కమిషనరు కేవీ చౌదరి, పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు దేవినేని అవినాశ్, బంధుమిత్రులు.. జానకిరామయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. భార్య సరోజిని, కుమార్తెలు శ్రీవిజయరాజరాజేశ్వరి, విజయేశ్వరి, అమరేశ్వరిలను పలువురు ప్రముఖులు పరామర్శించారు. అనంతరం పటమటలంక స్వర్గపురిలో జానకి రామయ్య పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

త్యాగానికి మారుపేరు బక్రీద్

గవర్నర్, ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణలోని ముస్లింలకు రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ త్యాగానికి మారుపేరన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలను పాటించాలని, సాటి మానవులపై ప్రేమాభిమానాలు, దయ, కరుణ చూపాలని పేర్కొన్నారు.

పర్యాటక కేంద్రంగా కృష్ణా తీరం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సూచించిన కేటీఆర్
- ప్రతిపాదనలను రూపొందిస్తామని మంత్రి వెల్లడి

శ్రీశైలం-నాగార్జునసాగర్, శ్రీశైలం-జూరాల ప్రాజెక్టు మధ్య గల కృష్ణా నది తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను ఆదివారం ట్విటర్‌లో కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ, అభయారణ్య, జల ప్రయాణ పర్యాటక ప్రాజెక్టులను చేపట్టే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాల విడుదలపైనా కేటీఆర్ ట్విటర్‌లో ఆనందం వ్యక్తం చేశారు. కేటీఆర్ ట్వీట్‌కు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పందించారు. "కేటీఆర్ చక్కటి సూచన చేశారు. ఒకట్రెండు రోజుల్లో దీనిపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి, ప్రతిపాదనలను సిద్ధం చేస్తాం" అని పేర్కొన్నారు.

'ఉద్యోగుల సమస్యలను సీఎం పరిష్కరిస్తారు'

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని. . సీఎం కేసీఆర్ సంఘాలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటారని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, గెజిటెడ్ సంఘాల ఐకాస పేర్కొంది. ఐకాస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారెం రవీందర్‌రెడ్డి, మమత, ఇతర నేతలు రాజేందర్, సత్యనారాయణ, మణిపాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌లు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉద్యోగులు.. సీఎంతో కలిసి బంగారు తెలంగాణ కోసం కలిసి పని చేస్తున్నారు. రాష్ట్రంలో మొదటి పీఆర్‌సీ కమిషన్ వేయించుకుని దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగులకు జీత భత్యాలు పెంపుదల ఉండాలని ఐకాస భావిస్తోంది' అని వారు చెప్పారు.

బాలుడి ప్రాణం తీసిన సెల్‌ఫోన్ ఛార్జర్ తీగ

రిషీ మృతదేహం

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ ఛార్జర్ తీగను పట్టుకున్న రెండేళ్ల బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణం దుర్గారావు కాలనీలో చోటు చేసుకుంది. జితేందర్, స్వప్న దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. ఆదివారం రాత్రి ఇంట్లో సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టి కుటుంబీకులు బయట కూర్చున్నారు. కుమారుడు రిషీ(2) ఆడుకుంటూ వెళ్లి ఛార్జింగ్ తీగను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గట్టిగా ఏడవడంతో కుటుంబ సభ్యులు పరుగున వచ్చి తీగను లాగేస్తుండగా వారికీ షాక్ కొట్టింది. ప్రమాదం నుంచి తేరుకుని చూసేసరికి అప్పటికే చిన్నారి మృతి చెందాడు.

'కాళేశ్వరం' బాహుబలి మోటారు వెట్‌రన్ విజయవంతం

రామడుగు, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదో ప్యాకేజీ బాహుబలి మోటారు వెట్‌రన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆదివారం ఇంజినీరింగ్ అధికారులు అయిదో మోటారు వెట్‌రన్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. దీంతో 3,100 క్యూసెక్కుల నీరు గ్రావిటీ కాలువ నుంచి ఎస్సారెస్పీ వరదకాలువలోకి వెళ్లింది. వెట్‌రన్ విజయవంతం కావటంతో ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈ నూనెశ్రీధర్, డీఈ గోపాలక్రిష్ణలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదో ప్యాకేజీ మోటారు నుంచి గ్రావిటీ కాలువలోకి చేరుతున్న నీరు

పడవలో ఒడ్డుకు వస్తున్న మత్స్యకారులు

వరదలో చిక్కుకున్న మత్స్యకార కుటుంబాలు

30 మందిని కాపాడిన పోలీసులు

పెబ్బేరు, న్యూస్‌టుడే : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపురం సమీపంలో కృష్ణానది వరదలో చిక్కుకున్న మత్స్యకార కుటుంబాలకు చెందిన 30 మందిని పోలీసులు, గ్రామస్థులు కాపాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు ప్రాంతానికి చెందిన పది కుటుంబాలు రాంపురం సమీపంలో నది దగ్గర ఉన్న భూములను లీజుకు తీసుకొని చేపల చెరువులను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. శనివారం నీటి ప్రవాహం పెరిగినా అక్కడే ఉండిపోయారు. ఆదివారం ఉధృతి బాగా పెరగడంతో వరదలో చిక్కుకున్నామని రాంపురం సర్పంచికి సమాచారం అందించారు. ఆయన పెబ్బేరు పోలీసులకు విషయం తెలిపారు. ఎస్సై విజయ్‌కుమార్ పడవను తెప్పించి మత్స్యకారులున్న ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మహిళలు, పిల్లలతో కలిపి 30 మంది ఉండగా వారిని తరలించారు.

వరద గుప్పిట గ్రామాలు

- కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో మునిగిన పంటలు
- నీటిలోనే నారాయణపేట జిల్లాలోని వాసూనగర్ గ్రామం

ధరూరు, న్యూస్‌టుడే : కృష్ణానది ఉప్పొంగటంతో పరీవాహక ప్రాంతాలైన నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోని పలు గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. మక్తల్, కృష్ణా, మాగనూరు, ఆత్మకూరు, గద్వాల, ధరూరు, ఇటిక్యాల, అలంపూర్ మండలాల్లోని పరీవాహక గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. గద్వాల మండలం బీరోలులో నది సమీపంలోని ఇళ్లలోకి వరద చేరింది. ఇటిక్యాల మండలం బీచుపల్లి రామాలయంలోకి, మక్తల్ మండలంలోని దత్తక్షేత్రంలోకి నీరు ప్రవేశించింది. కృష్ణా మండలంలోని వాసూనగర్ పూర్తిగా నీట మునిగింది. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇదే మండలంలోని హిందూపూర్ గ్రామానికి వరద ముప్పు ఉందని గ్రహించి ముందే ప్రజలను ఖాళీ చేయించారు. గద్వాల మండలంలో కృష్ణానది మధ్య ఉన్న గుర్రంగడ్డ దీవి గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచాయి. ఈ మండలంలో నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. మక్తల్, మాగనూరు, అలంపూర్ మండలాల్లోని ముంపు ప్రాంతాలను అక్కడి ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అబ్రహాం పరిశీలించారు. గద్వాలలోని జోగులాంబ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల కలెక్టర్లు వెంకట్రావు, శశాంక వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

నీటమునిగిన నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని వాసూనగర్ గ్రామం

ఆదుకున్న జలవిద్యుత్

- గరిష్ఠ స్థాయిలో విద్యుదుత్పత్తి
- వరద అధికమై జూరాలలో ఉత్పత్తి నిలిపివేత

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ రంగాన్ని జలవిద్యుత్ ఆదుకుంది. కృష్ణా నదిలో భారీగా వరద వస్తున్నందున గరిష్ఠస్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఒకే సమయంలో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతోంది. అధికంగా ప్రవాహం వస్తున్నందున నాగార్జునసాగర్‌లో విద్యుదుత్పత్తికి సానుకూలం కాగా జూరాలలో ప్రతికూలంగా మారింది. లోయర్, అప్పర్ జూరాల విద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేశారు. ఈ రెండు కేంద్రాల్లో చెరో 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యమున్నా అధిక వరద కారణంగా ఉత్పత్తి ఆపేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం 8 లక్షల క్యూసెక్కులకు పైగా వదులుతున్నారు. ఇక్కడ లక్ష క్యూసెక్కులకు మించి ప్రవాహం వస్తే విద్యుదుత్పత్తి సాధ్యం కాదు. అధిక ప్రవాహం, విద్యుత్కేంద్రానికి సమానంగా ప్రవహించడం వల్ల విద్యుదుత్పత్తికి వీలుకాదు. తక్కువ ప్రవాహంలో ఉత్పత్తికి వీలుగా ఈ విద్యుత్కేంద్రాలను నిర్మించారు. సాగర్ గేట్లు తెరిచి నీరు కిందకు వదిలితే పులిచింతల విద్యుత్కేంద్రంలో మరో 120 మెగావాట్లు ఉత్పత్తి చేసేందుకు జెన్‌కో సిద్ధమవుతోంది.

పెరుగుతున్న డిమాండ్

రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టినందున విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఈ నెల 10న అత్యధికంగా 183 మిలియన్ యూనిట్లు(ఎంయూ) ఉంది. ఈ నెల 3న వర్షాలు పడిన సమయంలో 144 ఎంయూలు ఉండగా ఇప్పుడు 30 శాతానికి పైగా పెరిగింది. ఇందులో జల విద్యుత్ 26 ఎంయూలకు పైగా వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3,041 ఎంయూల జల విద్యుదుత్పత్తి చేయాలని జెన్‌కో లక్ష్యం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జులై వరకు 9 ఎంయూల ఉత్పత్తి మాత్రమే సాధ్యమైంది. ఈ నెలలో కృష్ణా నదికి వరద రావడం వల్ల ఆగస్టు ఒకటి నుంచి 10 వరకు 145 ఎంయూలు ఉత్పత్తి చేసింది. జల విద్యుత్ ఉత్పత్తి పెరిగినందున థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించారు. ఛత్తీస్‌గఢ్‌లో సాంకేతిక కారణాల వల్ల ఉత్పత్తి తగ్గించినందున తెలంగాణకు చాలా తక్కువగా సరఫరా చేస్తున్నారు. ఇదే సమయంలో ఇక్కడ జలవిద్యుత్ ఉత్పత్తి పెరిగినందున ఛత్తీస్‌గఢ్ నుంచి తక్కువగా వస్తున్నా ఇబ్బందులు రాకుండా సరఫరా చేయగలుగుతున్నారు. వరద ఉధృతి తగ్గితే జూరాల కేంద్రంలో మరో 400 మెగావాట్లకు పైగా విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామని జెన్‌కో సీఎండీ డి. ప్రభాకరరావు తెలిపారు.

రాష్ట్రంలో జలవిద్యుదుత్పత్తి పెరిగిన తీరు (మిలియన్ యూనిట్లు)

తేదీ	విద్యుదుత్పత్తి
ఆగస్టు 1	2.3
2	1.8
3	2.1
4	2.7
5	11.3
6	22.4
7	25.6
8	26.9
9	23.5
10	26.3

370 ఆర్టికల్ నాటి క్యాబినెట్ నిర్ణయమే

- నెహ్రూ, పటేల్ ఇద్దరూ కాంగ్రెస్ నేతలే..
- తెలంగాణ ఏర్పాటు భాజపాకు ఆమోదయోగ్యం కాదా..?
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: జమ్మూ-కశ్మీర్ పునర్విభజన బిల్లు సమయంలో ఆర్టికల్ 370 నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తప్పిదంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం నిర్హాంతపర్చిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్, జునాగఢ్ ఏకీకరణ పటేల్ చేశారని.. కశ్మీర్ మాత్రం నెహ్రూ చేశారనడం తగదన్నారు. నాటి నిర్ణయాలన్నీ ఒకే క్యాబినెట్‌లో ఆమోదించి తీసుకున్నవేనన్నారు. నాటి ప్రధాని నెహ్రూ, హోం మంత్రి సర్దార్ పటేల్ ఇద్దరూ కాంగ్రెస్ నేతలేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏఐసీసీ కార్యాలయంలో ఆదివారం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నో త్యాగాలు చేసిన నెహ్రూపై ప్రధాని మోదీ, అమిత్ షా మొదలు భాజపా నేతల వరకు తప్పుడు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని 2009, డిసెంబరు 9న నాటి కేంద్ర హోం మంత్రి ప్రకటించారని.. రాష్ట్ర విభజనకు సంబంధించి ప్రతి ఒక్కరితో చర్చించి నాలుగేళ్ల పాటు అందరి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే తెలంగాణ ఇచ్చారనే విషయాన్ని భాజపా నేతలు గుర్తించాలన్నారు. తెలంగాణ ఏర్పాటు భాజపా నేతలకు ఆమోదయోగ్యమా కాదా అనే విషయం తేల్చి చెప్పాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో రాహుల్ గాంధీ పార్టీకి నాయకత్వం వహించి కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచారని ఉత్తమ్ కొనియాడారు. సోనియాగాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణలో బలపడుతున్నాం: కుంతియా

తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయిందంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యాఖ్యానించడం సరికాదని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఆర్.సి. కుంతియా అన్నారు. తమ పార్టీ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయినా లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థానాల్లో విజయం సాధించామన్నారు. భాజపాకు నాలుగు సీట్లు వాళ్ల బలంతో వచ్చినవి కావన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతోందన్నారు. సమావేశంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శులు బోస్ రాజు, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, పార్టీ నేత మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

భాజపావి పగటికలలు: దాసోజు శ్రవణ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో తెరాసకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ తప్ప భాజపా ఎప్పటికీ కాదని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌తోపాటు ఆ పార్టీ నేతలు పగటికలలు కంటున్నారని విమర్శించారు. భాజపా వాపును చూసి బలం అనుకుంటోందన్నారు. భాజపా, తెరాసలు అంతర్గత రాజకీయాలతో కాంగ్రెస్‌ను దెబ్బతీసే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

మొలకెత్తే జెండా!

స్వాతంత్ర్య దినోత్సవం రోజున.. మూడు రంగుల ముచ్చటైన జెండాను ఎవరైనా ఎగరేస్తారు. మీరు ఇంకాస్త వినూత్నంగా మీ దేశభక్తిని చాటాలనుకుంటున్నారా... అయితే ఇది కచ్చితంగా మీ కోసమే. ఈ మొలకెత్తే జెండాను ఎగరేసి... మీ ప్రత్యేక దేశభక్తిని చాటుకునే అరుదైన అవకాశం మీకే వచ్చింది. జెండాలను ఎగరేయడం తెలుసుకానీ.. మొలకెత్తే జెండాలు ఏంటని ఆశ్చర్యపోతున్నారు కదూ. అవునండీ ఈ జెండాలు మొలకెత్తుతాయి కూడా. వీటిని ప్లాస్టిక్ లేదా మామూలు కాగితంతో కాకుండా విత్తనాలున్న ప్రత్యేక కాగితంతో తయారుచేశారు. ఎగరేసిన తర్వాత ఈ జెండాలను వృథాగా పారేయకుండా చక్కగా పాతిపెట్టేయవచ్చు. వీటిలో ఉండే విత్తనాలు రకరకాల మొక్కలుగా మొలకెత్తుతాయి. భూమిలో కలసిపోలేని ప్లాస్టిక్ జెండాలు ఎగరేసి కాలుష్యాన్ని పెంచి పోషించే కంటే వీటిని ఎగరేసి... పర్యావరణ పరిరక్షణకు మీ వంతుగా కృషిచేయవచ్చు. ఏమంటారు...

అన్నం... పప్పు... కూర... నయా ఇంధనాలు!

వంటింట్లో అన్నం, కూర, కూరగాయల ముక్కలు మిగులుతాయి...
వాటన్నిటినీ తీసుకెళ్లి బయట చెత్తబుట్టలో వేస్తాం...
దాన్ని కార్పొరేషన్ వాళ్లు ఇంకెక్కడో వేసేస్తారు...
అలా వేయాల్సిన అవసరం లేదు...
ఆ వ్యర్థాలే గ్యాస్‌గా మారి తిరిగి మీ ఇంట్లోకి వస్తుంటే...
ఎరువుగా మారి మీ పెరటిని సస్యశ్యామలం చేస్తుంటే...
భలే ఆలోచన అనిపిస్తుంది కదూ...
ఇప్పుడా ఆలోచననే ఆసక్తికరంగా అమలు చేస్తున్నారు హర్షవర్ధన్ ఎర్రా...

ఆ పాఠశాలలో ఏడాదిగా మధ్యాహ్నం పూట పిల్లలకు వండే వంట కోసం కట్టెలపొయ్యిని కానీ, గ్యాస్ సిలిండర్లని కానీ వాడడం లేదు.

మరెలా వండుతున్నారు? వృథాగా మిగిలిపోయిన అన్నం, కాయగూరల చెత్త వంటి వంటింటి వ్యర్థాలనే వాడి వంట చేయడానికి కావాల్సిన మిథేన్ గ్యాస్‌ని తయారు చేసుకుంటున్నారు. దాంతోనే వండుతున్నారు. అలా ఆ స్కూల్‌కి కొంత ఖర్చు తగ్గడమే కాదు... పిల్లలకు కట్టెల పొయ్యిల నుంచి వచ్చే పొగ పీల్చుకునే బాధ కూడా తప్పింది. అక్కడితో అయిపోలేదు. మిథేన్ గ్యాస్‌తోపాటు ఉప ఉత్పత్తిగా వచ్చిన ఆర్గానిక్ ఎరువుని మొక్కలకి వాడుకుంటున్నారు. దాంతో ఆ విద్యార్థులకి, ఆ చుట్టుపక్కల గ్రామస్థులకు స్వచ్ఛమైన పంటలు దొరుకుతున్నాయి.... ఈ స్కూల్ హైదరాబాద్‌లోని దూలపల్లి గ్రామంలో ఉంది. ఆ ఊరివాళ్లంతా తమ ఇళ్లలో మిగిలిన వంటింట్లో మిగిలిన ఆహారాన్ని, పదార్థాలను బయో మిథనైజేషన్ ప్రక్రియతో బంగారంగా మార్చుకుంటున్నారు. హైదరాబాద్‌కి చెందిన హర్షవర్ధన్ ఎర్రా ఈ ప్రక్రియను సులభతరం చేసే బయో డైజెస్టర్స్‌ని అందించడంతోపాటు స్కూళ్లు, వ్యాపార సంస్థలు, కాలేజీలకు వంటింటి వ్యర్థాల వేర్పాటు పర్యావరణ మేలుకు ఎంత అవసరమో వివరిస్తున్నారు. .

ఆ చెత్తను పడేయొద్దు...

మన ఇంట్లోంచి వచ్చిన వ్యర్థాలేవైనా శాస్త్రీయమైన పద్ధతిలో వేరు చేయకుండానే భూమిలోకి చేరతాయి. అవన్నీ కొన్ని రోజులకి కుళ్లి పర్యావరణానికి హానిచేసే మిథేన్ వంటి విషపూరిత వాయువులను విడుదల చేస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే వ్యర్థాల సమర్థ వినియోగమే శరణ్యం. పశువుల వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తి చేయడం మనం ఎన్నో ఏళ్ల నుంచి చూస్తున్నాం. అలాగే వంటింటి వ్యర్థాల నుంచి గ్యాస్, ఎరువులు పొందే మేలైన మార్గం బయో మిథనైజేషన్ ప్రక్రియ. దీన్ని అతి తక్కువ ఖర్చుతో బయో డైజెస్టర్ల సాయంతో ఏర్పాటు చేసుకోవచ్చు..

ఈ డైజెస్టర్లు ఏంటి?

మన ఇళ్లలో వాడుకునే ప్లాస్టిక్ నీళ్ల ట్యాంకులనే బయో డైజెస్టర్లుగా మార్చుకోవచ్చు. వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గొట్టాల ద్వారా పొయ్యికి అనుసంధానం చేసుకోవాలి. బయో డైజెస్టర్‌లో వంటింటి వ్యర్థాలను వేయాలి. అవన్నీ ఆక్సిజన్ రహిత వాతావరణంలో కుళ్లి, మిథేన్ వాయువుగా మారతాయి. అవి నేరుగా వంట గదిలోని పొయ్యికి గ్యాస్ రూపంలో అందుతాయి. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే పశువుల వ్యర్థాలు కూడా దొరుకుతాయి కాబట్టి ఇందుకోసం 12 అడుగుల పరిమాణంలో ఉండే సిమెంట్ నిర్మాణాలు చేపట్టొచ్చు. పిట్స్ మాదిరిగా ఉండే ఈ నిర్మాణాల్లో ఒక కేజీ ఘనపదార్థానికి.. నీటిని జోడించి నిల్వ చేయాలి. దీంట్లో నుంచి ఇంధనంతోపాటు... స్పెంట్ స్లర్రీ అనే నల్లని ద్రవరూపంలో ఉండే ఎరువు కూడా వస్తుంది. దీనిని పంటలకు, మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చు. స్కూళ్లు, కాలేజీలు, అపార్ట్‌మెంట్లు, రెస్టారెంట్లు... ఇలా ఎక్కడైనా సరే వంటింటి నుంచి వచ్చే వ్యర్థాలు రోజుకి పదికేజీల కంటే ఎక్కువ ఉంటే ఈ ఉత్పత్తులు మరింతగా వచ్చే అవకాశం ఉంది. రోజుకి కిలోకంటే తక్కువ వస్తుంటే బయో డైజెస్టర్ల కంటే కంపోస్టర్లు మంచి ఫలితాలనిస్తాయి. దీనికోసం పాత ప్లాస్టిక్ డబ్బాలు, పాత పెయింట్ డబ్బాలు సరిపోతాయి. రోజూ మనం ఐదు నిమిషాలపాటు కేటాయిస్తే చాలు 45 రోజుల్లో మనకు అవసరమైన ఎరువు తయారవుతుంది. దీంతో మనం టెర్రస్ గార్డెనింగ్ బాగా చేసుకోవచ్చు.

ఎక్కడెక్కడ?

డీఆర్‌డీవో, సీఆర్‌పీఎఫ్, ఇక్రిశాట్ వంటి సంస్థలతోపాటు.. హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రి, దూలపల్లి, పోచారం గ్రామాల్లోని జెడ్‌పీహెచ్‌స్కూళ్లు.. స్నేహ ఫామ్స్, నాగార్జున ఫామ్స్, వండర్‌లా రిసార్ట్స్, ఫిషరీ ఫామ్స్, ఫుడ్‌ప్రాసెసింగ్ సంస్థలు, దేవాలయాలు, వృద్ధాశ్రమాలతోపాటు అదిలాబాద్‌లోని రెండువేల గ్రామీణ కుటుంబాలు, తూర్పుగోదావరిలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఈ బయో డైజెస్టర్స్‌ని వాడుకుంటున్నాయి.

పీపల్ పుట్టిందిలా...

హర్షవర్ధన్ నిజాం ఇనిస్టిట్యూట్‌లో బయోటెక్నాలజీ పూర్తిచేశారు. పర్యావరణం మీద ఉండే ప్రేమతో ఫ్రాన్స్ వెళ్లి అక్కడే చెత్తను వేరుచేసే విధానాలపై లోతుగా అధ్యయనం చేశారు. 2014లో పీపల్ అనే సంస్థని ప్రారంభించారు. ఆయన వివిధ స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో బయో డైజెస్టర్లని నిర్మిస్తున్నారు. అదిలాబాద్‌లో 1000 బయో డైజెస్టర్లని నిర్మించారు. నగరాల్లో అయితే వీటి నిర్మాణానికి కావాల్సిన సాంకేతిక సాయం అందిస్తున్నారు. తయారుచేసుకోవడం ఎలాగో వర్క్‌షాపుల ద్వారా చెబుతున్నారు.

- గొర్లె శ్రీ సత్యవాణి

అంతిమ సంస్కారి!

2005... ఉస్మానియా ఆసుపత్రిలో 277 శవాలను ఏడాదిగా మార్చురీలో ఉంచారు. శవాలు గుర్తించడానికి వీలులేనంతగా కుళ్లిపోయాయి.

ఆ స్థితిలో వాటిని మనం చూడగలమా? అసలా దృశ్యం తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది కదా...

.... కానీ ఆయన ఆ మృతదేహాలను గౌరవించారు. అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు చేశారు.

2009... హైదరాబాద్‌లో ఓ మహిళకు ప్రమాదం జరిగింది. కొడుకు, కోడలు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెను ఆసుపత్రిలో వదిలేసి... కొడుకు, కోడలు ఇంటికెళ్లిపోయారు. చుట్టుపక్కల వారికి చనిపోయిందని చెప్పి కర్మకాండలు కూడా నిర్వహించారు.

– వాస్తవానికి ప్రమాదం బారిన పడిన మహిళ బతికే ఉంది.

.... ఆయన ఆమెను ఆశ్రమానికి చేర్చారు. బాగా చూసుకుంటున్నారు.

ఆయన... మనసున్నాయన. మానవత్వం ఉన్నాయన. కానుగుల రాజేశ్వరరావు అనే పేరున్నాయన. అనాథ శవాల కోసం ఓ వెబ్‌సైట్ ప్రారంభించి ఎంతో మందిని గుర్తించడానికి సహకరిస్తున్నారు. అభాగ్యుల కోసం ఆశ్రమం నిర్వహిస్తూ ఆదుకుంటున్నారు.

ఎదుటి మనిషినే గౌరవించలేని సమాజంలో అనాథ శవాలనూ సంస్కరిస్తున్న రాజేశ్వరరావుది హైదరాబాద్. ఈ మహానగరంలో పక్కవాడి గురించి ఆలోచించే వారెంతమంది? కానీ ఆయన ప్రత్యేకం. పాతికేళ్లుగా అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు చేస్తూ గొప్ప వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. ఉస్మానియా మార్చురీ విభాగంలో రాజేశ్వరరావు తండ్రి నాలుగో తరగతి ఉద్యోగి. ఆసుపత్రి వెనుక ఉన్న 'సన్ కలర్ ల్యాబ్'లో రాజేశ్వరరావు ఫొటోగ్రాఫర్. ఈయన అప్పుడప్పుడు తండ్రి పనిచేసే చోటుకి వెళ్లేవారు. అక్కడన్నీ మృతదేహాలే. వాటిని చూసీ...చూసీ మనసులో ఉన్న భయం పోయింది. పాతబస్తీలోని ఉప్పుగూడ రైల్వేస్టేషన్ దగ్గర వీళ్ల ఇల్లు. అక్కడ పట్టాలపై చనిపోయిన వారి అనాథశవాలనూ తరచూ చూసేవారు. ఫొటోలు తీసేవారు. చనిపోయిన ఆరుగంటల తర్వాత మృతదేహం డీకంపోజ్ అవుతుంది. అంతకు ముందే ఫొటో తీసి వెబ్‌సైట్లలో పెడితే సంబంధీకులు వచ్చి గుర్తుపట్టే అవకాశం ఉంటుంది. అందుకే ఈయన ఈ పని చేసేవారు.

అనాథల హరిశ్చంద్రుడు...

ఏవైనా గుర్తుతెలియని శవాల సమాచారం పోలీసుల దృష్టికి వస్తూనే తనకు చెప్పాలని కోరేవారు. అవి పాడు కాకముందే ఫొటో తీసి పోలీసులకు ఇచ్చేవారు. ఉస్మానియా మార్చురీలోనూ గోడకు ఓ కాపీ అంటించి వివరాలు కింద రాసేవారు. ఇదంతా ఉచితంగానే చేసేవారు. ఫొటోలు పోవడం, ఆల్బమ్స్ లేకపోవడంతో... ఒక వెబ్‌సైట్ ప్రారంభించి అందులో వివరాలు ఉంచితే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ఆలోచించారు. దీనికి పోలీసుల అనుమతి అవసరమని తెలిసింది. అప్పటి అదనపు పోలీసు కమిషనర్ ఏకే ఖాన్‌ను కలిసి విషయం చెప్పారు. ఆయన ప్రోత్సహించడంతో కొంతమంది సాయం తీసుకొని 'సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్' స్థాపించారు. దీనిపేరు మీదే 1999లో www.unknownbodies.org వెబ్‌సైట్ ప్రారంభించారు. గుర్తుతెలియని మృతదేహాల ఫొటోలు ఇందులో అప్‌లోడ్ చేస్తారు. సంబంధీకులు వాటిని గుర్తుపట్టి తీసుకెళ్తుంటారు.

మనిషికీ బార్‌కోడ్ అవసరం

నేను చేసే పని చాలా మంది తప్పు పట్టేవారు. అమ్మానాన్న ఏదైనా వేడుకలకు వెళ్లితే 'మీ అబ్బాయి శవాలకు ఫొటో తీస్తున్నాడంటా... ఏంటీ పనులు?' అంటూ అవహేళన చేసేవారు. నా భార్యకు ఈ పని చేయడం ఇష్టం లేదు. నా కొడుకు మాత్రం నా బాటలోనే నడుస్తున్నాడు. నా ఇంటి కిరాయి రూ.3500. కూతురు పెళ్లికి డబ్బుల్లేవు. అయినా ఎప్పుడూ ఈ పని ఆపలేదు. ఆపను కూడా... వస్తువులకు బార్‌కోడ్ ఉన్నట్లే మనిషిని గుర్తుపట్టడానికి ఏదో ఒక గుర్తు అవసరం. అది ఏర్పాటు చేసేవరకూ అనాథ శవాలు వస్తూనే ఉంటాయి. – రాజేశ్వరరావు

అంతిమసంస్కారం చేయాలని...

ఉస్మానియా ఆసుపత్రిలో శవాలు నెలల తరబడి కుళ్లిపోతున్నా పట్టించుకునేవాళ్లు లేరు. రోగులకు ఇబ్బందని.. ఆ శవాల్ని దహనం చేస్తానని రాజేశ్వరరావు ఆసుపత్రి అధికారులను అడిగారు. వారు నిబంధనలు ఒప్పుకోవన్నారు. మళ్లీ ఏకే ఖాన్‌ను కలిస్తే... ఆయన అప్పటి పోలీసు కమిషనర్ మహంతి దగ్గరికి తీసుకెళ్లారు. ఆయనకు పరిస్థితి విన్నవిస్తే... సాయం చేస్తానని చెప్పారు. తర్వాత పోలీసులు తన గురించి విచారణ చేసి... క్లీన్‌చిట్ ఇచ్చాక అనుమతిచ్చారు. తొలిరోజు 22 శవాలు అప్పగించారు. వాటిని మార్చురీ నుంచి పాతబస్తీ వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లి పురానాపూల్ స్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు. అప్పటి నుంచి ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఈ పని ఆపలేదు. ఇందుకోసం ఒక బృందాన్ని తయారు చేశారు. హైదరాబాద్ చుట్టూ 70 కిలోమీటర్ల పరిధిలో ఎవరైనా చనిపోతే వెంటనే ఆ సమాచారం ఫౌండేషన్‌కు అందుతుంది. వెంటనే బృంద సభ్యులు అక్కడికి వెళ్లి ఫొటోలు తీసి, నిబంధనల ప్రకారం వారికి అంత్యక్రియలు చేస్తారు. దహనక్రియలు చేయడానికి కొందరు కట్టెలు ఇస్తే... మరికొందరు తమకు తోచిన సాయం చేస్తారు. ఈ ఏర్పాట్లు జరిగే లోపు మృతదేహాలను కుక్కలు లాక్కెళ్లే ప్రమాదం ఉంది. అందుకే వాటిని పెట్టుకొని రాత్రింబవళ్లు శ్మశానంలోనే ఎదురుచూసిన రోజులు ఆయన అనుభవంలో ఉన్నాయి.

- రాళ్లపల్లి రాజావలి ఫొటోలు: రాజమౌళి

అనాథాశ్రమం

2015లో 25 పడకలతో అనాథాశ్రమాన్ని ప్రారంభించారు. ఉస్మానియా ఆసుపత్రిలో చాలా మందిని చికిత్స పొందుతుండగానే సంబంధీకులు వదిలేసి వెళ్తారు. వీళ్లను చేరదీస్తున్నారు. వీరికి చికిత్స చేయించి, భోజనం పెట్టి, వసతి కల్పిస్తున్నారు. దీని నిర్వహణకు నెలకు రూ.90వేలు ఖర్చవుతుంది. మృతదేహాల అంత్యక్రియలకు, ఆశ్రమాన్ని నడపడానికి ఎంతోమంది దాతలు పెద్దమనసుతో సహకరిస్తున్నారు. వీరి సేవలు గుర్తించిన ప్రభుత్వం 2017లో ఉత్తమ ఎన్జీవోగా సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్‌కు పురస్కారం అందించింది.

సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ సేవలివి

వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన అనాథ శవాల ఫొటోలు : 13000
ఇందులో గుర్తించిన వారు : 6000
దహన సంస్కారాలు చేసిన మృతదేహాలు : 12000

నలభీముల తండా!

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఈదమ్మ తండా ఓ విషయంలో చాలా ప్రత్యేకమైంది. అదేంటంటే ఆ ఊరి నిండా నలభీములే ఉన్నారు. అక్కడ ప్రతి ఇంట్లోనూ ఒక్కో వంట మాస్టర్ ఉంటారు. ఇక్కడ మొత్తం 73 కుటుంబాలుంటే ప్రతి ఇంట్లోనూ వంటలో నైపుణ్యం ఉన్న వ్యక్తి ఉంటారు. ఇరవై ఏళ్ల క్రితం ఈ తండావాసులు కూడా వ్యవసాయం, కూలి పనులు చేసుకుని బతికేవారు. వ్యవసాయం దెబ్బతినడంతో ప్రత్యామ్నాయ ఉపాధి రంగాలపై దృష్టిసారించారు. ఈ క్రమంలో తండాలో చాలామంది వంట చేయడం నేర్చుకుని ఇప్పుడు మాస్టర్లయ్యారు. ప్రస్తుతం ప్రముఖ హోటళ్లలోని కిచెన్లలో సైతం వీరు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి హైదరాబాద్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చాలా శుభకార్యాలకు వీరిని ప్రత్యేకంగా వచ్చి తీసుకెళుతుంటారు.

- ఏలేటి ప్రభాకర్‌రెడ్డి, మహబూబ్‌నగర్

వారి గ్రామదేవత గాంధీ!

శ్రీకాకుళం జిల్లా పలాస మండల కేంద్రానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉండే కేదారిపురంలో ఉండేవాళ్లంతా వ్యవసాయ కూలీలే. ఈ గ్రామంలో మహాత్మా గాంధీని పూజించే పద్ధతి పూర్వీకుల నుంచి వస్తోంది. గాంధీజీ భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించే మహాత్ముడే కాదు.. ఆయన ఒక దైవమని గ్రామ ప్రజల నమ్మకం. ఆ నమ్మకంతోనే గాంధమ్మ అని పేరుతో, గాంధీజీని గ్రామదేవతగా భావించి ఏటా ఖరీఫ్ పనులు ప్రారంభించే ముందు రోజు పూజలు చేస్తుంటారు. ఆ సమయంలో ఈ గ్రామంలో ప్రతి ఒక్కరూ రోజంతా ఉపవాసాలుండి సాయంత్రం గాంధీ చిత్ర పటాన్ని ఊరి మధ్యలో ఉంచి పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఇంటి నుంచి నైవేద్యాలు తీసుకెళ్లి నివేదిస్తారు. తర్వాత మహిళలంతా పుసుపు నీళ్ల బిందెలతో తిరువీధి నిర్వహించి గ్రామ శివారునున్న చెట్టు వద్దకు వెళ్లి చల్లదనం చేస్తారు. ఇది తరాల నుంచి వస్తున్న సంప్రదాయమని, కొనసాగిస్తున్నామని ఆ ఊరి ప్రజలు చెబుతారు.

...ఇక్కడ జరిగే పూజల్లో ఇప్పటివరకు రెండే మహాత్మా గాంధీ చిత్ర పటాలను వాడుతున్నారు. వాటికే పూజలు చేస్తున్నారు. గతంలో ఉండే పటం పాడవడంలో మరో పటం ఏర్పాటు చేసుకున్నారు. పటాన్ని గ్రామానికి చెందిన పాడి ధర్మారావు ఇంటిలో భద్రపరుస్తారు. పూజల రోజున బయటకు తీస్తారు. మరో వైపు గాంధమ్మ ఉత్సవం చేయడానికి బి.లక్ష్మిదేవి అనే మహిళను పూజారి(దాసురాలు)గా నియమించారు. ఆమె ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమం అంతా జరుగుతుంది. ఎప్పుడైనా ఆటంకాలు ఎదురైతే గ్రామంలో ప్రజలు ముడుపులు కట్టి, తర్వాత ఏడాది నిర్వహించే ఉత్సవంలో మొక్కులు తీర్చుకుంటారు. అంతే కాదు...ఇక్కడ చాలామంది పిల్లల పేర్లు కూడా గాంధీ అనే ఉంటాయి.

- సూరకాసుల వెంకటరమణ, కాశీబుగ్గ

ఏ ఊళ్లో అయినా గ్రామ దేవత పోచమ్మ, ఎల్లమ్మ, మావుళ్లమ్మ
ఈ ఊళ్లో మాత్రం గాంధమ్మ...
ఎవరీమె అంటే... సాక్షాత్తు మన జాతిపితే..
మహాత్ముడిని అమ్మవారిగా కొలిచే విచిత్ర సంప్రదాయం ఉందా గ్రామంలో...

ఈనాడు సినిమా

చిరంజీవి మాటలతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి!

- ప్రభాస్

శ్రద్ధాకపూర్, ప్రభాస్

"జేమ్స్ బాండ్ సినిమాల స్ఫూర్తితో 'సాహో' చేయలేదు. మన తెరపై ఇప్పటివరకు చూడని సన్నివేశాల్ని ఇందులో చూపించడానికి ప్రయత్నించాం'' అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సాహో'. శ్రద్ధాకపూర్ నాయిక. సుజీత్ దర్శకత్వం వహించారు. చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. శనివారం ముంబయిలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో సమావేశమైంది. ప్రభాస్, శ్రద్ధాకపూర్ చిత్రం గురించి పలు విషయాల్ని వెల్లడించారు.

'సాహో'ని భారీ స్థాయిలో తీయాలనే ఆలోచనకి ఎప్పుడు బీజం పడింది?

సుజీత్ మాకు 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలకి ముందే ఈ కథ చెప్పాడు. 'బాహుబలి' కథ మాకు ఎప్పట్నుంచో తెలుసు కాబట్టి, దాని స్థాయి ఎలా ఉంటుందో ఊహించాం. అయితే ఇంత స్పందన వస్తుందని మాత్రం తెలియదు. 'బాహుబలి'ని ప్రేక్షకులు ఎక్కడెక్కడ స్వీకరిస్తారో అక్కడ 'సాహో'ని విడుదల చేయాలని మా నిర్మాతలు వంశీ, విక్కీ, ప్రమోద్ అప్పుడే నిర్ణయించారు. 'బాహుబలి' విడుదలైన తర్వాత 'సాహో' లుక్, స్థాయి మరింత పెద్దగా ఉండాలనే నిర్ణయాని కొచ్చాం.

సుజీత్‌పైన 'బాహుబలి' ప్రభావం ఉందా? మా అందరిపైనా 'బాహుబలి' ప్రభావం ఉంటుంది. 'బాహుబలి' కంటే పెద్ద కథ కాదు కానీ.. ఇది స్క్రీన్‌ప్లే ప్రధానమైన సినిమా. సుజీత్ వయసుతో పోలిస్తే, తను ఈ సినిమాని చేసిన విధానం చూసి ఆశ్చర్యం వేసింది. మన దేశంలోని గొప్ప సాంకేతిక నిపుణులతో పాటు హాలీవుడ్, చైనా నిపుణులు కూడా ఈ సినిమాకి పనిచేశారు. సెట్‌లో మేము ఒత్తిడికి గురయ్యాం కానీ...సుజీత్ అలా కనిపించలేదు.

సుజీత్ ఈ స్థాయిలో సినిమా తీయగలడనే విశ్వాసం మీకు ఎప్పుడు కలిగింది?

తొలి రోజే క్లిష్టతరమైన సన్నివేశాన్ని మొదలుపెట్టాం. ఆ సన్నివేశంలో ఐదు కోణాలుంటాయి. సినిమాలో ఆ సీన్ ఐదారుసార్లు వస్తుంది. దాన్ని రీషూట్ చేయకుండా, చిన్న మార్పు లేకుండా తీసిన విధానం చూసి సుజీత్‌పై నమ్మకం కుదిరింది.

ట్రైలర్‌లో సిక్సర్ గురించి సంభాషణ చెప్పారు. ఎప్పుడైనా సిక్సర్ కొట్టారా?

బ్యాటింగ్‌కి దిగితే లాగికొట్టడమే తెలుసు నాకు. అది తగిలిందంటే సిక్సరే (నవ్వుతూ). 'సాహో' ట్రైలర్ చూసి చిరంజీవి సందేశం పంపించారు. నేను ఫోన్ చేసి మాట్లాడాను. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. రాజమౌళికీ ట్రైలర్ నచ్చింది. ట్రైలర్ కోసం 137 సన్నివేశాలు కట్ చేశారు సుజీత్, సహాయదర్శకుడు నిఖిల్.

రెండేళ్ల ప్రయాణంలో ఎన్నో జ్ఞాపకాలు - శ్రద్ధాకపూర్

"తెలుగులో ఇంతకంటే గొప్ప పరిచయ చిత్రాన్ని నేను కోరుకోను. ప్రభాస్‌తో సినిమా, అదీ బహుభాషా చిత్రం కావడం, కథ, నా పాత్ర.. ఇలా అన్నీ నన్ను ఆకట్టుకున్నవే. ఇది కొత్త పరిశ్రమ అని ఎప్పుడూ అనిపించలేదు. ఈ రెండేళ్ల ప్రయాణంలో గుర్తుండిపోయే జ్ఞాపకాలెన్నో. తొలిసారి గన్ పట్టాను. పోలీసు పాత్ర చేశాను కాబట్టి, ఆ పాత్రపైన ఉన్న గౌరవం, ఈ సినిమా ప్రయాణంలో ఏర్పడిన ఆత్మవిశ్వాసంతో యాక్షన్ ఘట్టాలు చేయడం అలవాటైంది. ప్రభాస్‌తో కలిసి నటించడం మంచి అనుభవం"

"పాన్ ఇండియా సినిమా ఇది. 'సాహో' కోసమే కొన్ని థియేటర్లు అప్‌డేట్ అవుతున్నాయి. దృశ్యం, శబ్దం పరంగా కొత్త సాంకేతికతతో ముస్తాబవుతున్నాయి. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం". - 'సాహో' నిర్మాతలు ప్రమోద్, విక్కీ

హిందీలో మీరే డబ్బింగ్ చెప్పారు. ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?

నాకు హిందీ చదవడం, రాయడం వచ్చు. ఇంట్లో మాట్లాడను కానీ, హైదరాబాద్ స్నేహితులు కలిసినప్పుడు మాట్లాడుతుంటా. సినిమాలో యూపీ హిందీనే వినిపిస్తుంటుంది. కొన్ని అక్షరాలు పలకడం కొంచెం కష్టమైంది. కానీ మేనేజ్ చేశా.

బాలీవుడ్‌లో ఖాన్ త్రయానికి గట్టి పోటీనిస్తున్నారు. అక్కడ 'సాహో'పై ఎలాంటి అంచనాలున్నాయి?

ఖాన్ త్రయం చేసిన సినిమాలు దేశవ్యాప్తంగా స్ఫూర్తి నిచ్చాయి. వాళ్లతో మనం పోటీ అనుకోకూడదు. అయితే 'బాహుబలి'ని బాలీవుడ్‌లో అందరూ బాగా స్వీకరించారు. 'బాహుబలి: ది బిగినింగ్' తర్వాత రణ్‌బీర్ కపూర్‌తో పాటు అగ్ర కథానాయకులు చాలామంది సందేశాలు పంపించారు. అక్కడి మీడియా కూడా బాగా స్వీకరించింది. ఆ విషయంలో వాళ్లకి కృతజ్ఞతలు.

యాక్షన్ కథల్లో 'సాహో' ప్రత్యేకత ఏంటి?

కొత్త రకమైన యాక్షన్‌ని ప్రయత్నించాం. ట్రైలర్‌లో ట్రక్ కనిపించే సన్నివేశంలో...ట్రక్ నిజంగానే అంత వేగంతో వస్తుంటుంది. దాన్ని నడపడం కోసం విదేశాల నుంచి నిపుణుల్ని పిలిపించాం. సాంకేతిక బృందం వందల స్టోరీ బోర్డులు తయారు చేసుకొని, ఆరేడు నెలలు సన్నద్ధమయ్యాకే కొన్ని సన్నివేశాల్ని తెరకెక్కించాం. గన్ ఫైట్లు, ఛేజింగ్‌లు కొత్తగా ఉంటాయి.

శ్రద్ధాకపూర్ నటనపై మీ అభిప్రాయం?

తను తొలి రోజు నుంచే తెలుగు మాట్లాడటం నేర్చుకుంది. శ్రద్ధ ఇందులో గన్ పట్టి యాక్షన్ చేయడంతో ఈ సినిమా గురించి బాలీవుడ్ వర్గాలు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. శ్రద్ధ కనిపించిన విధానంలో గాఢత, ఆమె ఆహార్యం గొప్పగా అనిపించాయి.

శర్వానంద్‌లో నాకు నచ్చింది అదే


శర్వానంద్, రామ్‌చరణ్

"గాఢతతో కూడిన కథలో శర్వానంద్ నటిస్తే బాగుంటుంది. అతని చిత్రాల్లో 'కో అంటే కోటి' నాకు చాలా ఇష్టం. తనని తెరపై ఎలా చూడాలనుకొంటామో, అలాంటి చిత్రమే చేశాడు'' అన్నారు రామ్‌చరణ్. ఆయన 'రణరంగం' సౌండ్ కట్ ట్రైలర్‌ని విడుదల చేశారు. శర్వానంద్ కథానాయకుడిగా, సుధీర్‌వర్మ తెరకెక్కించిన చిత్రం 'రణరంగం'. కాజల్, కల్యాణి ప్రియదర్శన్ కథానాయికలు. సూర్యదేవర నాగవంశీ నిర్మాత. ఆగస్టు 15న విడుదలవుతోంది. రామ్‌చరణ్ మాట్లాడుతూ "శర్వానంద్‌లో నాకు నచ్చింది గాఢత. 'రణరంగం' కథ, పాత్రల్లోనూ అది కనిపిస్తోంది. సుధీర్‌వర్మ మంచి నేపథ్యాన్ని ఎంచుకొన్నారు. ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నా'' అన్నారు.

అనుపమ పరమేశ్వరన్

ఇప్పుడు ఆ కలే కంటున్నా

"తెరపై కనిపిస్తాను కాబట్టి సహజంగా నన్నంతా నటిగానే చూస్తుంటారు. కానీ నటన కాకుండా, ఇంకా చాలా కలలే కంటుంటా. వాటిని సాకారం చేసుకొనేందుకు కసరత్తులు కూడా చేస్తుంటా" అంటోంది అనుపమ పరమేశ్వరన్. ఆమె దక్షిణాదిలోని నాలుగు భాషల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక. ఇటీవల 'రాక్షసుడు'తో విజయాన్ని అందుకొంది. "నటి కంటే ముందు, నేనొక నవతరం అమ్మాయిని. ఒక పనికో, ఒక వ్యాపకానికో పరిమితం కావడం మాకు ఇష్టం ఉండదు కదా" అంటోంది అనుపమ. "ఒకే సమయంలో రెండు మూడు పనులు చేయడం ఇష్టం. చిన్ననాటి నుంచీ నాది అదే తీరు. చదువుకుంటూనే సినిమాల్లో నటించా. కానీ ఎప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదు. నటిగా కొనసాగుతున్నా ఇంకా చాలా విషయాలపైకి మనసు మళ్లుతుంటుంది. సెట్‌లో ఉన్నప్పుడు కూడా ఒక చోట కుదురుగా ఉండను. కెమెరా వెనకాల ఏం జరుగుతోంది, ఏ పని కోసం ఎవరెలా కష్టపడుతున్నారో తెలుసుకుంటుంటా. ప్రస్తుతానికి నేను తరచూ కనే కల దర్శకత్వం గురించే. మిగిలిన కలలు గురించి తర్వాత చెబుతా'' అని చెప్పింది అనుపమ.

సంగీతం లేనిదే నేను లేను

- చిరంజీవి


ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న చిరంజీవి

"ఎంతోమంది సంగీత దర్శకులు, గాయకుల ద్వారానే నేను ప్రేక్షకులకు దగ్గరయ్యా. సంగీతమంటే నాకు ప్రాణం. సంగీతం లేనిదే నేను లేను'' అన్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. ఆయన ఇటీవల సినీ మ్యూజిషియన్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన స్వరసంగమం సంగీత విభావరికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ సంగీత వాయిద్య కళాకారుల ఆర్థిక, ఆరోగ్య సంక్షేమం కోసం నిధుల సేకరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమం ఇది. చిరంజీవి మాట్లాడుతూ "ఒకప్పుడు మద్రాసులోని స్టూడియోల్లోని రికార్డింగు హాళ్లలో లైవ్ ఆర్కెస్ట్రాతో పాటలు రికార్డింగ్ చేస్తుంటే అక్కడ వాతావరణం పండగలా ఉండేది. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక చిన్న గదుల్లోనే డిజిటల్ ఎఫెక్టులతో సంగీతాన్ని సృష్టిస్తున్నాం. దీంతో ఎంతోమంది వాయిద్య కళాకారులు జీవనోపాధి కోల్పోయారు. ఆధునిక పరిజ్ఞానానికి సంతోషించాలో, బాధపడాలో అర్థం కావడం లేదు. కష్టాల్లో ఉన్న వాయిద్య కళాకారులను పరిశ్రమ తరపున ఆదుకోవల్సిన బాధ్యత ఉంది. అందుకు నా వంతుగా నేను సాయమందిస్తా'' అన్నారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ "మేం ఎంత పాడినా మా పాటలోని అనుభూతిని గ్రహించి తెరపైన అభినయించినప్పుడే వాటికి సార్థకత. అలా నా పాటలకి అత్యద్భుతంగా అభినయించి, తెరపై ప్రాణం పోసిన నటుడు చిరంజీవి. అభిమానుల ఆనందం కోసం తనలోని అభినయ నైపుణ్య కోణాన్ని పక్కనపెట్టి కొన్ని పాత్రలు చేయాల్సి వచ్చింది. 'సైరా నరసింహారెడ్డి'తో తనలోని అభినయ కోణాన్ని మరోసారి చూపెట్టబోతున్నార''న్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకులు కోటి, కీరవాణి, మణిశర్మ, దేవిశ్రీప్రసాద్, ఆర్పీ పట్నాయక్, అనూప్‌రూబెన్స్, రాధాకృష్ణన్, కల్యాణిమాలిక్, శ్రీలేఖ, రఘుకుంచె తదితరులు గీతాల్ని ఆలపించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ, రేణుదేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలతోనే ఇంత దూరం వచ్చా

- నాగార్జున

పి.కిరణ్, నాగార్జున, రాహుల్ రవీంద్రన్

"కొత్తదనం కోసం ప్రయత్నిస్తూనే సినీ ప్రయాణం చేస్తున్నా. ఆ విషయంలో మా నాన్నే నాకు స్ఫూర్తి. ఆయన అప్పట్లోనే కొత్తతరం సినిమాలు చేశార''న్నారు అక్కినేని నాగార్జున. ఆయన కథానాయకుడిగా నటించి, పి.కిరణ్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'మన్మథుడు 2'. రకుల్‌ప్రీత్ సింగ్ కథానాయిక. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి వస్తున్న ఆదరణపై ఆనందం వ్యక్తం చేస్తూ ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ "యువతరం ఆలోచనలు ఎలా ఉన్నాయో ఆలోచించి సినిమాలు చేస్తుంటా. ఆ లక్షణం నాన్న నుంచే నాకు వచ్చింది. ఏదైనా కొత్తగా చేయాలనే ఆలోచనతోనే అప్పట్లో 'గీతాంజలి' చేశా. ప్రేక్షకులు దాన్ని స్వీకరించడానికి సమయం పట్టింది. 'అన్నమయ్య' చిత్రాన్ని తొమ్మిదో రోజు థియేటర్ల నుంచి తీసేయడానికి సిద్ధమయ్యారు. కానీ 11వ రోజు నుంచి థియేటర్లు నిండిపోయాయి. 'మన్మథుడు' విడుదల తర్వాత కూడా దర్శకుడు విజయ్ భాస్కర్ ఆందోళన చెందుతుంటే.. 'కొత్త కథతో తీసిన సినిమా కాబట్టి ప్రేక్షకులకి చేరువ కావడానికి కాస్త సమయం పడుతుంద'ని చెప్పా. 'మన్మథుడు 2'ని నాలో కొత్తదనం చూసుకొనేందుకే చేశా. ఇలాంటి ప్రయోగాలు చేయడంతోనే ఇంతదూరం వచ్చా. ఈ చిత్రంతో కథానాయకుడిగానూ, నిర్మాతగానూ సంతృప్తిగా ఉన్నాన''న్నారు. జాతీయ పురస్కారాలపై నాగార్జున స్పందిస్తూ 'ఈ ఏడాది తెలుగు సినిమాలకు ఏడు పురస్కారాలొచ్చాయి. 'చి.ల.సౌ' నిర్మాణంలో నేను భాగస్వామిని కాబట్టి ఆ చిత్రానికీ పురస్కారం రావడం సంతోషంగా ఉంది" అన్నారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ "సింగిల్ స్క్రీన్ థియేటర్లకి వెళితే అక్కడ ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్న విధానం చూసి ఆనందం కలిగింది" అన్నారు. ఈ కార్యక్రమంలో వైతన్ భరద్వాజ్, పి.కిరణ్, కిట్టు విస్సాప్రగడ, ఛోటా కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాంటి విజయం కోసమే ఎదురుచూశా

అమలాపాల్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రమేష్ వర్మ, కోనేరు సత్యనారాయణ

"వాణిజ్య విజయంతో పాటు విశ్లేషకుల ప్రశంసలు కూడా మా 'రాక్షసుడు'కి లభించాయి. ఇలాంటి విజయం కోసమే ఎప్పట్నుంచో ఎదురు చూశాను" అన్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. అనుపమ పరమేశ్వరన్ నాయిక. రమేష్ వర్మ దర్శకుడు. కోనేరు సత్యనారాయణ నిర్మాత. ఆగస్టు 2న ప్రేక్షకుల ముందు కొచ్చిందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది. నిర్మాత మాట్లాడుతూ "రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 'రాక్షసుడు' పేరే వినిపిస్తోంది. చూసిన ప్రతి ఒక్కరూ సినిమా బాగుందని, థ్రిల్‌కి గురయ్యామని చెబుతున్నారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులంతా ఈ సినిమాకి కనెక్ట్ అయ్యామని చెబుతున్నార''న్నారు. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ "అందరూ మనసు పెట్టి పని చేశారు. అందుకే ఈ విజయం దక్కింది" అన్నారు. మారుతి మాట్లాడుతూ "ఒక రీమేక్ సినిమాని ఎలా చేయాలో అలాగే తెరకెక్కించారు. సాయిశ్రీనివాస్ నిజాయతీగా నటించార''న్నారు. అమలాపాల్ మాట్లాడుతూ "ఇలాంటి సినిమాని రీమేక్ చేయాలంటే ధైర్యం ఉండాలి. రమేష్ వర్మ బాగా తీశారు. సాయి శ్రీనివాస్ పాత్రకి తగ్గట్టు నటించాడు" అన్నారు. "తమిళంలో ఈ సినిమా చూస్తున్నప్పుడు నాకు సాయిశ్రీనివాసే కనిపించారు. నా ఆలోచనలకి తగ్గట్టుగానే ఆయన పాత్రలో ఒదిగిపోయార''న్నారు దర్శకుడు. కార్యక్రమంలో అభిషేక్ నామా, భరత్ చౌదరి, శరవణన్, వినోద్ సాగర్, వినోదిని, అభిరామి, మల్టీ డైమన్షన్ వాసు, వెంకట్ సి.దిలీప్, అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిలీప్ రాజా, ప్రవీణ, ఛార్మి, అలీ, యాజమాన్య, పూరి జగన్నాథ్, బోయపాటి శ్రీను

అలీ నిజమైన హీరో

"అలీ 52 సినిమాల హీరో మాత్రమే కాదు. తన మనుషుల కోసం నిలబడే నిజమైన హీరో" అన్నారు దర్శకుడు పూరి జగన్నాథ్. హైదరాబాద్‌లో జరిగిన 'పండుగాడి ఫోటో స్టూడియో' పాటల విడుదల వేడుకకి ఆయన హాజరయ్యారు. అలీ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. దిలీప్ రాజా దర్శకుడు. గుదిబండి వెంకట సాంబిరెడ్డి నిర్మాత. ఎస్వీ కృష్ణారెడ్డి, కె.అచ్చిరెడ్డి ట్రైలర్‌ని విడుదల చేశారు. బోయపాటి శ్రీనుతో కలిసి పూరి జగన్నాథ్ పాటల సీడీల్ని ఆవిష్కరించారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "కష్టం వచ్చినా సంతోషం వచ్చినా చెప్పకుండా వచ్చి నన్ను కలిసే ఒకే ఒక వ్యక్తి అలీ. 'పండుగాడి...' ట్రైలర్ బాగుంది, సినిమా విజయవంతం అవుతుంద"ని ఆకాంక్షించారు. అలీ మాట్లాడుతూ "కథ, పాటలు నచ్చి ఈ సినిమా చేశా. అనుకొన్న బడ్జెట్‌లోనే పూర్తయింది" అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, అల్లరి నరేష్, వి.కె.నరేష్, బాబూ మోహన్, శ్రీకాంత్, ఛార్మి, యాజమాన్య, ప్రవీణ, అనిల్ కడియాల తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

మనం నిత్యం వాడే వస్తువులపై పేరుకుపోయే బ్యాక్టీరియాతో అనారోగ్యాల బారిన పడొచ్చు. కొన్నిసార్లు ఇవి సంక్రమిత వ్యాధులను వ్యాపింపజేసే అవకాశం ఉంది. ఇటువంటి వాటిపై కనీస అవగాహన పెంచుకోవడం అవసరం.

క్రిములను వ్యాపింపజేసే సామగ్రి

- మన శరీరంపై ఉండే బ్యాక్టీరియాతో ఎలాంటి ముప్పు ఉండదు. కానీ మనం వాడే ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర గ్యాడ్జెట్లను వేరెవరికైనా ఇచ్చినప్పుడు వారి ఒంటి మీద ఉండే బ్యాక్టీరియా వీటి ద్వారా వ్యాపించొచ్చు. ఇది వ్యాధులకు కారణమయ్యే అవకాశం ఉంది. తరచుగా వాటిని యాంటీ బ్యాక్టీరియల్ లిక్విడ్‌లో ముంచిన వస్త్రంతో శుభ్రం చేసుకుంటే ఎలాంటి సమస్యలూ ఎదురుకావు.
- మనీ పర్సులు, బ్యాక్‌ప్యాక్స్, కూరగాయలు, సామాన్లు తీసుకెళ్లే సంచులను ఎప్పుడో గానీ శుభ్రం చేయం. వీటిని నిత్యం వెంట తీసుకెళ్తూ ఎక్కడ పడితే అక్కడ ఉంచుతాం. దీంతో ఇవి క్రిములకు ఆవాసాలుగా మారతాయి. నెలలో రెండుసార్లయినా వీటిని శుభ్రపరచుకోవాలి. వర్షాలకు తడిస్తే ఉతికి ఆరబెట్టిన తరువాతే వాటిని వాడాలి.
- కారు సీట్లు... ప్రమాదకరమైన ఫెకల్ అనే బ్యాక్టీరియాకు ఆవాసాలు. వీటితో చిన్న పిల్లలకు ముప్పు

ఉంటుంది. ఇది పిల్లల శరీరంలోకి ప్రవేశించి దీర్ఘకాలిక వ్యాధులకు కారణం కావచ్చు. కారు సీట్లను వారానికోసారైనా శుభ్రం చేయాలి.

- పరిశుభ్రంగా లేని కాంటాక్ట్ లెన్స్ వాడితే కంటికి ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. వాటిని వాడే ముందు, వాడిన తరువాత శుభ్రం చేసుకోవాలి. కార్నియాకు లెన్స్ పెట్టుకునే ముందు చేతులను సబ్బుతో కడగాలి.
- పెంపుడు జంతువులను, వాటికి సంబంధించిన వస్తువులను తాకిన తరువాత చేతులను సబ్బుతో కడగడం మర్చిపోవద్దు. వీటి శరీరంపై ఉండే బ్యాక్టీరియా అనేక రకాల వ్యాధులను కలుగజేస్తుంది. చిన్న పిల్లలను వీటికి దూరంగా ఉంచడం మంచిది.
- బూట్లు, సాక్సులను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే ప్రమాదకర ఈ-కోలి బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఉంది. సాక్సులను తడిగా ఉన్నప్పుడు వాడితే ఫంగస్ వ్యాపించొచ్చు. నిత్యం వాడే సూట్‌కేసులను వారానికోసారైనా పొడివస్త్రంతో శుభ్రం చేయాలి.

***



✔ మీ బాబు చిన్నప్పటి నుంచి ప్రతి పనీ ఎడమ చేత్తోనే చేస్తున్నాడని రాశారు. దీన్ని బట్టి అతడి మెదడులోని కుడిభాగం ప్రభావవంతంగా పనిచేస్తోందని అర్థం. సాధారణంగా అందరికీ మెదడులోని ఎడమభాగం పనితీరు ఇలా ఉంటుంది. దాంతో వారంతా కుడిచేతిని ఉపయోగిస్తారు. ఇదంతా సహజంగానే జరిగింది. ఇప్పుడు మీరు పిల్లాడితో బలవంతాన దాన్ని మాన్పించే ప్రయత్నం చేయొద్దు. కావాలనుకుంటే కుడిచేతిని కొన్ని పనులకు వాడేలా చూడండి. మీరు ఒత్తిడి చేస్తే బాబు గందరగోళానికి గురవుతాడు. అతడిలో ఆందోళనా పెరుగుతుంది. ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకు మారుతూ ఉండటం వల్ల చేసే పనిపై దృష్టి పెట్టలేకపోవచ్చు. ఈ కారణాలన్నింటితో విసిగిపోయి మీరు చెప్పేది వినడు సరికదా! ఇతర పనుల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాడు. తన సహజ తత్వాన్ని కొనసాగిస్తూనే, కుడిచేతినీ ఉపయోగించేలా ప్రోత్సహించండి. అప్పుడే అతడు అన్నింట్లోనూ రాణించగలుగుతాడు.

డియర్ వసుంధర

డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

ముప్పైలు రాకముందే... ముడతలా?

ముఖంపై చిన్న మొటిమని చూసి భయపడిపోయే రోజులివి... పాతికల్లోనే పలకరించే గీతలు, ముడతల్ని చూస్తే అమ్మాయిలకు ముచ్చెమటలు పడుతున్నాయి. వయసు పెరుగుతోంది అని చెప్పడానికి సూచికలైన వీటిని కొన్నాళ్లైనా వాయిదా వేయలేమా? అసలు ఈ సమస్యలకి కారణాలేంటి? పరిష్కారాలేంటి...

వయసు పెరిగేకొద్దీ చర్మం సాగేగుణం కోల్పోయి, ముడతలు, గీతలు ఏర్పడటం సాధారణ విషయమే. మారిన జీవనశైలి కారణంగా కొంతమందిలో ముందుగానే ఈ వృద్ధాప్య ఛాయలు రావొచ్చు. చర్మం ఉపరితలంపై ఏర్పడే సన్నటి గీతలు ముఖ కండరాల కదలికలు ఏర్పడినప్పుడు కనిపిస్తాయి. కళ్లు, నోటి పక్కన, కనుబొమల మధ్యలో, నవ్వినప్పుడు పెదాల అంచుల్లో, బుగ్గలపై వీటిని గుర్తించవచ్చు. భవిష్యత్తులో ముడతలు వచ్చే అవకాశం ఉందనడానికి ఇవి సంకేతాలు.

ఎందుకిలా...

చర్మ ఆరోగ్యానికి దోహదం చేసే కొలాజిన్, ఎలాస్టిన్‌లు విచ్ఛిన్నమైతే చర్మం వదులుగా మారి సాగినట్లు కనిపిస్తుంది. కొలాజిన్ చర్మం కింది భాగంలోని కణాలను పట్టి ఉంచుతుంది. ఎలాస్టిన్ చర్మానికి సాగే గుణాన్ని ఇస్తుంది. వీటిని కోల్పోయినప్పుడు లేదా వాటి పనితీరు మందగించినప్పుడు, కండరాల కదలికల్లో చురుకుదనం తగ్గి గీతలు, ముడతలు కనిపిస్తాయి. ఇంకొన్నిసార్లు కణజాలం పనితీరులోని లోపాల వల్ల ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. వీటితో పాటు మరికొన్ని ఇతర కారణాల వల్లా చర్మంపై ముడతలు, గీతలు రావొచ్చు. వాటిల్లో పోషకాల లేమి ప్రధానమైనది. జంక్‌ఫుడ్, శీతలపానీయాల్ని తరచూ తీసుకోవడం వల్ల చర్మంపై సన్నటి గీతలు కనిపిస్తాయి. ఎక్కువగా ఎండలో తిరిగితే ఈ సమస్య ముందే పలకరిస్తుంది. పొడి చర్మతత్వం ఉన్నవారిలో ఈ తీవ్రత కాస్త అధికంగా ఉంటుంది. అందంగా కనిపించాలనే తాపత్రయంతో తరచూ బ్లీచింగ్ చేయించుకోవడం, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కాస్మెటిక్ ఉత్పత్తులను ఎక్కువగా వాడటం, మేకప్‌ని తొలగించకుండానే నిద్రపోవడం వంటి పనుల వల్ల చర్మంపై ముడతలు త్వరగా వస్తాయి. వీటితో పాటు ఒత్తిడికి లోనుకావడం, తరచూ ముఖం, నొసలు, కళ్లు చిట్లించడం, మూతి తిప్పుకోవడం...తరచూ చేసే కొన్నిరకాల ముఖ కవళికల వల్ల ఈ సమస్య కనిపించొచ్చు. కొందరిలో వంశపారంపర్యంగానూ ఇలా ముడతలు రావొచ్చు. వీటిని నివారించాలంటే...

పోషకాలు తప్పనిసరి...

ముఖంపై ముడతలు, గీతలు...ముందే రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. వయసు పెరుగుతోన్నా అవి కనిపించకుండా కొన్నాళ్లు వాయిదా వేయొచ్చు. చర్మంపై సన్నటి గీతలు కనిపించినప్పుడే తగిన నివారణా చర్యలు తీసుకోవాలి. లేదంటే అవి ముడతలుగా మారి, చర్మాన్ని నిర్జీవంగా కనిపించేలా చేస్తాయి. వృద్ధాప్య ఛాయలు ముందే వచ్చి ఇబ్బందిపెడతాయి.

- మేకప్ వేసుకున్నా, సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నా.... ముందు తప్పనిసరిగా మాయిశ్చరైజర్‌ని వాడాలి. ఇది చర్మం తేమను కోల్పోకుండా కాపాడుతుంది. ఇతర హానికారక రసాయనాలేవీ చర్మంపై ప్రభావం చూపించకుండా అడ్డుకుంటుంది. సన్‌స్క్రీన్‌లోషన్ ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లినా రోజులో కనీసం మూడుసార్లైనా చర్మానికి రాసుకోవడం మంచిది. దీనిలో ఉండే జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్ వంటివి అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని సంరక్షిస్తాయి. ఇవి రెండూ ముడతల్ని రానివ్వవు.
- కొలాజిన్‌ని ఉత్పత్తి చేసే ఒమేగా 3ఫ్యాటీ యాసిడ్లు, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచే ప్రొటీన్, విటమిన్ల వంటి పోషకాలు శరీరానికి అందేలా చూసుకోవాలి. ఇవి కీలకంగా లభించే కూరగాయలు, పండ్లు, నట్స్, పప్పుధాన్యాలు, చేపలతో కూడిన సమతులాహారాన్ని రోజు తినే ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లోని పోషకాలు శరీరాన్ని తాజాగా, ఆరోగ్యంగా కనిపించేలా చేస్తాయి. చర్మం డీహైడ్రేషన్‌కి లోనుకాకుండా, తేమను కోల్పోకుండా ఉండటానికి తగినన్ని నీళ్లు తాగాలి.
- రోజులో కనీసం నలభై నిమిషాలైనా శరీరానికి శ్రమ ఉండేలా చూసుకోండి. ఒత్తిడిని తగ్గించుకునేందుకు చేసే యోగా, ధ్యానం చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వైద్య చికిత్సలు ఉన్నాయి...

సమస్య తీవ్రంగా ఉంటే శస్త్రచికిత్సల ద్వారా వీటిని నిరోధించవచ్చు. ఫేస్‌లిఫ్ట్, బొటాక్స్, ఫిల్లర్స్, మైక్రోనీడిలింగ్, లేజర్ వంటి వైద్య విధానాల ద్వారా ముడతల్ని తగ్గించే ప్రయత్నం చేయొచ్చు. వీటిని ఏడాదికొకసారి చేయించుకుంటే వయసు పెరిగినా కొంతకాలం ముడతలు రాకుండా అడ్డుకోవచ్చు. వైద్యుల సలహాతో యాంటీఏజింగ్ క్రీములు, హైడ్రోనాయిడ్, ఆల్ఫా హైడ్రాక్సీ, టాపికల్ రెటినాయిడ్లతో కూడిన క్రీములను వాడాల్సి ఉంటుంది.

- ఆల్ఫా లేదా బీటా హైడ్రాక్సీ యాసిడ్ పీల్స్‌ను వాడి చర్మం పైపొరను తొలగించవచ్చు. సమస్య ఎక్కువగా ఉంటే గాఢత ఎక్కువగా ఉండే గ్లైకాలిక్ యాసిడ్, ట్రైక్లోరో ఎసిటిక్ యాసిడ్‌లను వైద్యులు సూచిస్తారు.

సహజ చిట్కాలు

ముడతలను నివారించడానికి ఉన్న మార్గాలు అందరికీ సరిపడకపోవచ్చు. ఖరీదుతో కూడుకున్న చికిత్సలను చేయించుకోలేకపోవచ్చు. ఇలాంటివారు అందుబాటులో ఉండే కొన్ని వంటింటి పదార్థాలను ఉపయోగించి వాటిని తగ్గించుకోవచ్చు. అవేంటంటే...!

❖ కొబ్బరి నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లకు.. వృద్ధాప్య ఛాయలకు కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను నిరోధించే గుణం ఉంటుంది. ఇది చర్మానికి తేమను అందిచడంతో పాటు మృదువుగానూ చేస్తుంది. రోజూ పడుకునే ముందు కొబ్బరినూనెతో ముఖాన్ని మర్దన చేసుకుంటే ముడతలు దూరమవుతాయి. విటమిన్ ఎ, ఇ ఎక్కువగా లభించే ఆలివ్ నూనెను కొబ్బరినూనెకు ప్రత్యామ్నాయంగా వాడొచ్చు.

❖ అరటిపండులో ఉండే పోషకాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడతాయి. ఒక అరటిపండును తీసుకుని మెత్తటి గుజ్జులా తయారు చేయాలి. దీంట్లో ఒక్కో టీస్పూన్ చొప్పున నారింజ రసం, పెరుగు కలిపి పేస్టులా చేయాలి. దీన్ని ముఖానికి మాస్కులా వేసుకొని ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. దీంట్లో ఉండే విటమిన్ ఎ, బి, ఇ, పొటాషియం వృద్ధాప్య ఛాయల్ని నిరోధిస్తాయి.

❖ గుడ్డు తెల్లసొనలో ఒక చెంచా నిమ్మరసం, అర చెంచా తేనె కలిపి ముఖానికి మాస్కులా వేసుకోవాలి. వీటిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ సెప్టిక్ గుణాలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జిడ్డు చర్మతత్వం ఉన్న వారికి ఇది సరైన ప్రత్యామ్నాయం. తెల్లసొన.. చర్మం నూనెలను ఎక్కువగా స్రవించకుండా చేస్తుంది.

డా. శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

జామెట్రికల్...జిల్‌జిల్

చెవిపోగుల్లో ఎన్ని డిజైన్లు ఉన్నా... ఇంకా ఏదో కొత్తదనం కోరుకుంటారు చాలామంది. అలాంటి వారికోసమే కాంటెంపరరీ లుక్‌లో జామెట్రికల్ డిజైన్లు సందడి చేస్తున్నాయి. ఫ్యాన్సీ, బంగారం, వెండి... మెటీరియల్ ఏదైనా ఈ డిజైన్లతో నయా లుక్ వస్తోంది. అందుకే యువతరం దీన్ని ఇష్టపడుతోంది. ఫ్యూజన్, వెస్టర్న్ దుస్తులమీదకు నప్పే ఇవి ఎవరినైనా సరే! స్టైలిష్‌గా కనిపించేలా చేస్తాయి.

నజరానా

మనీప్లాంట్‌ని నీళ్లల్లో పెంచుతున్నప్పుడు ఆ నీటిలో కొద్దిగా శీతలపానీయాన్ని కలిపితే వేగంగా ఎదుగుతుంది.

వ్యవసాయమే అనామిక వ్యాపారం

చదివింది సాహిత్యం... చేసింది ఐటీ ఉద్యోగం... పర్యావరణానికి హితమైంది చేస్తూనే భిన్నమైన వ్యాపార మార్గాన్ని అనుసరించింది ఝార్ఖండ్‌కు చెందిన అనామిక. ఇంతకీ ఆమె ఏం చేసిందంటే...

సాహిత్యంలో డిగ్రీ, దిల్లీ నిఫ్ట్‌లో మాస్టర్స్ పూర్తి చేసింది అనామిక. కొన్నేళ్లపాటు ఐటీ రంగంలో ఉద్యోగం చేసింది. ఇవేవీ ఆమెకు సంతృప్తినివ్వలేదు. వైవిధ్యంగా, సొంతంగా ఏదైనా చేయాలనుకుంది. అలాంటివి ఏమున్నాయా అని అన్వేషిస్తున్నప్పుడే బెంగళూరులోని ఆమె స్నేహితుడు తన దగ్గర ఖాళీగా ఉన్న స్థలం గురించి చెప్పాడు. అప్పుడే తట్టింది అనామికకు ఓ ఆలోచన. దాన్నే ఆమె తన వ్యాపారానికి వేదికగా మార్చుకుంది. 'ఆ స్థలంలో మొదట కూరగాయ మొక్కలను పెంచడం మొదలుపెట్టా. పండిన పంటను బంధువులు, స్నేహితులకు పంపించేదాన్ని. అప్పుడే నాకు విలేజ్ స్టోరీ కమ్యూనిటీ ఫార్మింగ్ అనే ఆలోచన వచ్చింది. నగరాల్లో తీరిక లేకుండా ఉండే ప్రజలు తమకు నచ్చిన పంటను తామే పండించుకునే అవకాశం కల్పించాలనుకున్నా. 'స్క్వేర్ ఫీట్ ఫార్మింగ్' పేరుతో వినూత్న వ్యవసాయ కార్యక్రమం మొదలుపెట్టా. దీనిద్వారా సేంద్రియ పంటల్ని కావాలనుకునేవారు, కూరగాయల్ని సొంతంగా పెంచుకోవాలనుకునేవారు మా క్షేత్రానికి రావొచ్చు. ఎవరైనా సరే... 7/7 అడుగుల స్థలాన్ని తీసుకుని తమకు నచ్చిన పంటల్ని పండించుకోవచ్చు. వారికి నేను, నా బృందం సాయం చేస్తాం. సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తూ మొక్కలను ఎలా పెంచాలో నేర్పిస్తాం. ఆ పంటను నిరంతరం పర్యవేక్షిస్తాం. ఈ విధానంలో సాగుకి కావలసిన స్థలం, మట్టి, విత్తనాలు, మొలకలు, కోకోపీట్... అన్నింటిని మేమే సమకూరుస్తాం. ఇందుకు మూడు నెలలకు రూ.2000 వరకూ అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైతే మరికొంత కాలం పొడిగించుకోవచ్చు...' అని చెబుతుందామె.

ఏమేం పండించొచ్చంటే...

పాలకూర, మెంతులు, కొత్తిమీర, క్యాలీఫ్లవర్, ఉల్లిపాయలు, ఆవాలతోపాటు వేప, మునగ, పసుపు, తులసి, కలబంద, పూల మొక్కలను ఇక్కడ పెంచుకోవచ్చు. చాలామంది ఇక్కడ సొంతంగా వ్యవసాయం చేస్తూ తమకు కావాల్సిన పంటల్ని పండించుకుంటున్నారు. కేవలం వ్యవసాయం చేయడం మాత్రమే కాదు... ఇక్కడ మరికొన్ని ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటు చేసిందామె. ఇక్కడికి వచ్చిన చిన్నా పెద్దా అంతా కలిసి సొంతంగా కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుని తినొచ్చు. వాటితోపాటు కుండల తయారీ, పప్పెట్ మేకింగ్, చిన్నారులకు కథలు చెప్పడం, పెయింటింగ్ లాంటివి నేర్పిస్తారు. ఈ అంకురం మొదలుపెట్టడానికి అనామికకు చాలా ఇబ్బందులే ఎదురయ్యాయి. వాటన్నింటినీ అధిగమించి విజయవంతంగా ఈ వ్యవసాయ క్షేత్రాన్ని నడుపుతోంది.

ఉత్సాహానికి ఈ ఆహారం

అలసట, చికాకు వంటి ఇబ్బందులు మన రోజును ప్రభావితం చేస్తాయి. కొన్ని రకాల ఆహార పదార్థాలు మనసును ఉత్తేజపరిచేందుకు తోడ్పడతాయి.

1 ఉదయం అల్పాహారం తీసుకోనప్పుడు ఆ ప్రభావం రోజంతా ఉంటుంది. ఎక్కువ మాంసకృత్తులుండే ఆహార పదార్థాలను పొద్దున్నే తింటే రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు. బాదం, పాలు, అరటిపండ్లు సెరటోనిన్ అనే హ్యాపీ హార్మోను విడుదలకు తోడ్పడతాయి. వీటిని పొద్దున్నే తింటే మంచిది.

2 బాదం, పిస్తా, అవిసె గింజలు, చేపల్లో మంచి కొవ్వులు ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే రోజువారీ పనులకు అవసరమయ్యే శక్తిని పొందొచ్చు.

3 ఉదయాన్నే మొలకలు తింటే జీవక్రియలు మెరుగ్గా పనిచేస్తాయి. రోజంతా ఉత్తేజంగా ఉండేందుకు తోడ్పడే ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

4 మామిడిలో ఉండే మెగ్నీషియంకు ఒత్తిడిని నియంత్రించే గుణం ఉంటుంది. దీంట్లో ఉండే క్యాల్షియం, బి విటమిన్లు శరీరానికి శక్తినిస్తాయి. రాత్రి వేళల్లో నిద్ర పట్టేందుకూ ఇవి ఉపయోగపడతాయి.

5 ఇడ్లీ, దోశెలు, ఊతప్పం, మజ్జిగ వంటి పులిసిన పదార్థాలు తీసుకుంటే తొందరగా జీర్ణమవుతాయి. అలసట, ఒత్తిడితో బాధపడేవారు నూనె పదార్థాలకు బదులుగా వీటిని ఎంచుకోవడం మంచిది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

డీఆర్‌డీవోలో సైంటిస్టులు

దిల్లీలోని భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)... వివిధ విభాగాల్లో సైంటిస్టు, ఇతర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** సైంటిస్ట్ బి-276, సైంటిస్ట్/ ఇంజినీర్ బి-10, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-04. **మొత్తం పోస్టుల సంఖ్య:** 290 **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ, గేట్ 2017/ 2018/ 2019 స్కోరు. **ఎంపిక:** రాతపరీక్ష, గేట్ స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** ఆగస్టు 30 **వెబ్‌సైట్:** https://rac.gov.in/

దిల్లీ జుడీషియల్ సర్వీస్ ఎగ్జామ్

దిల్లీ జుడీషియల్ సర్వీసులో ఖాళీల భర్తీకి దిల్లీ హైకోర్టు దరఖాస్తులు కోరుతోంది. ✦ దిల్లీ జుడీషియల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2019 **మొత్తం ఖాళీలు:** 45 **అర్హత:** అడ్వొకేట్‌గా ప్రాక్టీసు చేస్తూ ఉండాలి లేదా అందుకు తగ్గ అర్హతలు కలిగి ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామ్; వైవా వాస్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 2 **వెబ్‌సైట్:** www.delhihighcourt.nic.in

ఎన్‌హెచ్‌ఏఐలో యంగ్ ప్రొఫెషనల్స్

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)... దేశవ్యాప్తంగా సంస్థ కార్యాలయాల్లో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** యంగ్ ప్రొఫెషనల్ **ఖాళీలు:** 30 **అర్హత:** లా డిగ్రీ ఉత్తీర్ణత. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్), 2018 (పీజీ) స్కోరు. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** క్లాట్ స్కోరు ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** ఆగస్టు 23 **వెబ్‌సైట్:** https://nhai.gov.in/

ఐటీ విభాగంలో స్పోర్ట్స్ కోటా పోస్టులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదాయ పన్ను (ఐటీ) విభాగంలో స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి తెలుగు రాష్ట్రాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్-02, ట్యాక్స్ అసిస్టెంట్-08, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-02, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-09.
అర్హత: పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణత. నిర్దేశించిన క్రీడా ఈవెంట్లలో పాల్గొని ఉండాలి. **వయసు:** ఎంటీఎస్‌కు 18-25 మధ్య, మిగిలినవాటికి 18-27 మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఫీల్డ్ ట్రయల్స్, పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** సెప్టెంబరు 13 **వెబ్‌సైట్:** www.incometaxhyderabad.gov.in

రైల్వేలో స్పోర్ట్స్ కోటా పోస్టులు

వెస్టర్న్ రైల్వే (ముంబయి), ఆగ్నేయ రైల్వే (కోల్‌కతా)... 2019-20 సంవత్సరానికిగానూ వివిధ విభాగాల్లో స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నాయి. **పోస్టులు:** లెవెల్ 4/5, లెవెల్ 2/3. **జోన్లవారీ ఖాళీలు:** వెస్టర్న్-21, సౌత్ ఈస్టర్న్-21. **క్రీడా విభాగాలు:** అథ్లెటిక్స్, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, రెజ్లింగ్ తదితరాలు. **అర్హత:** పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ. సంబంధిత క్రీడా ఈవెంట్లలో పాల్గొని ఉండాలి. **వయసు:** 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** క్రీడా విజయాల మదింపు, ట్రయల్స్, విద్యార్హతలు, మెడికల్ టెస్ట్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఆగస్టు 14 నుంచి సెప్టెంబరు 13 వరకు. **వెబ్‌సైట్:** www.rrc-wr.com, https://ser.indianrailways.gov.in/

వాక్-ఇన్స్

ఎన్ఐఐహెచ్, ముంబయి

ముంబయిలోని ఐసీఎంఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునోహెమటాలజీ (ఎన్ఐఐహెచ్)... తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ పర్సనల్ భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది. **పోస్టులు-ఖాళీలు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో-05, ఎంటీఎస్ (ల్యాబ్ అటెండెంట్)-01, జూనియర్ రిసెర్చ్ ఫెలో-01, ల్యాబొరేటరీ టెక్నీషియన్-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-02, ల్యాబ్ టెక్నీషియన్-01, మెడికల్ సోషల్ వర్కర్-01, రిసెర్చ్ అసోసియేట్-02. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **వాక్‌ఇన్ తేది:** ఆగస్టు 22. **వెబ్‌సైట్:** http://niih.org.in/

SSC INTER Fail (or) Pass
Join in Hotel Management Courses
Salient Features
* Less Fee
* Pay in easy Installments
* Free Hostel for Boys/Girls
* Free Uniform
* Free Spoken English
* Part Time Jobs during Study
* Job placements Assistance
7675802999
Near LB Nagar Hyderabad

Rai Technology University
ENGINEERING MINDS
Research Applied Innovation
Bangalore
ADMISSIONS OPEN
ప్రవేశాలు ప్రారంభం
B.Sc (Agriculture)
M.Sc (Agriculture)
Scholarship up to 75% for Merit Students*
NO DONATION
Please Contact:
80880 91586 / 80882 38862

ప్రిపరేషన్ విధానం

ఐఐటీలు, ఐఐఎస్సీ వంటి ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్లల్లో సైన్స్‌లో పీజీ చేసే అవకాశాన్ని జామ్ పరీక్ష కల్పిస్తోంది. ఆసక్తి ఉన్న విభాగాల్లో అంతర్జాతీయ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచుకోడానికి ఇదో మంచి వేదిక. డీఆర్‌డీఓ, ఇస్రో వంటి ఉన్నతస్థాయి సంస్థలు, ప్రభుత్వ నిధులతో నడిచే రిసెర్చ్ ఆర్గనైజేషన్లు ఈ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ఐఐటీల్లో ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ అడ్మిషన్ టు ఎమ్మెస్సీ (జామ్-2020) ప్రకటన వెలువడింది. ఈ పరీక్షలో చూపిన ప్రతిభతో ఐఐటీలతోపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ), బెంగళూరులో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ; ఎన్ఐటీల్లో ఎమ్మెస్సీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, షిబ్‌పూర్; సంత్ లొంగోవాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పంజాబ్; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)ల్లో ప్రవేశాలు పొందవచ్చు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఈ ఏడాది పరీక్షను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తోంది.

జామ్ అంటూ ప్రఖ్యాత సంస్థల్లోకి..

ఇవీ సబ్జెక్టులు

పరీక్షను ఆరు సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్నారు. అవి బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. అభ్యర్థులు ఒకటి లేదా గరిష్ఠంగా రెండు సబ్జెక్టులు ఎంచుకోవచ్చు. సెషన్-1లో ఒకటి, సెషన్-2లో మరొక సబ్జెక్టులో పరీక్ష రాసుకోవచ్చు. సెషన్-1లో ఉదయం బయోటెక్నాలజీ, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. రెండో సెషన్‌లో మధ్యాహ్నం కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి. ఎమ్మెస్సీ, జాయింట్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ, ఎమ్మెస్సీ-ఎంఎస్(రిసెర్చ్)/పీహెచ్‌డీ కోర్సుల్లో 20 ఐఐటీలతోపాటు, ఐఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీలు, ఇతర సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.

అర్హత: ఆయా సంస్థలవారీ అర్హతల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. సాధారణంగా ఐఐటీల్లో ప్రవేశం కోరేవారు డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం సరిపోతుంది. అదే ఐఐఎస్సీ, బెంగళూరులో ప్రవేశాలకు 60 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతంగా నిర్ణయించారు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ కోర్సుకు సైన్స్ గ్రాడ్యుయేట్లతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఐటీలు, ఐఐఎస్సీలో కెమిస్ట్రీ కోర్సులకు డిగ్రీలో కెమిస్ట్రీతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్ తప్పనిసరిగా చదివుండాలి. ఎన్ఐటీల్లో ప్రవేశాలకు మాత్రం డిగ్రీలో కెమిస్ట్రీ చదివినవాళ్లంతా అర్హులే. మ్యాథ్స్, ఫిజిక్స్ పీజీ కోర్సులకు డిగ్రీ స్థాయిలో ఆ సబ్జెక్టులు చదవడం తప్పనిసరి. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ ఐఐటీ- బాంబే, రూర్కీ, ఇండోర్ ఈ 3 సంస్థలే అందిస్తున్నాయి.

పరీక్ష విధానం

పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. వ్యవధి 3 గంటలు. ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఏ సబ్జెక్టు ప్రశ్నపత్రంలోనైనా మొత్తం 60 ప్రశ్నలు ఉంటాయి. వీటికి వంద మార్కులు. మూడు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. అవి.. మల్టిపుల్ ఛాయిస్, మల్టిపుల్ సెలెక్ట్, న్యూమరికల్ సమాధాన ప్రశ్నలు. వీటిని 3 సెక్షన్లుగా విభజించారు.

సెక్షన్-ఎ: ఇందులో మొత్తం 30 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. వీటిలో ఒక మార్కు ప్రశ్నలు పది, రెండు మార్కుల ప్రశ్నలు ఇరవై వస్తాయి. ఒక్కో ప్రశ్నకు 4 ఆప్షన్లు ఇస్తారు. వీటిలో ఒకటి మాత్రమే సరైన సమాధానం ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉన్నాయి. తప్పు సమాధానాలకు ఒక మార్కు ప్రశ్నకు 1/3, రెండు మార్కుల ప్రశ్నలకు 2/3 మార్కులు తగ్గిస్తారు.

సెక్షన్-బి: ఇందులో పది మల్టిపుల్ సెలక్ట్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. నాలుగు ఆప్షన్లు ఇస్తారు. వీటిలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆప్షన్లు సరైన సమాధానాలుగా ఉండవచ్చు. సరైన ఆప్షన్/ ఆప్షన్లను గుర్తిస్తేనే పూర్తి మార్కులు వస్తాయి. పాక్షిక సమాధానానికి మార్కులు కేటాయించరు. రుణాత్మక మార్కులు లేవు.

సెక్షన్-సి: ఇందులో 20 న్యూమరికల్ ఆన్సర్ ప్రశ్నలు ఇస్తారు. వీటికి వాస్తవ సంఖ్య సమాధానంగా ఉంటుంది. ఈ ప్రశ్నలకు ఆప్షన్లు ఉండవు. ఒక మార్కు ప్రశ్నలు పది, రెండు మార్కుల ప్రశ్నలు పది వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులు: సెప్టెంబరు 5 నుంచి స్వీకరిస్తారు.
పరీక్ష ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750 రెండు పేపర్లకు రూ.1050. మిగిలిన అభ్యర్థులు అందరికీ రూ.1500. రెండు పేపర్లకు రూ.2100
చివరి తేదీ: అక్టోబరు 8
పరీక్ష తేదీ: ఫిబ్రవరి 9
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, వరంగల్.
ఫలితాలు: మార్చి 20న ప్రకటిస్తారు. **వెబ్‌సైట్:** https://jam.iitkgp.ac.in/
(విభాగాల వారీగా రిఫరెన్స్ పుస్తకాల కోసం https://t.ly/Nzzwx లింక్ లేదా www.eenaduprati-bha.net చూడవచ్చు.)

సన్నద్ధత ఎలా?

విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేవిధంగా ప్రశ్నలు ఉంటాయి. ముందుగా ప్రాథమికాంశాల నుంచి అధ్యయనం ప్రారంభించాలి. ఇందుకోసం ఇంటర్ పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి. అనంతరం డిగ్రీ పాఠ్యపుస్తకాలు బాగా అధ్యయనం చేయాలి. ఆయా సబ్జెక్టు/ పేపర్లవారీ సిలబస్ వివరాలను జామ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వాటి ప్రకారం పాఠ్యపుస్తకాల్లోని అంశాలకు అధికప్రాధాన్యం ఇస్తూ అధ్యయనం చేయాలి. సిలబస్‌లో ప్రస్తావించిన అంశాలు పాఠ్యపుస్తకంలో లేకపోతే రిఫరెన్స్ పుస్తకాలను ఆశ్రయించాలి. పరీక్షపై అవగాహన కోసం పాతప్రశ్నపత్రాలను పరిశీలించాలి. వీటిని కూడా జామ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. పరీక్షకు ముందు వీలైనన్ని మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. సాధారణంగా 60 శాతం మార్కులు సాధించినవారు ఏదో ఒక ఐఐటీలో సీటు పొందడానికి అవకాశం ఉంది.

కెమిస్ట్రీ సబ్జెక్టులో పరీక్ష రాసే విద్యార్థులు ఫిజికల్, ఆర్గానిక్ విభాగాలపై అధిక దృష్టి సారించాలి. ఆర్గానిక్ విభాగంలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్పెక్ట్రోస్కోపీ, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్, రియేజెంట్స్ తదితర పాఠ్యాంశాలను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో క్వాంటమ్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్, కెమికల్ కైనటిక్స్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, సాలిడ్ స్టేట్ అంశాలను బాగా చదవాలి. ఇనార్గానిక్‌లో సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎనలిటికల్ కెమిస్ట్రీ, రసాయన బంధం అంశాలపై దృష్టి సారించాలి.

ఫిజిక్స్ సబ్జెక్టులో పరీక్ష రాసేవాళ్లు ఫిజికల్ ఆప్టిక్స్, క్వాంటమ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్, వేవ్స్ అండ్ ఆసిలేషన్స్, హీట్, ఆప్టిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, అటామిక్ ఫిజిక్స్, క్వాంటమ్ థియరీ, స్పెక్ట్రోస్కోపీ అంశాలను అధ్యయనం చేయాలి.

మ్యాథ్స్ అభ్యర్థులు మ్యాట్రిక్స్, డెరివేటివ్స్, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగనోమెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీలపై దృష్టి సారించాలి.



బయోటెక్నాలజీలో పరీక్ష రాసేవారు బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు చెందిన ముఖ్యాంశాలను చదవాలి. బీఎస్సీ బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, జెనెటిక్స్, బోటనీ, జువాలజీ పాఠ్యపుస్తకాల్లోని అంశాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా బయోకెమిస్ట్రీలో అమినో ఆసిడ్లు, ప్రొటీన్లు; కార్బోహైడ్రేట్ మెటబాలిజం, ఎంజైమ్‌లు, బయోకెమికల్ టెక్నిక్‌లు, సెల్ సిగ్నలింగ్ అంశాలపై శ్రద్ధ పెట్టాలి. జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీ విభాగంలో డీఎన్ఏ ధర్మాలు, ఆర్‌డీఎన్ఏ టెక్నాలజీ, ట్రాన్స్‌క్రిప్షన్‌లపై దృష్టి సారించాలి. కెమిస్ట్రీలో స్టీరియో కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, నేమ్‌డ్ రియాక్షన్, కెమికల్ కైనటిక్స్, థర్మో డైనమిక్స్, సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎనలిటికల్ కెమిస్ట్రీ పాఠ్యాంశాలను బాగా చదువుకోవాలి. మ్యాథ్స్‌లో మ్యాట్రిక్స్, డెరివేటివ్స్, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగనోమెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీలపై దృష్టి సారించాలి. మ్యాథ్స్, కెమిస్ట్రీలకు చెందిన పాఠ్యాంశాలను ఇంటర్ స్థాయిలో చదువుకుంటే సరిపోతుంది.

- ఎస్. కిరణ్ కుమార్

ఇంటర్‌తో త్రివిధ దళాల్లోకి..!

ఉచిత విద్య.. ఉన్నతస్థాయి ఉద్యోగం.. సమాజంలో గౌరవం.. అన్నింటికీ మించి దేశ రక్షణలో భాగస్వామ్యం. ఇంత చక్కటి అవకాశం ఇంటర్మీడియట్ అభ్యర్థులకు ప్రత్యేకం. యూపీఎస్సీ ఏటా నిర్వహించే ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష నిర్వహణకు ప్రకటన వెలువడింది. పరీక్షల్లో ప్రతిభను ప్రదర్శిస్తే త్రివిధ దళాల్లోకి నేరుగా చేరిపోవచ్చు.

ఎన్‌డీఏ & ఎన్ఏ

రక్షణ రంగంలో ఉద్యోగాలను అందించేందుకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) అండ్ నేవల్ అకాడమీ (ఎన్ఏ) ఆహ్వానం పలుకుతున్నాయి. ఇందుకోసం యూపీఎస్సీ పరీక్ష నిర్వహిస్తుంది. మెరిట్ సాధిస్తే ఎన్‌డీఏ, పుణె; ఎన్ఏ ఎజిమాలలో చదువుతోపాటు శిక్షణ, వసతి, భోజనం అన్నీ ఉచితంగా అందిస్తారు. అనంతరం అభ్యర్థి ఎంపికైన విభాగంలో ప్రత్యేక ట్రెయినింగ్ ఇస్తారు. ఆ తర్వాత లెఫ్టినెంట్/ సబ్ లెఫ్టినెంట్ / ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇంటర్ విద్యార్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక ఇలా..

రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ తరహా), ఇంటెలిజెన్స్ - పర్సనాలిటీ టెస్ట్‌ల్లో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. 900 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్ వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-1లో 300 మార్కులకు మ్యాథ్స్ నుంచి, పేపర్-2లో 600 మార్కులకు జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్‌కు 200, జనరల్ నాలెడ్జ్‌కి 400 మార్కులు కేటాయించారు. ప్రశ్నలన్నీ ఇంటర్ సిలబస్ నుంచే వస్తాయి. రుణాత్మక మార్కులు ఉన్నాయి. రాత పరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో యూపీఎస్సీ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు నిర్వహిస్తుంది. ఈ విభాగానికి 900 మార్కులు కేటాయించారు. ఇందులో భాగంగా గ్రూప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్, అవుట్‌డోర్ గ్రూప్ టాస్కులు ఉంటాయి. స్టేజ్-1లో అర్హత సాధించినవారినే స్టేజ్-2కి అనుమతిస్తారు. రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. వైద్య పరీక్షలు, అభ్యర్థి ప్రాధాన్యాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ ఆధారంగా సంబంధిత విభాగాలకు ఎంపిక చేస్తారు.

అన్నీ ఉచితం

అన్ని దశలూ దాటి కోర్సులో చేరినవారు మూడేళ్లపాటు పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో బీఏ, బీఎస్సీ కోర్సులు చదువుతారు. నేవల్ అకాడమీకి ఎంపికైనవారు నాలుగేళ్లపాటు కేరళలోని ఎజిమాలలో బీటెక్ విద్యను అభ్యసిస్తారు. రెండు చోట్లా విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఉచితంగా సమకూరుస్తారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారికి జేఎన్‌యూ, న్యూదిల్లీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. ఆర్మీని ఎంచుకున్నవారు బీఎస్సీ/ బీఎస్సీ (కంప్యూటర్)/ బీఏ కోర్సులు; నేవీ, నావెల్ అకాడమీ (10+2 క్యాడెట్ ఎంట్రీ) అభ్యర్థులు బీటెక్ విద్య అభ్యసిస్తారు. ఎయిర్ ఫోర్స్‌కు ఎంపికైనవారు బీటెక్ లేదా బీఎస్సీ కోర్సులను ఎంచుకోవచ్చు. ఎన్‌డీఏలో మూడేళ్ల శిక్షణ, చదువు అనంతరం ఆర్మీ క్యాడెట్లను డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి; నేవల్ క్యాడెట్లను ఎజిమాలలోని ఇండియన్ నేవల్ అకాడమీకి; ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్లను హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి శిక్షణ కోసం పంపుతారు. అభ్యర్థి ఎంపికైన విభాగాన్ని బట్టి ఈ శిక్షణ ఏడాది నుంచి 18 నెలల వరకు ఉంటుంది. ఈ సమయంలో స్టైపెండ్ రూ.56,100 (మూల వేతనం) చెల్లిస్తారు. శిక్షణ అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు. విధుల్లో చేరినవారు మొదటి నెల నుంచే సుమారు రూ.లక్ష వేతనంగా పొందవచ్చు. వివిధ ప్రోత్సాహకాలు లభిస్తాయి. తక్కువ వ్యవధిలోనే పదోన్నతులు అందుకోవచ్చు.

అర్హతలు

ఆర్మీ వింగ్ (ఎన్‌డీఏ)కు ఏదైనా గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్‌డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)కు దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. రెండో సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు. బాలురు మాత్రమే అర్హులు.
వయసు: జనవరి 2, 2001 తర్వాత; జనవరి 1, 2004 కంటే ముందు జన్మించినవారు అర్హులు.
శారీరక ప్రమాణాలు: అభ్యర్థుల కనీస ఎత్తు 157 సెం.మీ. ఉండాలి. ఎయిర్‌ఫోర్స్‌కు 162.5 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం.
ఆన్‌లైన్ దరఖాస్తులు: సెప్టెంబరు 3 సాయంత్రం 6 వరకు స్వీకరిస్తారు.
మొత్తం ఖాళీలు: 415 వీటిలో ఎన్‌డీఏ 370 నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ 45 ఉన్నాయి. ఎన్‌డీఏలో ఆర్మీ 208, నేవీ 42, ఎయిర్ ఫోర్స్ 120 ఖాళీలు ఉన్నాయి.
పరీక్ష తేదీ: నవంబరు 17, 2019
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి
వెబ్‌సైట్: www.upsc.gov.in

ఓ సెల్ఫీ.. వృద్ధుడి ప్రాణం కాపాడింది!

కర్ణాటక: సెల్ఫీల మోజులో కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకోవడం, ప్రమాదాల బారిన పడటం వంటి ఘటనలు అప్పుడప్పుడూ వింటున్నాం. అయితే కర్ణాటకలో ఓ యువకుడు తీసుకున్న సెల్ఫీ ఒక పెద్దాయన ప్రాణాలు కాపాడింది. దావనగెరె జిల్లా హరిహర తాలుకాలో తుంగభద్ర నది వంతెనపై నుంచి ఆ యువకుడు వెళుతుండగా.. ఆ ప్రాంతం అతనికి బాగా నచ్చింది. వరద ప్రవాహం, ఆనకట్టలతో కలిపి అతను సెల్ఫీ (స్వీయచిత్రం) తీసుకోవాలనుకున్నాడు. వెంటనే ఫోన్ తీసి క్లిక్‌లు మొదలు పెట్టాడు. ఆ సెల్ఫీలో రోడ్డుకు అవతలివైపున ఓ వృద్ధుడు నదిలోకి దూకేందుకు సిద్ధమవుతూ కనిపించాడు. వెంటనే వెనక్కి తిరిగి చూసిన యువకుడికి ఆ పెద్దాయన ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమైంది. వెంటనే గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారంతా పరుగున వచ్చి వృద్ధుడిని కాపాడారు. ఈ 'సెల్ఫీ'కి ఇప్పుడు 'లైక్‌లు' క్యూ కట్టాయి.

- ఈటీవీ భారత్

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి బక్రీద్ శుభాకాంక్షలు

దిల్లీ: అచంచల భక్తివిశ్వాసం, నిరుపమాన త్యాగం, సర్వమానవ సౌభ్రాతృత్వాలకు 'బక్రీద్' (ఈద్ ఉల్ జుహా) ప్రతీక అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం పేర్కొన్నారు. ప్రజలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నిర్వహించుకోనున్న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కారుణ్యం, ఐకమత్యం, త్యాగాలకు బక్రీద్ ప్రతీక అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

ఐదేళ్లు కోమాలో ఉండి తనువు చాలించిన జవాను

దిల్లీ: చావుబతుకుల మధ్య, జీవచ్ఛవంలా ఆస్పత్రిలో అయిదేళ్లు గడిపి.. కన్నుమూశాడో సీఆర్పీఎఫ్ జవాను. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో తీవ్రంగా గాయపడిన అతడి పేరు కుమార్. బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా దుభా గ్రామం స్వస్థలం. 2014 ఏప్రిల్ 12న లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు అధికారులు అతడిని సుక్మా జిల్లాకు పంపారు. మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు జవాన్లు, ఇద్దరు పౌరులు మరణించగా, కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెదడు దెబ్బతిని కోమాలోకి వెళ్లిపోయాడు. అతడిని విమానంలో దిల్లీకి తరలించి ఎయిమ్స్‌లో చేర్చారు. అప్పటినుంచి కోమాలోనే ఉన్న ఆయన ఆదివారం మరణించారు.

నార్వే మసీదులో కాల్పులు.. ఒకరికి గాయాలు

ఓస్లో: ఆయుధాలతో వచ్చిన సాయుధుడు నార్వే రాజధాని ఓస్లో శివార్లలోని అల్ నూర్ ఇస్లామిక్ సెంటర్‌లో కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. దుండగుడిని ఓ వృద్ధుడు పట్టుకోగా, తర్వాత పోలీసులు అరెస్టుచేశారు. నల్లదుస్తుల్లో వచ్చిన ఆ శ్వేతజాతి యువకుడు శిరస్త్రాణంతో పాటు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించాడని మసీదు పెద్దలు తెలిపారు. దాడిని ఉగ్రవాద కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అతడు వలస వ్యతిరేక అభిప్రాయాలతో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

కశ్మీర్‌లో పెను ఉగ్రవాద దాడికి కుట్ర

రాష్ట్రంలోకి ప్రవేశించిన ఏడుగురు ఆత్మాహుతి బాంబర్లు

శ్రీనగర్: జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాద ముఠాకు చెందిన ఏడుగురు సభ్యుల ఆత్మాహుతి బృందం జమ్మూ-కశ్మీర్‌లోకి చొరబడినట్లు నిఘావర్గాలు గుర్తించాయి. బక్రీద్ లేదా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు భారీ దాడికి పాల్పడాలన్నది వారి పన్నాగమని పేర్కొన్నాయి. ఇందుకు పాకిస్థాన్ సైనిక గూఢచార సంస్థ ఐఎస్ఐ పచ్చజెండా ఊపినట్లు వెల్లడించాయి. జైష్ అధిపతి మసూద్ అజార్ సోదరుడు అబ్దుల్ రౌఫ్ ఈ కుట్రకు ప్రణాళిక రచించాడు. ఆత్మాహుతి దాడి కుట్రపై చర్చించడానికి అతడు రావల్పిండిలోని ఐఎస్ఐ అధికారులను కలిశాడు. ఆత్మాహుతి బృందాన్ని కశ్మీర్‌కు పంపాక అతడు తన స్వస్థలం బావల్పూర్‌కు తిరిగి వెళ్లిపోయాడు. ప్రధానంగా ఒక మసీదుపై దాడి చేసే అవకాశం ఉందని, దీనివల్ల భారత్‌ను నిందారోపణలు చేయడానికి పాక్‌కు వీలు కలుగుతుందని భావిస్తున్నట్లు భద్రతాధికారులు చెప్పారు. అనంత్‌నాగ్ జిల్లాలోని హైవే వెంబడి పౌరుల వాహనాలను, భద్రతా దళాల శిబిరాలను కూడా లక్ష్యంగా చేసుకోవచ్చని భావిస్తున్నారు. కశ్మీర్‌లో తనకు అనుకూలంగా ఉండే వేర్పాటువాదులకు బాసటగా ఉంటామన్న సంకేతాన్ని ఇచ్చేందుకూ పాక్ ఈ దుశ్చర్యకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు.

మేము కుశుడి వంశస్థులం!

జైపుర్: 'అయోధ్య' కేసు విచారణ నేపథ్యంలో జైపుర్ రాజకుటుంబానికి చెందిన దియాకుమారి తాము శ్రీరాముడి కుమారుడైన 'కుశుడి' వంశానికి చెందినవారమని పేర్కొన్నారు. భాజపా ఎంపీ దియాకుమారి ఈ విషయాన్ని ట్వీట్ చేస్తూ శ్రీరాముడి వంశస్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారన్నారు. తమ కుటుంబం వద్ద ఉన్న పురాతన రాతప్రతులు, వంశవృక్షం వివరాలు, పత్రాల ఆధారంగానే ఇలా చెప్పగలిగామన్నారు. అయోధ్య కేసు విచారణ సమయంలో శ్రీరాముడి 'రఘువంశానికి' చెందిన వారసులెవరైనా నేటికీ అయోధ్యలో నివసిస్తున్నారా అన్న సుప్రీంకోర్టు ప్రశ్నకు ఆమె స్పందించారు. అవసరమైతే తమ రాజకుటుంబానికి కుశుడి వంశంతో ఉన్న బంధుత్వాన్ని తెలియచెప్పే పత్రాలను న్యాయస్థానానికి సమర్పిస్తానన్నారు.

కొత్త ఆయుధాన్ని పరీక్షించిన ఉత్తర కొరియా

సియోల్: ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ కొత్త ఆయుధ పరీక్షను పర్యవేక్షించినట్లు ఆదివారం కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజన్సీ(కేసీఎన్ఏ) పేర్కొంది. దీనికి సంబంధించిన సాంకేతిక పరమైన అంశాలను వెల్లడించలేదు. ఈ కొత్త ఆయుధం దేశ భౌగోళిక పరిస్థితులను అనుగుణంగా ఉన్నట్లు వివరించింది. పరీక్ష నిర్వహిస్తుండగా కిమ్ తన సహాయకులతో కలిసి పర్యవేక్షించినట్లు అధికార పత్రికలో చిత్రాల్ని ప్రచురించారు. అమెరికాతో సంయుక్త సైనిక విన్యాసాల్ని రద్దుచేసుకునేందుకు దక్షిణకొరియా నిరాకరించిన నేపథ్యంలో ఆ దేశంతో తమ భవిష్యత్తు చర్చలకు గండిపడినట్లేనని ఉత్తర కొరియా విదేశాంగశాఖ వెల్లడించినట్లు కేసీఎన్ఏ పేర్కొంది. వచ్చే ఏడాది జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలకన్నా ముందే ఉత్తర కొరియాతో అణు నిరాయుధీకరణ ఒప్పందం చేసుకోవాలనే దిశగా ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్న క్రమంలో తాజా పరిణామాలు చేసుకున్నాయి.

రతుల్, దీపక్‌పురిల భవనం, ఎఫ్‌డీఐలు స్వాధీనం

దిల్లీ: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్‌పురి, ఆయన తండ్రికి చెందిన రూ. 300 కోట్ల బంగ్లాతో పాటు, 40 మిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐలు) ఆదాయపు పన్ను విభాగం స్వాధీనం చేసుకుంది. బినామీ నిరోధక చట్టం కింద ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. దిల్లీలోని విలాసవంతమైన ప్రాంతంలో ఉన్న బంగ్లా రతుల్‌పురి తండ్రి దీపక్ పురికి చెందిన ఓ కంపెనీ పేరు మీద ఉన్నట్లు చెప్పారు.

హజ్ యాత్రికులు సౌదీ అరేబియాలోని మీనాలో విడిదిచేసిన గుడారాలు ఇవి. ఆదివారం రాత్రి విద్యుత్తు దీపాల వెలుగుల్లో ఇలా కాంతులీనాయి. ఆదివారం ఒక్కరోజే 25 లక్షల మంది యాత్రికులు 'సైతానుపై రాళ్లు విసిరే' కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనుమల్లో కల్లోలం
వరదల విలయం

ఇవీ పశ్చిమ కనుమలు..

- **ఎంతమేర:** 1,600 కి.మీ.
- **ఏయే రాష్ట్రాల్లో:** కేరళ, గుజరాత్ తమిళనాడు, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర
- **ప్రత్యేకత:** హిమాలయాల కన్నా పురాతన పర్యావరణ వ్యవస్థ

కాళ్ల కింద ఆధారంగా నిలవాల్సిన నేల.. నీటితో నిండిపోయి ఆధారం లేకుండా చేస్తే.. ఎక్కడికి పోవాలి? ఎక్కడుండాలి? ఏం తినాలి? వరదల్లో మనిషి పరిస్థితి ఇదే. ఈ దుస్థితికి మనిషి స్వయంకృతాపరాధమే కారణం.

వారం రోజులుగా.. కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక జలవిలయంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలు వరదలుగా మారి జనాల్ని ముంచెత్తుతున్నాయి. ఇప్పటికే పెద్ద సంఖ్యలో మృతుల సంఖ్య తేలింది. పెద్ద ఎత్తున వర్షాలు.. వరదలు.. జనజీవనం అస్తవ్యస్తం.. ఇదంతా ఏటా జరిగే తంతులా మారింది. అయినా ముప్పు నుంచి ముందే ఎందుకు జాగ్రత్త పడలేకపోతున్నాం? జల నిర్వహణ వైఫల్యం, ముందుగానే జాగ్రత్త పడకపోవడం.. అన్నింటికీ మించి ప్రకృతిని అడ్డగోలుగా ధ్వంసం చేయడమే వరదలకు దారితీసి, కాళ్ల కింద నేల, జలంతో నిండి నిలువనీడ లేకుండా చేస్తోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాజాగా ఒక పుస్తకమూ ఇదే విషయాన్ని చెబుతోంది. –ఈనాడు ప్రత్యేక విభాగం

పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరంగా జరిగిన విధ్వంసమే 2018లో కేరళను సర్వనాశనం చేసిన వరదలకు ప్రధాన కారణమని తాజా పుస్తకం ఒకటి స్పష్టం చేస్తోంది. 2012లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ఎంపికైన పశ్చిమ కనుమలు దుర్బలంగా మారి తీవ్రమైన పర్యావరణ హాని దిశగా సాగుతున్నాయని, ప్రజల జీవనాధారానికీ ముప్పు పొంచి ఉంటోందని వివరించింది. ప్రకృతిపరంగా నాటి వరదల్ని ఒక మేల్కొలుపు సందేశంలా భావించాలని తెలిపింది. విజు.బి అనే రచయిత 'ఇన్ ఫ్లడ్ అండ్ ఫ్యూరీ: ఎకలాజికల్ డీవాస్టేషన్ ఇన్ ది వెస్ట్రన్ ఘాట్స్' అనే పుస్తకంలో ఈ అంశాలను వివరించారు. భారీ స్థాయిలో సాగుతున్న గనులు, క్వారీ తవ్వకాలు, అటవీ వినాశనం, జలవనరుల నిర్వహణలో లోపం వంటి అంశాలను వివరించారు.

పుస్తకంలో ఏం చెప్పారు..

- గత ఆరు దశాబ్దాల్లో పశ్చిమ కనుమల్లో మానవ కార్యకలాపాలు, వేగవంతమైన పట్టణీకరణ కారణంగా అడవులు తీవ్రస్థాయిలో క్షీణించాయి.
- సునిశిత ప్రాంతాల్లో గనుల తవ్వకాల్ని అత్యవసరంగా నిషేధించాలి, నిర్మాణ కార్యకలాపాలపై ఆంక్షలు విధించాలి.
- ప్రకృతిపరంగా, మానవ ప్రమేయంతో తలెత్తే పర్యావరణ నష్టాల ప్రభావం ముందుగా చవిచూసే గిరిజన వర్గాల అభిప్రాయాలకు విలువివ్వాలి. పర్యావరణపరంగా సమూల విజ్ఞానం ఉండేది వారికే.
- సహజ భూతలాన్ని సాధ్యమైనంత తక్కువగా మార్పులతో సుస్థిర జీవనం సాగించే వారి అభివృద్ధి నమూనా ప్రస్తుత వాతావరణ మార్పుల యుగంలో సరైనది.
- నదులు, అడవులకు ఎంతో విలువనిచ్చే, ప్రకృతి మధ్యే జీవించే వర్గాల ఆందోళనలు, ఆకాంక్షలకు విలువనిస్తూ, సంస్కృతులను గౌరవించడం ద్వారానే కనుమల్ని కాపాడుకోవచ్చు. నిబంధనల రూపకల్పనలో వారి హక్కుల్నీ గుర్తించాలి.

కర్ణాటకలోని బెలగావిలో ప్రస్తుత వరదల్లో చిక్కుకున్న మహిళను రక్షిస్తున్న వైమానిక దళం హెలికాప్టర్

2018లో కేరళలో ఏం జరిగింది?

- **ఎందుకు:** ఊహించిన దానికంటే 8 రెట్లు అధిక వర్షపాతం, ఒక్కసారిగా తెరుచుకున్న డ్యాములు
- **నిరాశ్రయులు:** 50 లక్షల మందికిపైగా
- **మృతులు:** 400 మందికిపైగా | **సహాయ శిబిరాలు:** 4000పైగా,
- **సహాయం:** పెద్ద సంఖ్యలో పడవలు, హెలికాప్టర్ల వినియోగం, నిత్యావసరాల పంపిణీ
- **నష్టం:** రూ.30,000 కోట్లకుపైగానే | **దెబ్బతిన్న స్థిరాస్తులు:** వేల సంఖ్యలో

ఎందుకంత నష్టం

కేరళలో లోతట్టు ప్రాంతాల విస్తీర్ణం అధికం. సుమారు 10శాతం భూభాగం సముద్ర మట్టంకన్నా కిందికి ఉంటుంది. ప్రజలు ఇలాంటి చోట్లలోనే భారీస్థాయిలో గృహాలు, వ్యాపార సంస్థల్ని నిర్మించుకున్నారు. ఇలాంటి ఆవాసాలకు అది తగిన ప్రాంతం కాదు.

నీతి ఆయోగ్ ఏం చెప్పింది?

నీతిఆయోగ్ 2016-17లో సమ్మిళిత జల నిర్వహణ సూచీని రూపొందించింది. ఇందులో 50 మార్కులకన్నా తక్కువగా వచ్చిన రాష్ట్రాల్ని అత్యల్ప సామర్థ్య రాష్ట్రాలుగా గుర్తించింది. ఇందులో కేరళ 42 మార్కులు మాత్రమే సాధించింది. మిగులు జలాలకు కారణమయ్యే చిన్నపాటి వాగుల నిర్వహణ సైతం సక్రమంగా లేదని తేల్చింది. వరద నిర్వహణలో దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత చెత్త రికార్డు కేరళదే.

పర్యావరణవేత్తలు ఏమన్నారు?..

కేరళ వరదలకు పాక్షికంగా మానవ తప్పిదాలే కారణమని పశ్చిమ కనుమల పర్యావరణ నిపుణుల కమిటీ అధ్యక్షుడు, పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ గతంలోనే తేల్చారు. తీవ్రస్థాయిలో గనులు, క్వారీల తవ్వకం, భూమిని అటవీయేతర అవసరాలకు ఉపయోగించడం, నదీ పరీవాహక ప్రాంతాలు, నదుల్లో భారీ కట్టడాలు విపత్తులకు కారణమని ఆయన నివేదిక పేర్కొంది. కేరళ వరదలు మానవ తప్పిదం కారణంగా తలెత్తిన విపత్తని మెట్రోమ్యాన్ ఇ.శ్రీధరన్ సైతం ఆరోపించారు.

కేరళలోని మలప్పురం జిల్లాలో వరద గుప్పిట చిక్కిన ఓ ప్రాంతం

ఇటు సంబరాలు.. అటు నిషేధాజ్ఞలు

- **కశ్మీర్‌లో ఇళ్ల వద్దకే కూరలు, కోళ్లు, కోడిగుడ్లు**
- **తాత్కాలికంగా 300 టెలిఫోన్ బూత్‌ల ఏర్పాటు**

ఈనాడు, దిల్లీ: శ్రీనగర్‌లో మళ్లీ నిషేధాజ్ఞలు విధించారు. సెక్షన్ 144ను ఉపసంహరించాక చెదురుమదురు ఘర్షణలు చోటుచేసుకోవడంతో మళ్లీ ఆంక్షలు విధించారు. ప్రజలు ఇళ్లకు వెళ్లిపోవాలని, దుకాణాలు మూసేయాలని ప్రకటనలు చేశారు. బక్రీద్ సందర్భంగా సోమవారం మసీదులలో ప్రార్థనలకు అనుమతిస్తామని, ఫోన్ సేవలపై ఆంక్షలను త్వరలో ఎత్తేస్తామని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. జమ్మూ-కశ్మీర్‌లో ప్రజా జీవనం సాఫీగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసినట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. "సెలవుదినాలైనా బ్యాంకులు, ఏటీఎంలు పనిచేస్తున్నాయి. ఉద్యోగులు, తాత్కాలిక కార్మికుల వేతనాల చెల్లింపులు చేశాం. వ్యాన్ల ద్వారా కూరగాయలు, సిలిండర్లు, కోడిమాంసం, గుడ్లు ఇళ్లవద్దకు వెళ్తున్నాయి. బక్రీద్ కోసం 2.50 లక్షల గొర్రెలు అందుబాటులో ఉంచేందుకు శ్రీనగర్‌లో ఆరు మార్కెట్లు ఏర్పాటుచేశాం. కశ్మీర్ డివిజన్‌లో 3557 దుకాణాల ద్వారా సరకుల సరఫరా జరుగుతోంది. ఆగస్టు 18 నుంచి హజ్ యాత్రికులు తిరిగి రానున్నందున విమానాశ్రయాల్లో డిప్యూటీ కమిషనర్లను నోడల్ అధికారులుగా నియమించాం. 65 రోజులకు సరిపడ

సైనికులు అందిస్తున్న ఫోన్ల కోసం కశ్మీరీల క్యూ

నిత్యావసర సరకుల నిల్వలున్నాయి. బంధువుల మధ్య సమాచారం కోసం 300 టెలిఫోన్ బూత్‌లు ఏర్పాటు చేశాం. 24 గంటలు విద్యుత్తు, తాగునీరు సరఫరా అవుతోంది" అని ఆ ప్రకటనలో తెలిపారు. మరోవైపు.. మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ సహా సుమారు 400 మంది నాయకులు వారం రోజులుగా పోలీసుల అదుపులో ఉన్నారు.

వ్యాపారులకు రూ.1000 కోట్ల నష్టం!

నిషేధాజ్ఞల వల్ల వ్యాపారాలేవీ సాగకపోవడంతో వారం రోజుల్లో వ్యాపారులకు రూ.1000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా. కశ్మీర్‌లో సగటున రోజుకు రూ.175 కోట్ల వ్యాపారం జరుగుతుందని, అదంతా ఆంక్షల వల్ల ఆగిపోయిందని కశ్మీర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సభ్యుడొకరు చెప్పారు. బేకరీలకే రూ. 200 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. బక్రీద్ కోసం పూంఛ్ నుంచి బషీర్ అహ్మద్ గొర్రెల మందతో శ్రీనగర్ వచ్చారు. 200 గొర్రెలు తేగా 15 మాత్రమే అమ్ముడయ్యాయి. ఆదివారం మార్కెట్లో చవకదుస్తుల అమ్మకాలూ పడిపోయాయని ఓ వ్యాపారి తెలిపారు.

కేంద్రం పరిధిలోకి కశ్మీర్ పోలీసులు

నూతనంగా ఏర్పాటయిన జమ్మూ-కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలో శాంతిభద్రతలు, పోలీసు వ్యవహారాల బాధ్యతలను నేరుగా కేంద్రమే చూసుకుంటుంది. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తుందని ఆదివారం అధికార వర్గాలు తెలిపాయి. భూమికి సంబంధించిన విషయాలను మాత్రం ఎన్నికయిన ప్రభుత్వమే చూస్తుంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులంతా ప్రస్తుతం జమ్మూ-కశ్మీర్ కేడర్‌లోకి వస్తుండగా, ఇకపై నియమితులయ్యే వారంతా యూటీ కేడర్‌లోకి వస్తారు.

- జమ్మూలో నివసిస్తున్న గోర్ఖాలు 370 అధికరణ రద్దును స్వాగతిస్తున్నారు. శాశ్వత నివాస ధ్రువపత్రాలు రావడంతో పిల్లలు ఉద్యోగాలకు, నచ్చిన చదువులకు దరఖాస్తు చేసుకోవడం వీలవుతుందన్నారు.
- కశ్మీర్ లోయలో ప్రజలకు సేవలు అందించేందుకు సైన్యం 'మిషన్ రీచ్ ఔట్'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అవసరమైనచోట్ల వైద్యుల సేవలు, రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లడం లాంటి సేవలు అందిస్తున్నారు.
- పాకిస్థాన్‌లో భారత హైకమిషనర్ అజయ్ బిసారియా భారతదేశానికి తిరిగొచ్చారు. పాక్ బిసారియాను బహిష్కరించడంతో ఆయన వచ్చేశారు.
- సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను రద్దుచేస్తున్నట్లు భారతీయ రైల్వే అధికారులు ప్రకటించారు. తమవైపు రైలును పాక్ సస్పెండ్ చేయడంతో, ఇటుకూడా రద్దుచేశారు.

నాజీల తరహాలో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు: రౌహానీకి ఇమ్రాన్ ఫోన్

కశ్మీర్ పరిస్థితిపై పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీకి ఫోన్‌చేశారు. జమ్మూ-కశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తీర్మానాలకు విరుద్ధంగా భారత చర్యలున్నాయని చెప్పారు. కశ్మీర్ భౌగోళికస్థితిని మార్చేందుకు భారత్ ప్రయత్నిస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు నాజీల తరహాలో ఉన్నాయన్నారు. తమ స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 14ను కశ్మీర్ సంఘీభావ దినోత్సవంగా చేసుకోవాలని పాక్ నిర్ణయించినట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి షా మొహ్మద్ ఖురేషీ చెప్పారు.

సీబీఎస్ఈ పరీక్ష రుసుముల పెంపు

- ఎస్సీ/ఎస్టీలకు రూ.1,200
- జనరల్ విద్యార్థులకు రూ.1,500

దిల్లీ: కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) పరీక్ష రుసుములను పెంచింది. 10, 12 తరగతుల పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు ఇంతవరకు అయిదు సబ్జెక్టులకు రూ.350 రుసుము చెల్లిస్తుండగా, దాన్ని రూ. 1200కు పెంచారు. జనరల్ కేటగిరీ విద్యార్థుల నుంచి రూ.750 వసూలు చేస్తుండగా, దాన్ని రెట్టింపు చేసింది. 10, 12 తరగతులు రెండింటికీ ఒకే తరహా రుసుములు వర్తిస్తాయి. నూరు శాతం అంధత్వం ఉన్నవారు ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యార్థులు తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే పదో తరగతి పరీక్ష రుసుములు, 11వ తరగతిలో ఉన్నప్పుడే 12వ తరగతి రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

పరీక్షల రుసుము పెంపుదల ఇలా

కేటగిరీ	ప్రస్తుతం	పెంచినది
ఎస్సీ/ఎస్టీ	రూ.350	రూ. 1,200
జనరల్	రూ.750	రూ. 1,500
మైగ్రేషన్	రూ.150	రూ.350
విదేశాల్లోని పాఠశాలలు	రూ.5,000	రూ.10,000
12వ తరగతిలో అదనపు సబ్జెక్టు		
ఎస్సీ/ఎస్టీ	-	రూ.300
జనరల్	రూ.150	రూ.300
విదేశాల్లోని పాఠశాలలు	రూ.1,000	రూ.2,000

కాంగ్రెస్‌లో వృద్ధనేతలదే పైచేయి

అందుకే తేలని అధ్యక్షుడి వ్యవహారం

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడి నియామక వ్యవహారం కొలిక్కి రాకపోవడం, సోనియాగాంధీకే తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం వెనుక పెద్ద రాజకీయమే నడిచింది. ఇది యువ, వృద్ధనేతల మధ్య పోరుగా పరిణమించగా, పెద్దతరం వారే మాట నెగ్గించుకున్నారు. పార్టీలో యువకులకు ప్రాధాన్యం పెంచాలని తొలుత రాహుల్‌గాంధీ భావించినా వృద్ధనేతలు పడనీయలేదు. 1969లో ఇందిరాగాంధీ పాతనేతలను తప్పించి, కొత్తవారికి అవకాశం ఇవ్వడాన్ని గుర్తుచేసుకున్నారు. అలా జరిగితే తమకు ప్రాధాన్యం ఉండదని అడ్డుచక్రం వేశారు. ఆదివారం ఉదయం వరకు అధ్యక్ష పదవికి మహారాష్ట్రకు చెందిన ముకుల్ వాస్నిక్ (59) పేరే ప్రచారంలోకి వచ్చింది. ఆయనకు 'ప్రథమ కుటుంబం' మద్దతు కూడా ఉండడంతో ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అనుకున్నారు. కానీ కొత్తవారు వస్తే ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన కొందరు నాయకులు మళ్లీ రాహుల్ పేరునే ప్రతిపాదించారు. అధ్యక్షుడి నియామకంపై చర్చించడానికి ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర, ఈశాన్య భారతాలకు ప్రాతినిధ్యం వహించేలా అయిదు కమిటీలు వేశారు. ఉత్తర, దక్షిణ కమిటీల్లో శక్తిమంతులు ఉండడం, వారంతా రాహుల్‌వైపు మొగ్గుచూపడంతో చర్చోపచర్చలు జరిగాయి. చివరకు మధ్యేమార్గంగా సోనియాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఇది వృద్ధనేతలకు ఊరటనిచ్చింది.

యెమెన్‌లో ఘర్షణలు

- **4 రోజుల్లో 70 మంది మృతి**
- **వేర్పాటువాదుల తిరుగుబాటు**

దుబాయ్, ఏడెన్: ప్రభుత్వ బలగాలు, వేర్పాటువాదుల ఘర్షణలతో యెమెన్‌లో పరిస్థితులు వేడెక్కాయి. ఏడెన్‌లో నాలుగు రోజుల్లో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో 70 మందికిపైగా దుర్మరణం పాలయ్యారు. 230 మంది గాయపడ్డారు. బాధితుల్లో పౌరులూ ఉన్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారని.. వారు ఆహారం, నీటికొరతను ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్య సమితి ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రభుత్వ సంకీర్ణ బలగాలు, హూతీ తిరుగుబాటుదారుల మధ్య పోరాటాలతో యెమెన్ ఏళ్లుగా అట్టుడుకుతోంది. సంకీర్ణ బలగాలకు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మద్దతు అందిస్తుండగా.. తిరుగుబాటుదారులకు ఇరాన్ అండగా నిలుస్తోంది. తాజా ఘర్షణలు ప్రభుత్వ బలగాలకు, సంకీర్ణ బలగాల్లో భాగమైన 'సెక్యూరిటీ బెల్ట్(ఎస్‌బీ)'కు మధ్య జరుగుతున్నాయి. ఎస్‌బీ బలగాలకు యూఏఈ శిక్షణనిస్తోంది. ఈ సంస్థలో వేర్పాటువాదులదే అధిపత్యం. దక్షిణ యెమెన్‌కు స్వాతంత్ర్యం ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఏడెన్‌లో అధ్యక్ష భవనాన్ని వీరు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ బలగాలు వారిపై దాడులకు ఉపక్రమించాయి. పరిస్థితులు విషమించడంతో ఎస్‌బీ వెనక్కి తగ్గింది. హూతీ తిరుగుబాటుదారులపై పోరాడాల్సిన ఎస్‌బీ.. ప్రభుత్వ బలగాలపై తిరుగుబాటుకు పూనుకోవడంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

నేరపూరిత ఉద్దేశంతోనే ఈవీఎంలపై ఆరోపణలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యాఖ్య

కోల్‌కతా: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను (ఈవీఎం) ట్యాంపరింగ్ చేస్తున్నారన్న అభియోగాలు అనుచితమైనవని, నేరపూరిత ఉద్దేశంతోనే ఈ విమర్శలు చేస్తున్నారని ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోడా అన్నారు. కోల్‌కతా ఐఐఎంలో జరిగిన వార్షిక వాణిజ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. "ఈవీఎంలు కొన్నిసార్లు మొరాయించవచ్చు. వాటిని ట్యాంపరింగ్ చేయలేరు" అని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిన తర్వాతే పార్టీలు ఈవీఎంలను తప్పుపడుతున్నాయన్నారు. ఎన్నికల నిర్వహణలో కొన్ని లోపాలు ఉంటాయని.. కొందరు అధికారులను తప్పించాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయడం వల్ల ఆ సమయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఆటంకం ఏర్పడుతోందన్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. ఎన్నికలపై సామాజిక మాధ్యమాల పాత్ర చాలా కీలకంగా మారుతోందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన సి-విజిల్ యాప్‌ను వినియోగించుకునేందుకు దాదాపు 22 ద

37242 స్థాయి కీలకం!



సమీక్ష : దేశీయ పరిణామాలు దన్నుగా నిలవడంతో నాలుగు వారాల నష్టాలకు అడ్డుకట్ట పడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐలు)పై అధిక సర్‌ఛార్జీ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవచ్చన్న అంచనాలతో మార్కెట్లు మళ్లీ కోలుకున్నాయి. ముడిచమురు ధరలు దిద్దుబాటుకు గురికావడం కలిసొచ్చింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోడానికి రిజర్వు బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 0.35 శాతం తగ్గించి 5.40 శాతం చేసింది. కీలక రేట్లను తగ్గించడం ఇది వరుసగా నాలుగో సారి. అయితే వృద్ధి అంచనాలను మాత్రం 7 శాతం నుంచి 6.9 శాతానికి తగ్గించి కలవరపెట్టింది. పరిశ్రమ వర్గాలతో ఆర్థిక మంత్రి భేటీ మార్కెట్ల రికవరీకి దోహదపడింది. సెప్టెంబరు 1 నుంచి బ్యాంకులకు మూలధన సాయం అందొచ్చన్న అంచనాలు పనిచేశాయి. దేశవ్యాప్తంగా వర్షపాతం మెరుగవ్వడంతో.. కరవు భయాలు తగ్గాయి. అమెరికా వాణిజ్య ఉద్రిక్తతలు, బ్రిటన్ బలహీన గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 1.2 శాతం లాభంతో 37,582 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 1 శాతం పెరిగి 11,110 పాయింట్ల దగ్గర స్థిరపడింది. వాహన, ఐటీ, ఆరోగ్య సంరక్షణ షేర్లు రాణించగా, లోహ, చమురు-గ్యాస్, విద్యుత్ స్క్రిప్‌లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.4742 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.5590 కోట్లుగా నమోదయ్యాయి. ఎఫ్‌పీఐలు ఈ నెలలో 9వ తేదీ వరకు కేవలం 7 ట్రేడింగ్ రోజుల్లోనే నికరంగా రూ.9,197 కోట్లు వెనక్కి తీసుకున్నారు.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదు కావడం.. ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } 200 రోజుల కదలికల సగటు స్థాయి వద్ద మద్దతు లభించడంతో సెన్సెక్స్ గతవారం లాభాలు నమోదు చేసింది. రికవరీ కొనసాగితే.. 38050- 38450 పాయింట్ల శ్రేణిలో బలమైన నిరోధం ఎదురుకావొచ్చు. ఒకవేళ నష్టాలొస్తే, స్వల్పకాలంలో 200 రోజుల కదలికల సగటు స్థాయి 37,242 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ ఆర్థిక గణాంకాలు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. బక్రీద్, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ వారం మార్కెట్లు మూడు రోజులే పనిచేయనున్నాయి. దేశీయంగా చూస్తే.. రిటైల్, టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. గత శుక్రవారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన పారిశ్రామికోత్పత్తి గణాంకాలు ఇందుకు తోడవ్వనున్నాయి. ఫలితాల సీజను చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చు. ఒపెక్ మరిన్ని ఉత్పత్తి కోతలు విధించొచ్చన్న అంచనాలతో ముడిచమురు ధరల కదలికలు కీలకం కానున్నాయి. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతలు ముడిచమురు ధరలకు కళ్లెం వేయొచ్చు. ఎఫ్‌పీఐ సర్‌ఛార్జీపై సానుకూల వార్తలు వెలువడితే మార్కెట్లు పరుగులు తీయొచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, ఇటలీ రాజకీయ పరిణామాలు, మధ్యప్రాచ్య ఆందోళనల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 37,242, 36,956, 36,416;

తక్షణ నిరోధ స్థాయిలు: 37,830, 38,043, 38,470

స్వల్పకాలంలో మార్కెట్‌కు 37,242 స్థాయి కీలకం కానుంది. ఈ స్థాయి దిగువకు చేరితే నష్టాలు తప్పకపోవచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



కోడిగుడ్లు

11న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	328	గోదావరి	334
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	వరంగల్	331
బెంగళూరు	340	విశాఖపట్నం	352
12వ తేదీకి...		చెన్నై	355
		చిత్తూరు	348
విజయవాడ	339	నమక్కల్	350

ఎఫ్‌పీఐ విధానమే దిక్సూచి!

● ఆదాయపు పన్ను సర్‌ఛార్జీ పరిణామాలు కీలకం ● ఈ వారం ట్రేడింగ్ మూడు రోజులే ● నేడు, గురువారం సెలవు

స్టాక్ మార్కెట్ ఈ వారం

విదేశీ సంస్థాగత మదుపర్లకు ఆదాయపు పన్ను సర్‌ఛార్జీ పెంపు నుంచి ఊరటనిచ్చే దిశగా ప్రభుత్వం వేసే అడుగులపై ఆధారపడి మార్కెట్ ఈ వారం చలించనుంది. దేశీయ కార్పొరేట్ సంస్థల ఫలితాలు కూడా సూచీల గమనంపై ప్రభావం చూపొచ్చని విశ్లేషకులు అంటున్నారు. బక్రీద్ సందర్భంగా సోమవారం; స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో గురువారం మార్కెట్లకు సెలవు కావడంతో.. ఈ వారం ట్రేడింగ్ మూడు రోజులకే పరిమితం కానుంది. నిఫ్టీ, నిఫ్టీ బ్యాంక్‌ల వారం వారీ ఆప్షన్లకు బుధవారం గడువు తీరనుంది. నిఫ్టీ-50 ఈ వారం 10,782-11,250 శ్రేణిలో చలించొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. నిఫ్టీ కంపెనీల్లో సన్‌ఫార్మా, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌ల ఫలితాలు కూడా ట్రేడింగ్‌పై ప్రభావం చూపించే అవకాశం లేకపోలేదు.

- ప్రభావం చూపే వార్తలు లేనందున **బ్యాంకు** షేర్లు ఊగిసలాటకు గురికావొచ్చు. ఐడీబీఐ బ్యాంక్ ఫలితాలు, మంగళవారం వెలువడే సీపీఐ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ వర్గాలు దృష్టి నిలపవచ్చు.
- అంచనాల కంటే తక్కువ స్థాయిలో ఫలితాలు వెల్లడించడంతో బీపీసీఎల్, ఆయిల్ ఇండియాల వంటి **చమురు** షేర్లు బలహీనతలను ఎదుర్కోవచ్చు. మంగళవారం వెలువడే ఓఎన్‌జీసీ ఫలితాల కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.
- గత వారం **ఐటీ** షేర్లు రాణించిన నేపథ్యంలో మదుపర్లు కొంత లాభాల స్వీకరణ చేయొచ్చు. టెక్నాలజీ షేర్ల పనితీరు స్తబ్దుగా ఉండొచ్చు.
- జూన్ నెలకు సంబంధించి పారిశ్రామికోత్పత్తి సూచీ 4 నెలల కనిష్ఠమైన 2 శాతానికి చేరడంతో **యంత్ర పరికరాల** షేర్లు ఈ వారం నష్టపోయే అవకాశం ఉంది. ఆర్డర్ల వార్తల ఆధారంగా ఈ రంగ కంపెనీల షేర్లు స్పందించవచ్చు.
- **వాహనాల**పై ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గిస్తుందన్న అంచనాల మధ్య వాహన షేర్లు ఈ వారం లాభాలు పొందొచ్చు. వాహన తయారీదార్ల ప్రతినిధులు గత బుధవారం ఆర్థిక మంత్రిని కలిసి జీఎస్‌టీ తగ్గించాలని కోరిన విషయం విదితమే. ఆగస్టు, సెప్టెంబరులలో విడదలయ్యే కొత్త మోడళ్ల కారణంగా విక్రయాలు పెరిగితే సెంటిమెంటు మెరుగుపడవచ్చు.
- నేడు జరగనున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం **టెలికాం** షేర్లకు అత్యంత కీలకం కానుంది. రిలయన్స్ జియో తన ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్, టీవీ సేవల గురించి ప్రకటించే అవకాశం ఉంది.
- జిందాల్ స్టీల్, పవర్ బుధవారం ఫలితాలు వెల్లడించనున్న నేపథ్యంలో ఆ షేర్లు వెలుగులోకి రావొచ్చు. **లోహ** షేర్లకు సెంటిమెంటు సానుకూలంగానే కనిపిస్తోంది. తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లు జరిగే అవకాశం ఉంది.
- సన్‌ఫార్మా మంగళవారం వెలువరచే ఫలితాలు **ఔషధ** షేర్లకు దిశానిర్దేశం చేయొచ్చు. ఏకీకృత నికర లాభం, నికర విక్రయాలు స్తబ్దుగానే ఉండొచ్చని కొంతమంది విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా వ్యాపారంపై కంపెనీ యాజమాన్యం చేసే వ్యాఖ్యలు కీలకం కానున్నాయి.
- మార్కెట్‌తో పాటే **సిమెంటు** కంపెనీల షేర్లు చలించొచ్చు. వర్షాకాలం గిరాకీ తగ్గడంతో సిమెంటు ధరలు క్షీణించడంపై మదుపర్లు ఆందోళన చెందుతున్నారు. జులై-సెప్టెంబరు లాభాలపై ఇది ప్రభావం చూపొచ్చన్నది వారి భావన. దేశ వ్యాప్తంగా బస్తా సిమెంటు ధరలు రూ.20-25 వరకు తగ్గిన సంగతి తెలిసిందే.
- **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లు ఈ వారం లాభాలతో ప్రారంభమవ్వొచ్చు. ప్రభుత్వం వాహనాలపై జీఎస్‌టీని తగ్గిస్తే.. అటువంటి చర్యలే ఈ రంగంలోనూ చేపట్టవచ్చన్న అంచనాలున్నాయి. ఇప్పటికే వర్షాభావం, ఆర్థిక మందగమనం, బలహీన కార్పొరేట్ ఫలితాల వల్ల మదుపర్లు నిరాశలో ఉన్న సంగతి తెలిసిందే.

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	176.20	189.10	166.80
హిందుస్థాన్ జింక్	212.15	217.00	208.00
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	220.60	231.90	213.60
ఎన్ఎమ్‌డీసీ	101.85	104.10	99.90
సెయిల్	38.80	40.50	37.60
టాటా స్టీల్	362.35	378.40	352.80
వేదాంతా	141.50	148.00	135.20

ఫార్మా	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	598.85	622.70	583.50
బయోకాన్	228.90	236.00	223.90
సిప్లా	484.50	522.70	462.40
డాక్టర్ రెడ్డీస్	2573.45	2604.00	2544.80
గ్లెన్‌మార్క్ ఫార్మా	426.20	441.40	415.00
లుపిన్	758.70	778.70	745.00
ఫైజర్	2961.45	3074.40	2808.80

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1574.60	1603.60	1544.10
అంబుజా సిమెంట్స్	212.95	218.90	205.10
ఇండియా సిమెంట్స్	84.50	90.40	81.10
శ్రీ సిమెంట్	20270.00	21247.10	19612.50
అల్ట్రాటెక్ సిమెంట్	4281.35	4444.90	4158.90

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	2588.15	2707.00	2462.90
కోల్గేట్ పామోలివ్	1229.50	1253.30	1193.60
గోద్రేజ్ కన్జ్యూమర్	653.40	669.40	634.40
హిందుస్థాన్ యునిలీవర్	1841.35	1875.40	1783.90
ఐటీసీ	254.20	260.90	250.20
టాటా గ్లోబల్ బేవరేజెస్	265.50	277.20	258.90

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2282.00	2319.50	2221.10
ఐసీఐసీఐ బ్యాంక్	420.15	426.90	411.10
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	44.35	45.90	41.80
ఇండస్ఇండ్ బ్యాంక్	1413.40	1447.60	1388.20
కోటక్ బ్యాంక్	1532.10	1555.20	1492.70
పీఎన్‌బీ	66.55	68.60	64.60
ఎస్‌బీఐ	291.35	301.10	285.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	346.45	356.00	336.20
హెచ్‌పీసీఎల్	247.10	257.00	241.70
ఐఓసీఎల్	130.50	132.50	128.00
ఓఎన్‌జీసీ	130.95	133.80	128.30
ఆయిల్ ఇండియా	150.20	155.10	147.30

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	1086.30	1113.50	1064.20
ఇన్ఫోసిస్	789.85	802.40	778.50
మైండ్ ట్రీ	752.15	766.10	733.60
టీసీఎస్	2246.25	2278.40	2225.30
టెక్ మహీంద్రా	663.35	689.00	647.00
విప్రో	263.50	270.90	259.20

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	56.90	60.00	54.60
సీజీ పవర్	18.30	18.90	17.40
ఎల్ అండ్ టీ	1364.60	1404.10	1341.30
సీమెన్స్	1166.55	1206.10	1130.30
థెర్మాక్స్	1094.95	1137.20	1040.50

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	64.30	67.10	61.70
బజాజ్ ఆటో	2707.60	2767.90	2654.90
హీరో మోటోకార్ప్	2622.25	2663.30	2579.50
ఎం అండ్ ఎం	545.55	559.60	523.00
మారుతీ సుజుకీ	6099.90	6288.50	5832.90
టాటా మోటార్స్	122.05	128.90	117.30
టీవీఎస్ మోటార్	388.55	400.00	374.70

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	371.15	379.30	360.10
ఆర్‌కామ్	1.30	1.40	1.20
ఆర్ఐఎల్	1162.10	1186.50	1140.10
టాటా కమ్యూనికేషన్స్	462.90	478.10	454.00
వొడాఫోన్ ఐడియా	5.35	6.20	4.90

జామ్‌నగర్‌లో ఇక విమాన ఇంధనం, పెట్రో రసాయనాల ఉత్పత్తి మాత్రమే?

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో ఇకపై విమాన ఇంధనం (ఏటీఎఫ్), పెట్రో రసాయనాలు మాత్రమే ఉత్పత్తి చేయాలని నిర్ణయించిందని సమాచారం. అధిక విలువ కలిగిన ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చే వ్యూహంలో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్‌లో విద్యుత్ వాహనాల వినియోగం పెరిగి ఇంధన గిరాకీలో మార్పులు రావొచ్చని, ఇందుకు అనుగుణంగా సిద్ధమవ్వాలని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం జామ్‌నగర్ రిఫైనరీలో ముడిచమురును పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, విమాన ఇంధనం, నాఫ్తా, ఇతర విలువ జోడింపు ఇంధనాలుగా మారుస్తున్నారు.

20,000 మందికి శిక్షణ

ఎన్ఎస్‌డీసీతో ఫ్లిప్‌కార్ట్ భాగస్వామ్యం

దిల్లీ: సరఫరా వ్యవస్థల్లో విధులు నిర్వర్తించే 20,000 మందికి శిక్షణ ఇచ్చేందుకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ)కు చెందిన లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (ఎల్ఎస్‌సీ)తో ఒప్పందం చేసుకున్నట్లు వాల్‌మార్ట్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఆదివారం తెలిపింది. తదుపరి మరో 30,000 మందికి కూడా ఈ శిక్షణ ఇప్పిస్తామని ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. మే నెల నుంచి ఇప్పటివరకు 4,000 మందికి శిక్షణ పూర్తి చేసినట్లు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. వీరికి 'రికగ్నిషన్ ఆఫ్ ప్రైయర్ లెర్నింగ్' సర్టిఫికెట్‌ను నైపుణ్యాభివృద్ధి, ఎంట్రప్రెన్యూర్‌షిప్ శాఖ అందిస్తోంది.

కొత్త ట్రక్కులు ఇప్పుడు కొనొద్దు

● వ్యాపారం ఏమీ బాగాలేదు

● సభ్యులకు రవాణా సంఘాల సూచన

దిల్లీ: ప్రభుత్వ విధానాలు రవాణా రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని, వ్యాపారం చేయడం కష్టతరంగా మారిందని ఆలిండియా ట్రాన్స్‌పోర్టర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ (ఏఐటీడబ్ల్యూఏ), ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) పేర్కొన్నాయి. అధిక వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రేటు, డీజిల్‌పై రూ.2 సెస్సు, బీమా మొత్తం పెరగడం, లాభాలు వస్తాయని అంచనా వేసి విధించే (ప్రిస్క్రిప్టివ్) పన్ను పెంచడం వల్ల రవాణా సంస్థలపై పెనుభారం పడిందని వెల్లడించాయి. వ్యాపారం అసలేమీ బాగోనందున, ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త ట్రక్కుల కొనుగోళ్లకు దూరంగా ఉండాలని సభ్యులకు ఈ రెండు సంఘాలు సూచించాయి. ఇప్పటికే పలువురు ట్రక్కుల యజమానులు రుణ వాయిదాలు చెల్లించడంలో విఫలమైనట్లు వివరించాయి. వాహన రవాణా లాభదాయకమైన వ్యాపారం కాని పరిస్థితులు నెలకొన్నాయని ఏఐటీడబ్ల్యూఏ జాతీయ అధ్యక్షుడు మహేంద్ర ఆర్య అన్నారు. ఆగస్టు నుంచి దిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు సహా పలు నగరాల్లో ప్రధాన రవాణా సంఘాలు కొత్త వాహనాలు కొనుగోలు చేయకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. గత ఆరు నెలలుగా కొత్త వాహనాలు ఎవరూ కొనడం లేదని ఏఐఎంటీసీ కోర్ కమిటీ ఛైర్మన్ మల్కిత్ సింగ్ వెల్లడించారు. జీఎస్‌టీ రేటును 28 శాతం నుంచి వెంటనే 18 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు.

జెట్‌కు అనిల్ అగర్వాల్ బిడ్

ముంబయి: జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ కోసం వేదాంతా రిసోర్సెస్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) బిడ్ దాఖలు చేశారు. తన కుటుంబ పెట్టుబడి సంస్థ అయిన వోల్కన్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా అనిల్ అగర్వాల్ తన ఈఓఐ దాఖలు చేశారని సమాచారం. పనామా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే అవంతులో గ్రూప్, మరో రష్యా కంపెనీ కూడా జెట్ కోసం ఈఓఐ దాఖలు చేశాయని తెలిసింది. వేదాంతా గ్రూప్‌నకు చెందిన వేదాంతా రిసోర్సెస్‌లో 100 శాతం వాటా వోల్కన్ ఇన్వెస్ట్‌మెంట్‌కు ఉంది. కొత్తగా విమానయాన రంగంలోకి ప్రవేశించే ఉద్దేశంతోనే జెట్‌కు ఈఓఐను వోల్కన్ దాఖలు చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ బిడ్‌తో వేదాంతాకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. వేదాంతా గ్రూప్‌నకు భారత్‌లో విమానయానంపై ఎటువంటి ఆసక్తి లేదు. ఈ సంస్థ తమ ప్రైవేటు జెట్‌తో పాటు హెలికాప్టర్‌ను కూడా కొన్నేళ్ల క్రితం ఇతరులకు విక్రయించింది కూడా. శనివారం మధ్యాహ్నం వరకు ఈఓఐ దాఖలు చేసే వీలుండగా, ఆ సంస్థ భాగస్వామి అయిన ఎతిహాద్ ఎయిర్‌వేస్ దూరంగా ఉండిపోయింది. సామర్థ్యం కలిగిన దరఖాస్తుదార్ల జాబితాను ఈనెల 13న జారీ చేస్తామని పరిష్కార నిపుణుడు తెలిపారు.

స్థిరాస్తి సమస్యలకు పరిష్కారం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ: ఆర్థిక మందగమనం నేపథ్యంలో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల వివిధ రంగాల ప్రతినిధులతో వరుసగా సమావేశమై, సమస్యలు పరిష్కారాలను అన్వేషించే పనిలో ఉన్నారు. స్థిరాస్తి అభివృద్ధిదారులు, గృహ కొనుగోలుదార్ల సంఘాల ప్రతినిధులతో ఆదివారం ఆమె సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా ద్రవ్య లభ్యత సంక్షోభం, గిరాకీ మందగించడం, ప్రాజెక్టులు నిలిచిపోవడం, పన్ను సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు రుణాలు ఇచ్చేలా చూడాలని కోరారు. సమస్యల్ని సానుకూలంగా విన్న ఆర్థిక మంత్రి త్వరలోనే వీటికి పరిష్కార మార్గాలు సూచిస్తామని వెల్లడించారు. ఆర్థిక మంత్రితో సమావేశమైన వారిలో క్రెడాయ్, నారెడ్కో, గృహ కొనుగోలుదార్ల అసోసియేషన్ల ప్రతినిధులు ఉన్నారు. వీరితోపాటు గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి, ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయాలు ఆశిస్తున్నట్లు స్థిరాస్తి రంగ ప్రతినిధులు పేర్కొన్నారు. గృహరుణాలపై 7 శాతం వడ్డీరేటు అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. నిలిచిపోయిన ప్రాజెక్టులను ఆదుకునేందుకు 'స్ట్రెస్‌ఫండ్' ఏర్పాటు చేసే విషయాన్ని చర్చించేందుకు మంత్రిమండలి కార్యదర్శి నేతృత్వంలో కొన్ని వారాల్లో సమావేశం జరగనుంది.

చైనాకు నాట్కో క్యాన్సర్ ఔషధాలు

దిల్లీ: అమెరికా విపణిలో ప్రతికూలతల నేపథ్యంలో ఇతర దేశాల్లో వ్యాపార కార్యకలాపాల విస్తరణపై నాట్కో ఫార్మా దృష్టి పెట్టింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఔషధ విపణి అయిన చైనాలో, కేన్సర్ చికిత్సకు వినియోగించే ఔషధాల విక్రయానికి నాట్కో దరఖాస్తు చేయనుందని కంపెనీ 2018-19 వార్షిక నివేదికలో నాట్కో ఫార్మా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ నన్నపనేని తెలిపారు. ఆస్ట్రేలియా, సింగపూర్, చైనా, అగ్నేయాసియా దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నామని, భవిష్యత్‌లో ఈ దేశాల్లో వ్యాపారాలు వృద్ధికి దోహదపడతాయని వెల్లడించారు. సమీపకాలంలో కంపెనీ వృద్ధికి భారత్, బ్రెజిల్, కెనడా విపణులు కీలకమని అన్నారు.

సహజవాయువు సానుకూలమే!

కమొడిటీస్ ఈ వారం

● బంగారం, వెండి

పసిడి కాంట్రాక్టు గతవారం దాదాపు 5 శాతం వరకు పెరిగింది. కిందటి సోమవారం రూ.36,192 వద్ద సానుకూలంగా ప్రారంభమైన కాంట్రాక్టు.. ఆ తర్వాత రూ.36,020 స్థాయికి దిగివచ్చింది. ఇది వారం కనిష్ఠ స్థాయి. బుధవారం కొనుగోళ్ల దన్నుతో దూసుకెళ్లి రూ.38,488 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. చివర్లో కొంత దిద్దుబాటుకు లోనైనప్పటికీ వారం మొత్తం మీద 4.94% లాభంతో రూ.37,981 వద్ద ముగిసింది. ఈ వారం కేవలం నాలుగు రోజుల పాటే ట్రేడింగ్ జరగనుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం సెలవు. బక్రీద్ సందర్భంగా నేడు సాయంత్రం మాత్రమే ట్రేడింగ్ జరుగుతుంది. సాంకేతికంగా చూస్తే.. కాంట్రాక్టు ఇప్పటికే మోతాదుకు మించి పెరిగినందున, అధిక స్థాయిల వద్ద నిరోధం ఎదురుకావచ్చు. అదే సమయంలో అమెరికా- చైనా వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత పెరిగితే, అది పసిడి కాంట్రాక్టుకు సానుకూలత తెచ్చిపెట్టొచ్చు. రూ.38,488 ఎగువన ట్రేడ్ కాకుంటే కాంట్రాక్టుకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చనే విషయాన్నీ దృష్టిలో ఉంచుకోవాలి. వెండి సెప్టెంబరు కాంట్రాక్టు వరుసగా ఐదోవారమూ లాభాలతో ముగిసింది. గత వారం రూ.41,519 వద్ద సానుకూలంగా ఆరంభమైన కాంట్రాక్టు.. ఆ తర్వాత కూడా జోరు కనబరుస్తూ రూ.43,950 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. అనంతరం లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో 4.34% లాభపడి రూ.43,320 వద్ద స్థిరపడింది. ఈవారం సాంకేతికంగా కాంట్రాక్టు కిందకు దిగివచ్చే అవకాశం కనిపిస్తోంది. అయితే అమెరికా- చైనా వాణిజ్య యుద్ధ పరిణామాల నేపథ్యంలో మరింత పడిపోకపోవచ్చనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకుని ట్రేడ్ చేయడం మంచిది. వీటన్నింటి దృష్ట్యా రూ.44,444 ఎగువకు వెళ్లాక మాత్రమే షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవడం మంచి వ్యూహం అవుతుంది.

● ప్రాథమిక లోహాలు

రాగి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.432.30 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే సమీపకాలంలో రూ.450; రూ.453 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. సీసం ఆగస్టు కాంట్రాక్టుకు ఈవారం కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు. అయితే రూ.153.15 దిగువకు రానంత వరకు సానుకూల ధోరణి కొనసాగేందుకే అవకాశం ఉంటుంది. జింక్ ఆగస్టు కాంట్రాక్టు ఇప్పటికే మోతాదుకు మించి అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ.. మరికొంత దిగివచ్చే అవకాశాలు లేకపోలేదు. రూ.177.25- 178.65 మధ్య కొనుగోలు చేయొచ్చు. అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు ఈవారం సానుకూలంగానే చలించొచ్చు. నేడు రూ.140.05 ఎగువన ముగిస్తే రూ.142.55 వరకు వెళ్లే వీలుంటుంది. నికెల్ ఆగస్టు కాంట్రాక్టు ఈవారం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. రూ.1,071 లక్ష్యంతో రూ.1,209 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు.

● ఇంధన రంగం

ముడి చమురు ఆగస్టు కాంట్రాక్టుకు ఈవారం రూ.3,732- 3,672 మధ్య కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిల కంటే కిందకు వస్తే రూ.3,592; రూ.3,457 వరకు పడిపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ స్థాయిలపై ఓ కన్నేసి ఉండం మంచిది. ఈ రోజు రూ.3,892 కంటే పైన ముగిస్తే రూ.4,171 వరకు వెళుతుందని భావించవచ్చు. సహజవాయువు ఆగస్టు కాంట్రాక్టుకు ఈవారం రూ.153.15 వరకు లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఆగస్టు కాంట్రాక్టు ఈవారం 15 వారాల చలన సగటు కంటే దిగువన చలించకుంటే మరి కొంత పైకి వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే రూ.555.15 స్థాయి వద్ద కాంట్రాక్టుకు నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయి వద్ద కొంత షార్ట్

ఛాంపియన్

ఛాంప్ సౌరభ్

రన్నరప్‌గా సిక్కి జోడీ

ఈనాడు, హైదరాబాద్: భారత వర్ధమాన ఆటగాడు సౌరభ్‌వర్మ సత్తాచాటాడు. హైదరాబాద్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఏడో సీడ్ సౌరభ్ 21-13, 14-21, 21-16తో కీన్ యూ (సింగపూర్)పై విజయం సాధించాడు. అతని సోదరుడు సమీర్‌వర్మ గత ఏడాది ఇదే టోర్నీలో విజేతగా నిలవగా.. ఈసారి సౌరభ్ టైటిల్ గెలుచుకోవడం విశేషం. మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప జోడీ రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఫైనల్లో టాప్ సీడ్ సిక్కి-అశ్విని 17-21, 17-21తో హా బేక్- జుంగ్ యుంగ్ (కొరియా) చేతిలో ఓడారు. మహిళల సింగిల్స్‌లో జియా మిన్ (సింగపూర్), పురుషుల డబుల్స్‌లో షోహిబుల్- మౌలానా (ఇండోనేసియా), మిక్స్‌డ్ డబుల్స్‌లో పాంగ్ రాన్- యూ సీ (మలేసియా) విజేతలుగా నిలిచారు.

అశ్విని, సిక్కిరెడ్డి

సామియాకు స్వర్ణం

దిల్లీ: బల్గేరియా జూనియర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగమ్మాయి సామియా ఇమాద్ ఫారూఖీ మెరిసింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో సామియా స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. బాలికల సింగిల్స్ ఫైనల్లో సామియా 9-21, 21-12, 22-20తో రెండో సీడ్ అనస్తేసియా షపావలోవా (రష్యా)పై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో ఇషాన్- విష్ణువర్ధన్ 19-21, 18-21తో విలియమ్ జోన్స్- బ్రాండన్ (ఇంగ్లాండ్) చేతిలో ఓడటంతో రజతానికి పరిమితమయ్యారు.

మెరిసిన అర్జున్, సుహాస్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జాతీయ అండర్-9 ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు ఆదిరెడ్డి అర్జున్, ఆకుల సుహాస్ పతకాలతో మెరిశారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో అర్జున్ రజతం, సుహాస్ కాంస్యం సొంతం చేసుకున్నారు. ఎనిమిదో రౌండ్ వరకు అగ్రస్థానంలో నిలిచి టైటిల్ గెలిచేలా కనిపించిన అర్జున్.. ఆ తర్వాత రెండు రౌండ్లలో తడబడ్డాడు. తిరిగి పుంజుకున్న అతను చివరి రౌండ్లలో విజయాలు సాధించి 9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. సుహాస్ ఎనిమిది పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గాడు. వీరిద్దరు ఆసియా, ప్రపంచ జూనియర్ చెస్ టోర్నీలకు అర్హత పొందారు.

వినేశ్‌కు రజతం

దిల్లీ: వరుసగా నాలుగో స్వర్ణాన్ని సాధించే అవకాశం భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ చేజారింది. బెలారస్‌లో ముగిసిన మెడ్వెడ్ అంతర్జాతీయ రెజ్లింగ్ టోర్నీ 53 కిలోల ఫైనల్లో వినేశ్ పరాజయంపాలై.. రజతంతో సరిపెట్టుకుంది. ఏకపక్షంగా సాగిన ఈ పోరులో వినేశ్ 0-10తో ఓడిపోయింది. ఈ టోర్నీకి ముందు స్పెయిన్ గ్రాండ్‌ప్రి, యాసర్ డోగు, పోలెండ్ ఓపెన్ టోర్నీల్లో ఆమె స్వర్ణం గెలుచుకుంది. మెడ్వెడ్ టోర్నీలో మరో రెండు రజతాలు భారత్ సొంతమయ్యాయి. సరిత (57 కిలోలు), పింకి (55 కిలోలు) కూడా ఫైనల్లో ఓడారు. సాక్షి మలిక్ (62 కిలోలు), నవ్‌జోత్ (68 కిలోలు), రాణి (72 కిలోలు), కిరణ్ (76 కిలోలు).. పురుషుల 57 కిలోల విభాగంలో రవి కుమార్ కాంస్య పతకాలు సాధించారు.

శతక దాహం తీరింది

ఫార్మాట్ ఏదైనా సరే.. మంచినీళ్ల ప్రాయంగా శతకాలు బాదేసే బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లి. మిగతా బ్యాట్స్‌మెన్ అర్ధసెంచరీలు కొట్టినట్లుగా అతను సెంచరీ బాదేస్తుంటాడు. అయితే ఆశ్చర్యకరంగా అయిదు నెలలుగా ఇటు అంతర్జాతీయ క్రికెట్లో.. అటు ఐపీఎల్‌లో.. వివిధ ఫార్మాట్లలో ఎక్కడా మూడంకెల స్కోరు సాధించలేకపోయాడు విరాట్. ప్రపంచకప్‌లో నిలకడగా రాణించినా.. శతకం అందలేదు. ఎట్టకేలకు వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత కెప్టెన్ సెంచరీ సాధించాడు. ఒకప్పట్లా సాధికారతతో బ్యాటింగ్ చేసిన కోహ్లి.. అలవోకగా సెంచరీ (120) కొట్టేశాడు. కొత్త కుర్రాడు శ్రేయస్ అయ్యర్ (71) కూడా రాణించడంతో విండీస్ ముందు భారత్ 280 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది.

విరాట్ కోహ్లి

120

26 ఏళ్ల రికార్డు బద్దలు

వెస్టిండీస్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా పాకిస్థాన్ మాజీ ఆటగాడు జావేద్ మియాందాద్ పేరిట ఉన్న 26 ఏళ్ల రికార్డును టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి బద్దలు కొట్టాడు. ఇంకో 19 పరుగులు చేస్తే రికార్డును అందుకునే స్థితిలో.. విరాట్ ఆదివారం రెండో వన్డేలో శతకమే (120) బాదాడు. దీంతో కరీబియన్ జట్టుపై అతడి పరుగుల సంఖ్య 2032కు చేరుకుంది. అతడికిది విండీస్‌పై 35వ ఇన్నింగ్స్ మాత్రమే. మియాందాద్ 64 ఇన్నింగ్స్‌లో 1930 పరుగులతో రికార్డు నెలకొల్పాడు. అతను 1993లో విండీస్‌పై చివరి మ్యాచ్ ఆడినప్పటి నుంచి కొనసాగుతున్న రికార్డును కోహ్లి బద్దలు కొట్టాడు. సచిన్ నాలుగు దేశాలపై వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా కొనసాగుతుండటం విశేషం.

వన్డేల్లో టాప్-5 భారత బ్యాట్స్‌మెన్

- సచిన్ (18,426)
- కోహ్లి (11,406)
- గంగూలీ (11,363)
- ద్రవిడ్ (10,889)
- ధోని (10,773)

42

కోహ్లి శతకాల సంఖ్య. వన్డేల్లో అత్యధిక శతకాల వీరుడు సచిన్ (49)కు ఇంకో 7 సెంచరీల దూరంలోనే ఉన్నాడు.

దాదాను దాటిన విరాట్

వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాట్స్‌మెన్‌లో కోహ్లి రెండో స్థానానికి దూసుకెళ్లాడు. అతను సౌరభ్ గంగూలీ (11,363)ని దాటేశాడు. ఆదివారం సెంచరీ తర్వాత విరాట్ వన్డే పరుగులు 11,406కు చేరుకున్నాయి. సచిన్ 18,426 పరుగులతో భారత్ తరపునే కాదు.. ప్రపంచంలోనే అత్యధిక వన్డే పరుగుల వీరుడిగా కొనసాగుతున్నాడు. తెందుల్కర్ తర్వాత వరుసగా సంగక్కర (14,234), పాంటింగ్ (13,704), జయసూర్య (13,430), జయవర్ధనె (12,650), ఇంజమామ్ (11,739), జాక్వస్ కలిస్ (11,579) ఉండగా.. కోహ్లి ఎనిమిదో స్థానానికి చేరాడు.

- అయిదు నెలల తర్వాత విరాట్ సెంచరీ
- అర్ధశతకంతో మెరిసిన శ్రేయస్ అయ్యర్
- వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్ 279/7

పోర్ట్ ఆఫ్ స్పెయిన్

కెప్టెన్ విరాట్ కోహ్లి (120; 125 బంతుల్లో 14×4, 1×6) చక్కటి శతకానికి, శ్రేయస్ అయ్యర్ (71; 68 బంతుల్లో 5×4, 1×6) సమయోచిత అర్ధశతకం తోడవడంతో వెస్టిండీస్‌తో రెండో వన్డేలో మెరుగైన స్కోరు సాధించింది. 50 ఓవర్లలో 7 వికెట్లకు 279 పరుగులు చేసింది. కోహ్లి, అయ్యర్‌ల భాగస్వామ్యంతో 300 దాటేలా కనిపించిన భారత్‌కు కార్లోస్ బ్రాత్‌వైట్ (3/53), రోస్టన్ చేజ్ (1/37) కళ్లెం వేశారు. మ్యాచ్‌కు వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించింది. దీంతో విండీస్ లక్ష్యాన్ని 46 ఓవర్లలో 270గా సవరించారు. కడపటి వార్తలందేసరికి ఆ జట్టు 26 ఓవర్లలో 3 వికెట్లకు 139 పరుగులు చేసింది. గేల్ (11), షై హోప్ (5), హెట్‌మయర్ (18) ఔటయ్యారు. లూయిస్ (58 బ్యాటింగ్), పూరన్ (29 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఓపెనర్లు విఫలం: అంతకుముందు టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఓపెనర్లు ధావన్, రోహిత్ జట్టుకు ఆశించిన ఆరంభాన్నివ్వలేదు. కాట్రెల్ వేసిన తొలి ఓవర్లోనే భారత్‌కు షాక్ తగిలింది. మూడో బంతికి ధావన్ (2) వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ ఔటివ్వకపోయినా విండీస్ సమీక్షలో ఈ వికెట్ సాధించింది. తొలి ఓవర్లోనే క్రీజులోకి వచ్చిన విరాట్.. ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. రోచ్ వేసిన రెండో ఓవర్లో రెండు ఫోర్లు కొట్టాడు. ఆ తర్వాత కూడా అతను జోరు కొనసాగించాడు. అయితే మరో ఓపెనర్ రోహిత్ మాత్రం క్రీజులో బాగా ఇబ్బంది పడ్డాడు. మరీ నెమ్మదిగా బ్యాటింగ్ చేశాడు. 10 ఓవర్లకు భారత్ స్కోరు 55 కాగా.. అందులో కోహ్లి స్కోరే 38. రోహిత్ అప్పటికి 20 బంతుల్లో 9 పరుగులే చేశాడు. ఆ తర్వాత కూడా విరాటే స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. 16వ ఓవర్ వరకు క్రీజులో ఉండి 18 పరుగులే చేసిన రోహిత్.. చేజ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయి పూరన్‌కు దొరికిపోయాడు. నాలుగో స్థానంలో వచ్చిన రిషబ్ పంత్ (20) ఎప్పట్లా ఆవేశపడకుండా కొంచెం కుదురుగా ఆడే ప్రయత్నం చేశాడు. అయితే అతను నిలదొక్కుకుంటున్న సమయంలో బ్రాత్‌వైట్ అతడిని బౌల్డ్ చేశాడు.

అయ్యర్ అదరహో..: కెరీర్లో ఏడు వన్డేలు మాత్రమే ఆడిన శ్రేయస్ అయ్యర్ క్రీజులోకి వచ్చేటప్పటికి స్కోరు 22.2 ఓవర్లలో 101/3. ఇంకో వికెట్ పడితే భారత్ చాలా ఇబ్బందికర పరిస్థితికి చేరుకునేదే. అయితే ఈ యువ బ్యాట్స్‌మన్ కెప్టెన్‌తో కలిసి ఏ తడబాటు లేకుండా ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసి జట్టు మంచి స్థితికి చేరడంలో కీలక పాత్ర పోషించాడు. మొదట షాట్లకు వెళ్లకుండా స్ట్రైక్ రొటేట్ చేయడంపై దృష్టిసారించిన అతను.. కుదురుకున్నాక బ్యాట్‌కు పని చెప్పాడు. మరోవైపు వికెట్లు పడటంతో కొంచెం నెమ్మదించిన కోహ్లి.. అయ్యర్ అండ దొరకడంతో జోరు పెంచాడు. దీంతో పరుగులు ధారాళంగా వచ్చాయి. 38వ ఓవర్లో 112 బంతుల్లో కోహ్లి శతకం పూర్తయింది. కాసేపటికే అయ్యర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. 41 ఓవర్లకు 225/3తో భారత్‌ను కోహ్లి, అయ్యర్ పటిష్ట స్థితికి చేర్చారు. ఇద్దరూ మంచి ఊపుమీదుండటం స్కోరు అలవోకగా 300 దాటుతుందనిపించింది. ఐతే చివరి ఓవర్లలో విండీస్ బౌలర్లు గొప్పగా పుంజుకున్నారు. కోహ్లి, అయ్యర్‌లను ఔట్ చేశారు. వర్షం కూడా భారత్ లయను దెబ్బ తీసింది. జాదవ్ (16), జడేజా (16 నాటౌట్) బ్యాట్ ఝుళిపించలేకపోయారు. చివరి 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయిన భారత్ 54 పరుగులే చేసింది.

భారత్ ఇన్నింగ్స్: ధావన్ ఎల్బీ (బి) కాట్రెల్ 2; రోహిత్ (సి) పూరన్ (బి) చేజ్ 18; కోహ్లి (సి) రోచ్ (బి) బ్రాత్‌వైట్ 120; పంత్ (బి) బ్రాత్‌వైట్ 20; శ్రేయస్ (బి) హోల్డర్ 71; జాదవ్ రనౌట్ 16; జడేజా నాటౌట్ 16; భువనేశ్వర్ (సి) రోచ్ (బి) బ్రాత్‌వైట్ 1; షమి నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (50 ఓవర్లలో 7 వికెట్లకు) **279; వికెట్ల పతనం:** 1-2, 2-76, 3-101, 4-226, 5-250, 6-258, 7-262; **బౌలింగ్:** కాట్రెల్ 10-0-49-1; రోచ్ 7-0-54-0; హోల్డర్ 9-0-53-1; ఒషేన్ థామస్ 4-0-32-0; రోస్టన్ చేజ్ 10-1-37-1; కార్లోస్ బ్రాత్‌వైట్ 10-0-53-3

300

గేల్ ఆడిన వన్డేల సంఖ్య. ఈ ఘనత సాధించిన తొలి వెస్టిండీస్ ఆటగాడు అతనే. బ్రయాన్ లారా (299) ఒక్క మ్యాచ్ తేడాతో ఈ మైలురాయికి దూరమయ్యాడు.

వెస్టిండీస్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గానూ గేల్ రికార్డు నెలకొల్పాడు. ఆదివారం 7 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద లారా (10,348)ను అతను అధిగమించాడు.

పోరాడి ఓడిన భారత్

ఆసియా అండర్-23 వాలీబాల్

దిల్లీ: ఆసియా అండర్-23 వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి చరిత్ర సృష్టించే అవకాశాన్ని భారత పురుషుల జట్టు చేజార్చుకుంది. ఆదివారం మయన్మార్‌లో హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో భారత్ 1-3 (21-15, 20-25, 25-19, 23-25) తేడాతో చైనీస్ తైపీ చేతిలో ఓడి రజతంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. తొలిసారి ఈ ఛాంపియన్‌షిప్ తుదిపోరుకు చేరిన భారత్.. ఫైనల్లో పోరాడింది. తన కంటే మెరుగైన ప్రత్యర్థికి గట్టి సవాలు విసిరింది. అయితే కీలక సమయాల్లో పట్టు విడిచి తొలి రెండు సెట్లను కోల్పోయింది. మూడో సెట్లో అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి ఆశలు రేపింది. నాలుగు సెట్ ఆరంభంలోనూ దూకుడుగా ఆడినా.. అదే జోరు కొనసాగించలేక ఓడిపోయింది.. ఈ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా భారత్.. ఎఫ్ఐవీబీ ప్రపంచ పురుషుల అండర్-23 ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

వరుసగా 17 విజయాలు

మహిళల టీ20ల్లో థాయ్‌లాండ్ రికార్డు

దుబాయి: మహిళల టీ20ల్లో థాయ్‌లాండ్ సరికొత్త రికార్డు నమోదు చేసింది. వరుసగా 17 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో విజయాలతో చరిత్ర సృష్టించింది. నాలుగు దేశాల టోర్నీలో భాగంగా నెదర్లాండ్స్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో ఓడించిన థాయ్‌లాండ్ ఈ రికార్డును ఖాతాలో వేసుకుంది. ఇదివరకు ఈ రికార్డు ఆస్ట్రేలియా మహిళల జట్టు (16) పేరిట ఉంది. నిరుడు జులైలో యుఏఈపై విజయంతో మొదలైన థాయ్‌లాండ్ జైత్రయాత్ర కొనసాగుతూనే ఉంది.

టైటాన్స్ బోణీ కొట్టిందోచ్

గుజరాత్‌పై గెలుపు

అహ్మదాబాద్

ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు అభిమానుల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు తెలుగు టైటాన్స్ బోణీ కొట్టింది. ఆదివారం మ్యాచ్‌లో టైటాన్స్ 30-24 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌పై గెలిచి విజయాల ఖాతా తెరిచింది. రైడింగ్‌లో సిద్ధార్థ్ దేశాయ్ (7), ట్యాక్లింగ్‌లో విశాల్ భరద్వాజ్ (7) చెలరేగి విజయాల కరవు తీర్చారు. టైటాన్స్ మ్యాచ్‌ను మెరుగ్గా ఆరంభించింది. ఆరంభంలో దేశాయ్ సోదరులు పాయింట్లు తేవడం, డిఫెండర్లు సత్తాచాటడంతో తొలి ఆరు నిమిషాలకే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టైటాన్స్ 9-4తో నిలిచింది. రైడర్లు రోహిత్ గులియా (5), సచిన్ (4) చెలరేగడంతో గుజరాత్ పుంజుకున్నట్లు కనిపించింది. కానీ టైటాన్స్ ఆటగాళ్లు దూకుడు కొనసాగించి 17-13తో తొలి అర్ధభాగాన్ని ముగించారు. విరామం తర్వాత పోరు ఉత్కంఠభరితంగా సాగింది. రెండు జట్లు పాయింట్ల కోసం తీవ్రంగా పోటీపడ్డాయి. ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ తెలివిగా ఆడిన టైటాన్స్ పైచేయి సాధిస్తూ వచ్చింది. ట్యాక్లింగ్‌లో పర్వేశ్ (7) రెచ్చిపోవడంతో గుజరాత్ పోటీలోకి వచ్చినట్లే అనిపించింది. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఆడుతూ వచ్చిన టైటాన్స్ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. మరో నాలుగు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా టైటాన్స్ 28-23తో మ్యాచ్‌పై పట్టు కొనసాగించింది. ఆఖర్లో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశాన్ని ఇవ్వని టైటాన్స్ ఈ సీజన్‌లో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 33-30 తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. రోహిత్ కుమార్ (10), పవన్ సెహ్రావత్ (5) రైడింగ్‌లో పోటీపడి పాయింట్లు తేవడంతో బుల్స్ 6-1తో ఆధిక్యం సంపాదించింది. పదో నిమిషంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 12-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రైడింగ్‌లో వికాస్ కండోలా (11), ట్యాక్లింగ్‌లో వికాస్ కాలె (6) సత్తాచాటడంతో తిరిగి పుంజుకొన్న హరియాణా.. బుల్స్‌ను ఆలౌట్ చేసి తొలి అర్ధభాగాన్ని 16-17తో ముగించింది. విరామం తర్వాత అదే జోరు కొనసాగించి మ్యాచ్ సొంతం చేసుకుంది.

ప్రొ కబడ్డీలో ఈనాడు

బంగాల్ × టైటాన్స్ (రా. 7:30 నుంచి)
యూపీ × బెంగళూరు (రా. 8:30 నుంచి)

మొదట అదే పని చేస్తా

గౌతమ్ గంభీర్

క్రికెట్‌ను అమితంగా ఆరాధించే గడ్డపై టీమ్‌ఇండియా అడుగుపెట్టింది. లారా, హూపర్ కళాత్మక ఆట.. వివ్ రిచర్డ్స్ ఆధిపత్యం.. ఫాస్ట్ బౌలర్ల దూకుడు.. చందర్‌పాల్ బ్యాటింగ్ ప్రభావం.. స్టాండ్స్ నుంచి వినిపించే సల హాలు.. కరీబియన్ క్రికెట్ అంటే ఇవన్నీ గుర్తొస్తాయి. ఇలాంటివి ప్రతి ఒక్కరిని క్రికెట్ అభిమానిగా మార్చేస్తాయి. ఇక ఇప్పటి సంగతి కొస్తే.. విండీస్ బ్యాటింగ్‌లో నిలకడ లేదు. బౌలింగ్‌లో పదును తగ్గింది. విండీస్ క్రికెట్‌ను చూస్తుంటే బాధగా.. కోపంగా అనిపిస్తోంది. అక్కడి స్టేడియాల్లోని స్టాండ్స్ ఖాళీగా ఉంటున్నాయి. కనిపించే కొద్దిపాటి ప్రేక్షకులు అమెరికా నుంచి వచ్చే భారత అభిమానులే. నిజమైన విండీస్ అభిమాని ఎప్పుడో ఆటకు దూరమయ్యాడు. విండీస్ ఒక్కటే కాదు.. మొత్తం క్రికెట్ ప్రమాణాలే పడిపోయాయి. లార్డ్స్‌లో ప్రపంచకప్ ఫైనల్ అద్భుతంగా సాగింది. అయితే 80, 90ల్లో కనిపించిన నాణ్యమైన క్రికెట్ ఇప్పుడు ఎక్కడుంది? విండీస్ శిబిరంలో నేనుంటే తొలుత చేసే పని పేస్, బౌన్సీ వికెట్లను తయారు చేయడమే. భారత పేసర్లను దృష్టిలో పెట్టుకుని విండీస్ బ్యాటింగ్ వికెట్లను సిద్ధం చేసింది. టీమ్ ఇండియా కోరుకున్నది కూడా అదే.

THE ULTIMATE INVERTER BATTERY
EXIDE INVATUBULAR

లెక్కల్లోకి చెమట చుక్కలు!

- శాస్త్రీయంగా గణించనున్న ఇక్రిశాట్
- తెలంగాణ, ఒడిశాల్లోని 120 మంది రైతులపై పరీక్షలు
- శ్రమ, సమయం తగ్గించేలా చర్యలు
- సరైన ఆహారం అందేలా విధానాల్లో మార్పునకు కృషి

పొలాల్లో కర్షకులు రోజంతా ఏ స్థాయిలో శ్రమిస్తున్నారు? ఎలాంటి పనులకు ఎంత శక్తిని వెచ్చిస్తున్నారు? నిరంతరం స్వేదం చిందిస్తున్న అన్నదాతలు అందుకు తగ్గట్టు ఆహారం తీసుకుంటున్నారా? లేదా అనే అంశాలపై ఇప్పటివరకు స్పష్టమైన లెక్కలేవీ లేవు. వీటిని పక్కాగా సేకరించేందుకు ఇక్రిశాట్ సిద్ధమైంది.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)తోపాటు యూకేకి చెందిన రెడింగ్, ఈస్ట్ ఆంగ్లియా విశ్వవిద్యాలయాలకు చెందిన మొత్తం ఏడుగురు శాస్త్రవేత్తలు ఇందులో పాలుపంచుకుంటున్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూరు మండలంలో మూడు గ్రామాలు, ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని మూడు గ్రామాల్లో కలిపి మొత్తం 120 మంది కర్షకులను ఇందుకు ఎంపిక చేశారు. ఈ నమూనా ప్రాజెక్టును ఆగస్టులో మొదలుపెట్టి వచ్చే ఏడాది మేలోగా పూర్తి చేయనున్నారు. ఇందుకోసం గణకులకు శిక్షణ సైతం పూర్తి చేశారు.

సాగు పనుల్లో రైతులు దేనికోసం ఎంత కష్టపడాల్సి వస్తుందనే సమాచారాన్ని శాస్త్రీయంగా తెలుసుకోనున్నారు. ఇందుకోసం 'ఆక్టిగ్రాఫ్' అనే ఉపకరణాన్ని రైతు నడుముకు కట్టి వారు చేసే పనులను బట్టి నిమిషానికి ఎంత శక్తి ఖర్చవుతుందనేది లెక్కిస్తారు. ఏ పనికి ఎక్కువ శక్తి వెచ్చించాల్సి వస్తుందనేది తెలుసుకోవచ్చని ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్త పద్మజా రావుల వివరిస్తున్నారు.

ఆక్టిగ్రాఫ్ ఉపకరణంతోపాటు హృదయ స్పందనను గుర్తించే పరికరాన్ని చూపుతున్న శాస్త్రవేత్త పద్మజా రావుల

ప్రతి రైతుకూ కొన్ని పాత్రలను అందించి.. వారు ఆహారం తీసుకునే సమయంలో వీటిని ఉపయోగించేలా చూడనున్నారు. రైతులు ఎలాంటి ఆహారం తీసుకుంటున్నారు? అందులో పోషకాల లభ్యత ఏ మేరకు ఉంది? ఎంత పరిమాణంలో భుజిస్తున్నారనే సమాచారాన్ని విశ్లేషిస్తారు. కొంతమంది హృదయ స్పందనలనూ రికార్డు చేయనున్నారు. మూడు విడతల్లో సమాచారం తీసుకొని దానిని విశ్లేషించి నివేదికను రూపొందించనున్నారు.

ముఖ్య లక్ష్యాలివే

- వ్యవసాయ పనుల్లో కర్షకులు దేనికోసం ఎంత శ్రమ పడాల్సి వస్తుందనేది గుర్తించడం.
- పని సమయంతోపాటు శ్రమను తగ్గించి వారికి మేలు చేసేలా చర్యలు తీసుకోవడం.

- మహిళా రైతులకు ఉపయుక్తంగా ఉండే పరికరాలను రూపొందించేలా కార్యాచరణ.

- సరైన ఆహారం తీసుకునేలా చూడటంతోపాటు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వ విధానాల్లోనూ మార్పులు తెచ్చేందుకు కృషి.
- ప్రయోగ ఫలితాలను బేరీజు వేసుకుని విస్తృతంగా పరిశోధనలు చేయడం.

- ఈనాడు, సంగారెడ్డి

1969 ఉద్యమకారులు మార్గదర్శకులు

- ప్రపంచంలోనే అరుదైన ఉద్యమమిది
- కేంద్రం ప్రకటన జయశంకర్ సారు రాసిచ్చిందే
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఉద్యమకారులకు సన్మానం

సిద్దిపేటలో 1969 ఉద్యమకారులను సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నందిని సిధారెడ్డి, దేవిప్రసాద్, దేశపతి శ్రీనివాస్, ఫారుఖ్‌హుస్సేన్, రఘోత్తంరెడ్డి తదితరులు

సిద్దిపేట - న్యూస్‌టుడే

'ప్రపంచ ఉద్యమాల్లో తెలంగాణ ఉద్యమం అరుదైంది. వందేళ్ల చరిత్ర దీని సొంతం. ప్రాణాలు, పదవి త్యాగాలతోపాటు కేసీఆర్ నేతృత్వంలో సాగిన మలివిడత పోరాటంతో రాష్ట్ర స్వప్నం సాకారమైంది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 1969 ఉద్యమానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిద్దిపేటలో 'సమర స్ఫూర్తికి స్వర్ణోత్సవం' సభను ఆదివారం నిర్వహించారు. అప్పటి ఉద్యమంలో కదం తొక్కిన జిల్లాకు చెందిన దాదాపు 70 మంది ఉద్యమకారులను సన్మానించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. అప్పటి ఉద్యమకారులు మలివిడత ఉద్యమానికి మార్గదర్శకులని చెప్పారు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తి, జయశంకర్ సిద్ధాంత స్ఫూర్తితో తమ లాంటి నేతలు ఉద్యమంలో ఎగిసిపడ్డారన్నారు. 2001లో సిద్దిపేట గడ్డ నుంచి కేసీఆర్ మలివిడత తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. జయశంకర్ సార్ ఉద్యమ భావజాలాన్ని పుస్తకాల ద్వారా సజీవంగా ఉంచి. . కేసీఆర్‌లాంటి నేత కోసం ఎదురు చూశారని. . వెన్నుదన్నుగా నిలిచారని వివరించారు. రాష్ట్ర సాధనకు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తే. . కేంద్రం చేసిన ప్రకటనను జయశంకర్ రాసిచ్చారని తెలిపారు. అప్పటి ఉద్యమకారులను సన్మానించి వారి స్ఫూర్తిని పదిలంగా ఉంచాలనేది తమ ఆశయమని చెప్పారు. నాటి జిల్లా ఉద్యమకారుల చరిత్రను పుస్తకంగా వెలువరిస్తామన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తమకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఇస్తే బాగుండేదని 1969 ఉద్యమకారులు కోరారని గుర్తుచేశారు. వర్తమాన ప్రపంచం ఏకధ్రువంగా మారుతోందని చెప్పారు. సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విత్తనం చనిపోతూ పంటను వాగ్దానం చేసినట్లుగా మలివిడత తెలంగాణ ఉద్యమం సాకారమైందని చెప్పారు. అన్నబత్తుల రవీంద్రనాథ్, జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, మల్లికార్జున్, మదన్‌మోహన్ వంటి వారు నాడు కదం తొక్కారన్నారు. కవిత్వం ద్వారా కాళోజి నారాయణరావు ప్రేరణ కలిగించారని తెలిపారు. 1969లో 369మంది మరణించారని లెక్కలున్నా, అంతకుమించి చనిపోయారన్నారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు రోజా శర్మ, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోలిపేట రాంలింగారెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్‌హుస్సేన్, రఘోత్తంరెడ్డి, కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పాపయ్య పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌లో హైదరాబాద్ విద్యార్థి మృతి

అబిడ్స్, బేగంబజార్, న్యూస్‌టుడే: బీబీఏ ఇంటర్న్‌షిప్ కోసం ఉక్రెయిన్ వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి అక్కడ నదిలో మునిగి మృత్యువాతపడ్డాడు. మరికొద్ది గంటల్లో ఉక్రెయిన్ నుంచి స్వదేశానికి బయలుదేరాల్సి ఉండగా ఈ దుర్ఘటన జరిగింది. ఎంజే మార్కెట్ సమీపంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన రాజేందర్ సింగ్ భాటియా, జస్‌ప్రీత్‌కౌర్ దంపతుల కుమారుడు జస్‌ప్రీత్‌సింగ్ భాటియా(21) ముంబయిలోని అమిటీ కళాశాలలో బీబీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల తరఫున 40 రోజుల ఇంటర్న్‌షిప్ కోసం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. శనివారంతో అది పూర్తయింది. పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో కలిసి ఫియోఫానియా ఉద్యాన సందర్శనకు వెళ్లాడు. స్నానం చేసేందుకు అక్కడి నదిలో దిగగా కాలుజారి పడి మృతి చెందాడు. స్నేహితులు.. జస్‌ప్రీత్‌సింగ్ తండ్రికి సమాచారం అందించారు.

Admission Guidence for TS/UP/KS Top Colleges
MBBS/ VETERINARY
LOW SCORE / LOWEST PACKAGE
9515926206/8466963781

కీకారణ్యంలో 5 రోజులు

సిరికొండ, న్యూస్‌టుడే: అడవిలో పశువులను మేపడానికి వెళ్లిన ఓ గిరిజనుడు దారి తప్పిపోయాడు. దట్టమైన అడవిలోకి వెళ్లిపోయాడు. రెండో రోజు, మూడో రోజు ఆయన కుటుంబసభ్యులు, బంధువులు 15-20 మంది సమీప అడవిలో అణువణువూ వెదికారు. ఎక్కడా కనిపించలేదు. దీంతో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒకరిద్దరు చొప్పున మొత్తం 150 మంది రంగంలోకి దిగారు. 3 బృందాలుగా విడిపోయి అడవిలో మరింత దూరం గాలించారు. చివరికి ఐదో రోజు తమ గ్రామానికి 15 కిమీ దూరంలో దట్టమైన అరణ్యంలో అచేతన స్థితిలో ఉన్న ఆ వ్యక్తిని గుర్తించారు. ఇంటికి చేర్చి నీరు, ఆహారం అందించారు. ఇదీ ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం భీంపూర్ ఏజెన్సీ గ్రామానికి చెందిన సీడం మారు కథ. రోజూ మాదిరిగానే ఈ నెల 6న పశువులను మేపేందుకు అడవికి వెళ్లిన మారు.. కుండపోత వర్షం కురవడంతో ఓ చోట ఆగిపోయాడు. వాన తగ్గాక పశువులు కనిపించక పోవడంతో వాటిని వెదుకుతూ దారి తప్పాడు. పశువులు ఇంటికి చేరినా మారు రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు తమ కృషి ఫలించినందుకు మారు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటికి చేరిన సీడం మారు

కార్మిక సంఘం ఎన్నికల్లో కూన శ్రీశైలంగౌడ్ విజయం

2 ఓట్ల తేడాతో ఓడిన మెదక్ ఎంపీ

చింతల్, న్యూస్‌టుడే: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా చింతల్ ఐడీపీఎల్ పారిశ్రామికవాడలోని హెచ్ఎంటీ ప్రొగాటూల్స్ సంస్థలో ఆదివారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థిగా పోటీ చేసిన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు కూన శ్రీశైలంగౌడ్ విజయం సాధించారు. 65 ఓట్లు సాధించిన శ్రీశైలంగౌడ్.. టీఆర్ఎస్‌కేవీ అభ్యర్థిగా పోటీ చేసిన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై 2 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00